Pubilshed from Vijayawada
PRGI NO : APTEL/2011/41440

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




విజయవాడ VIJAYAWADA | సంపుటి : 14 Vol.No : 14 | సంచిక : 281 Issue No : 281 | శనివారం Saturday | మార్చి 7, 2026 7 MARCH 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



ఎపి శాసనసభ నిరవధిక

## వాయిదా

» 15 రోజులు సమావేశాలు జరిగాయి
» వివరాలు వెల్లడించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

2 లో..



## ఛత్తీస్‌ఘడ్‌లో ప్రైవేట్ బస్సు బోల్తా

ఐదుగురు ప్రయాణికుల మృతి

2 లో..



గల్ఫ్‌కు వెళ్లే 12

## విమానాలు రద్దు

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ : పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో విమానాల రద్దు కొనసాగుతోంది. శంషాబాద్ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన 12 విమానాలు రద్దయ్యాయి. అదే సమయంలో గల్ఫ్ దేశాల నుంచి శంషాబాద్‌కు రావాల్సిన మరో

- మిగతా 2లో..

హోర్ముజ్ జలసంధిలో భారత నౌకలకు ఆటంకం

## కలిగించడం లేదు ఇరాన్


» హిందూ మహాసముద్రంలో తమ నౌకలపై జరుగుతున్న దాడిని భారత్ అడ్డుకోవాలన్న ఇరాన్
» అంతర్జాతీయ జలాల్లో అమెరికా తీరు ప్రమాదకరంగా ఉందన్న ఇరాన్ మంత్రి
» భారత్, ఇరాన్ మనస్తత్వం ఒకటేనని వ్యాఖ్య



హోర్ముజ్ : హోర్ముజ్ జలసంధిలో భారతీయ చమురు నౌకల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలిగించడం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి సయీద్ ఖతిబ్‌జాదే ఒక అంతర్జాతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ, భారత నౌకలను తాము అడ్డుకుంటున్నట్లు వస్తున్న వార్తలను తోసిపుచ్చారు. అదే సమయంలో హిందూ మహాసముద్రంలో ఇరాన్ నౌకలపై జరుగుతున్న దాడుల విషయంలో భారత్ చొరవ తీసుకోవాలని, ఈ దాడులకు కారణమైన అమెరికాను ప్రశ్నించాలని ఆయన సూచించారు.

- మిగతా 2లో..

# అభివృద్ధికి అవరోధంగా ఉన్న చట్టాల రద్దు



**13 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్ పై త్వరలో నిర్ణయం**

» ఫ్యాక్షనిజం, నక్సలిజం పోయి..రప్పా రప్పా రాజకీయం వచ్చింది
» నాడు ప్రభువా క్షమించు అన్న జగన్..కల్తీ నెయ్యితో ఘోర అపచారం చేసి ఏడుకొండల వాడిని క్షమాపణ అడగలేదేం
» 5 కోట్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అసెంబ్లీలో చర్చలు, నిర్ణయాలు
» ప్రజాప్రతినిధులు వ్యక్తిగత ప్రవర్తనతో ప్రభుత్వానికి ఇబ్బందులు తేవొద్దు
» ద్రవ్య వినిమయ బిల్లు సహా వివిధ అంశాలపై శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగం
» ఆత్మనిర్భర్- వికసిత్ భారత్ సంకల్పంపై చేసిన తీర్మానానికి శాసనసభ ఆమోదం

- మిగతా.. 2 లో

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : సామాజిక మాధ్యమాల కారణంగా 13 ఏళ్ల లోపు పిల్లలు నష్టపోకుండా నిషేధించే అంశాన్ని పరిశీలిస్తున్నామని త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దీనికి సంబంధించి 90 రోజుల్లో విధి విధానాలు ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో విచ్చల విడితనంపై మంత్రి నారా లోకేష్ లోకేశ్ అధ్యయనం చేసి కొన్ని సిఫార్సులు చేశారని సీఎం అన్నారు. శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. గత పాలకుల అస్తవ్యస్త విధానాల కారణంగా సంక్షోభంలో పడిన రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి వైపు నడిపిస్తున్నామని ఆయన అన్నారు. వివిధ అంశాలపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'గత పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. గడచిన 20 నెలల్లో కష్టాలు, సమస్యల్ని అధిగమించి రాష్ట్రాన్ని గాడిలో పెట్టాం. విధ్వంసం నుంచి వికాసం వైపు, సంక్షోభం నుంచి సంక్షేమం వైపుగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం.

## మాది ప్రజాప్రభుత్వం..

» గత ప్రభుత్వంలో రూ.18.96 కోట్ల బకాయిలను ఈ ప్రభుత్వమే చెల్లించింది
» రాష్ట్రంలో 7వ తరగతి నుంచి 12వ తరగతి బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్ కిన్ ల పంపిణీ
» హెచ్‌పీవీ వ్యాక్సిన్ పై అవగాహన కల్పిస్తాం
» శాసనమండలిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: రాష్ట్రంలో 7వ తరగతి నుంచి 12వ తరగతి బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్ కిన్ లను పంపిణీ చేయడం జరుగుతోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలోని విద్యార్థులకు ఉచితంగా శానిటరీ న్యాప్ కిన్ లను అందించడంపై శాసనమండలిలో సభ్యులు కావలి గ్రీష్మ అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానం ఇస్తూ..

2 పేజీలో..

**అంతర్జాతీయ స్థాయి థీమ్ పార్కుల ఏర్పాటుకు**

## కూటమి ప్రభుత్వం సిద్ధం



» ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించేందుకు 'ఏపీ పర్యాటక విధానం 2024-29' ద్వారా భారీ రాయితీలు కల్పిస్తున్నాం
» గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కర్నూతల గ్రామంలో డిస్నీ వరల్డ్ ఏర్పాటుకు ఇన్వెస్టర్లు ముందుకు వస్తే సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధం
» ఇమాజికా, వండర్ లా వంటి ప్రముఖ సంస్థలతో పర్యాటక శాఖ చర్చలు జర
» తిరుపతి, విశాఖపట్నంలో ప్రాజెక్టులపై ఇన్వెస్టర్లు ఆసక్తి
» భారీ ప్రాజెక్టులను ప్రపంచవ్యాప్తంగా ప్రైవేట్ సంస్థలే నిర్వహిస్తాయి
» ప్రభుత్వం కేవలం భూమి కేటాయింపు, అనుమతులు, రాయితీలు మాత్రమే కల్పిస్తుంది
» మబత్రి కందుల దుర్గేష్

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :

రాష్ట్రంలో ప్రపంచ స్థాయి వినోద సౌకర్యాలు,థీమ్ పార్కుల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శాసనసభలో స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం వట్టిచెరుకూరు మండలం కర్నూతల గ్రామంలోని 171.14 ఎకరాల విస్తీర్ణంలో డిస్నీ వరల్డ్ తరహా ప్రాజెక్టును ఏర్పాటు చేసే ప్రతిపాదనపై ప్రత్తిపాడు

2 లో

ఢిల్లీలో రైసినా డైలాగ్ 2026 సదస్సుకు

## సీఎం చంద్రబాబు

» సాంకేతికత- సుపరిపాలనపై సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగం
» సదస్సులో పాల్గొననున్న 110 దేశాలకు చెందిన 2,700 మంది ప్రతినిధులు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

దేశ రాజధాని ఢిల్లీలో జరిగే ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్ 2026' సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం హాజరుకానున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో సాంకేతికత - సుపరి పాలన, భవిష్యత్ అంశాలపై సీఎం కీలక ఉపన్యాసం చేయనున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ- అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక సదస్సును నిర్వహిస్తున్నాయి.





## టిటిడి పూర్తిస్థాయి ఇవోగా ముద్దాడ

» బాధ్యతలు స్వీకరించిన రవిచంద్ర

ప్రజాభూమి ప్రతినిధి, తిరుమల : టిటిడి పూర్తిస్థాయి ఇవోగా ముద్దాడ రవిచంద్ర తిరుమల వేంకటేశ్వరుడి ఆలయంలో శుక్రవారం ఉదయం 7.34 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన టీటీడీ పాలక మండలి సభ్య కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేశారు. టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. వేంకటేశ్వరుడిని దర్శించుకున్న అనంతరం ఈవో దంపతులకు రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం అందించగా అదనపు ఈవో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ గత నెల రోజులుగా తిరుమలలో చాలా విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. తిరుమల యాత్రికులకు సాటి యాత్రికుడిగా సేవ చేస్తానని చెప్పారు. యాత్రికుల నుండి చాలా సలహాలు సూచనలు వచ్చాయని, వాటిని తానే స్వయంగా పరిశీలించి ఆ అనుభవంతో ప్రజలకు మంచి ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేస్తామని తెలియజేశారు.

# సంపాదకీయం

## ఈ యుద్ధం ముగిసేదెలా ?



పశ్చిమాసియా యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు. దీనికితోడు ఇది మూడో ప్రపంచ యుద్ధంగా మారబోతుందా అన్న భయాలు వెల్లడవుతున్నాయి. ఎందుకంటే ఇజ్రాయిల్, అమెరికాల దూకుడు తగ్గడం లేదు. ప్రతిగా ఇరాన్ కూడా విధ్వంసం సృష్టిస్తోంది. ఓ రకంగా చెప్పాలంటే ఇరాన్‌ను అమెరికా తక్కువ అంచనా వేసినట్లుగా అర్థం అవుతోంది. మరోవైపు యుద్ధాన్ని ఆపాలని చైనా, రష్యాలు రంగంలోకి దిగాయి. ఇరాన్‌కు ఈ రెండు దేశాలు మద్దతు ప్రకటించాయి. దీంతో ఏంజరగబోతుందో అన్న ఆందోళన సహజంగానే కలుగుతోంది.తాజాగా చైనా నోరు విప్పడంతో ఈ యుద్ధం కీలకమైన మలుపు తీసుకునే అవకాశం లేకపోలేదు. ఒకవేళ ఇరాన్‌లో రహస్యంగా కొనసాగుతున్న న్యూక్లియర్ రియాక్టర్ ఏ మాత్రం లీక్ అయినా, ఇరాన్, పరిసర ప్రాంతాల్లో ఉన్న దేశాలకు కూడా ముప్ప ముంచుకొస్తుంది. దీనిపై ఇటు ఇరాన్‌కు అటు అమెరికాకు కూడా అవగాహన ఉండివుంటుది. కానీ ఎందుకో ఇరాన్ కూడా తమ దాడుల తీవ్రత పెంచింది.ఈ యుద్ధంతో ఇప్పటికే మధ్య ప్రాచ్యం మండిపోతోంది. ఇరాన్ సార్వభౌమత్వాన్ని కాపాడతామంటూ చైనా రంగంలోకి దిగడంతో ప్రపంచ దేశాల్లో మూడో ప్రపంచ యుద్ధ భయాలు కనపడుతున్నాయి. ఇదే సమయం లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరిన్న భీకర దాడుల్ని చేసేందుకు సిద్ధమౌతున్నట్లు ప్రకటించారు. యుద్ధం మరో నాలుగైదు వారాలు తప్పదని ట్రంప్ ముందే హెచ్చరించారు. ఆ వెను వెంటనే యుద్ధ తీవ్రత ఎలా ఉంటుందో కూడా చెప్పనే చెప్పారు. ఎనిమిది అరబ్దేశాలు ఇరాన్ దాడులతో విలవిల్లాడు తున్నాయి. ఇరాన్ అమెరికాతో రాజీ చర్చల కోసం ఏవిధంగానూ ప్రయత్నించడం లేదు. మరోవైపు హర్మూజ్ జలసంధి మూసివేయడంతో ప్రపంచం మీద చమురు భారం పడుతోంది. సంక్షోభం తప్పేలా లేదు. అమెరికా మాత్రం చర్చలకు ఆలస్యం అయ్యిందని బెదిరిస్తోంది. ఇరాన్‌లో తదుపరి ఎవరు నేతగా ఉండాలో తామే నిర్ణయిస్తామని కూడా ట్రంప్ ప్రకటించాడు. ఇకపోతే ఇరాన్ దాడులతో గల్ఫ్ దేశాలు ముప్ప ముంగిట ఉన్నాయి. సౌదీలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రం,రిఫైనపై ఇరాన్ దాడి చేయడంతో చమురు సరఫరా ఆగిపోయింది. ఇరాన్ తన హోర్మూజ్ జలసంధిని మూసి వేస్తే ప్రపంచ దేశాలకు అందే చమురు సరఫరా ఆగిపోగలదని అనుభవంఓలకి వచ్చింది. ఈ క్రమంలో బహ్రెయిన్ పోర్టులో ఆగి ఉన్న అమెరికాకు చెందిన స్టెనా ఇంపరేటివ్ చమురు నౌక పైనా డ్రోన్ దాడులు జరిగి మంటలు చెలరేగాయి. ఇరాన్ ప్రతీకార దాడుల్లో ప్రధానంగా అమెరికా తదితర దేశాల చమురు నౌకలు దెబ్బతింటే ఆయా దేశాలు ఇక చమురుకు కష్టాలు పడాల్సిందే. ఒకవైపు అమెరికా యుద్ధనౌకల మోహరింపు. మరోవైపు ఇరాన్, రష్యా యుద్ధ నౌకలు సంయుక్త నావికాదళ విన్యాసాల కవ్వింపుతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. యుద్ధ జ్వాలలు మింటికెగయడంతో భారత్ దేశంతో సహా ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు, పప్పు ధాన్యాలు, నూనెల ధరలపై విపరీతమైన ప్రభావం పడుతోంది. ఇప్పటికే దక్షిణ కొరియా, జపాన్, చైనా స్టాక్ మార్కెట్లు అతలాకుతలమయ్యాయి. తాజా పరిస్థితుల రీత్యా యుద్ధ సంకేతాలు విస్తరించి ఆయా దేశాలు ఏదో ఓ పక్కకు చేరిపోవడం ఒక్కటే ప్రత్యామ్నాయంగా ఉన్నందున యుద్ధం మరికొంతకాలం తమ ప్రతాపాలను చూపిస్తుంది. యుద్ధం ఆగినా యుద్ధకాలపు ప్రభావాలు అంతత్వరగా ఉపసంహారణ జరుగదు. ఆ తర్వాత కూడా మార్కెట్లు కోలుకోవడానికి, పెరిగిన ధరలు తగ్గడానికి మరెంతో కాలం పడుతుంది. ఎందుకంటే ఇప్పట్లో ఈ యుద్ధం ముగిసేలా లేదు. ఇరువైపులా భీకర యుద్ధమే సాగుతోంది. ఎవరూ తగ్గేటట్లు లేరు. నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడి చేసాయి. ఈ దాడిలో ఏమరుపాటున ఆ అణుకేంద్రం నుంచి వెలువడే అణుధార్మికత ప్రమాదకరమే. ఇరాన్‌ను లొంగదీసుకోవాలని అమెరికా అధినేత ట్రంప్ ప్రయత్నిస్తున్న తరుణంలో చైనా ఇరాన్‌తో చేయికల్పడం ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందోనని సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రష్యా కూడా రంగంలోకి దిగితే ఇక అది ప్రపంచ యుద్ధానికి దారితీయవచ్చు. మరోవైపు ఉక్రెయిన్ కూడా ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికాతో చేతులు కలిపింది. ఇది సహజంగానే రష్యాకు గిట్టదు. మొత్తంగా ప్రపంచ దేశాలు రెండు వర్గాలుగా ఏర్పడితే వినాశనం తప్పదు. ప్రజలు ఆకలిచావులకు లోను కావాల్సిందే. ఈ క్రమంలో యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నాలు సాగాలి. ఇరు దేశాల మధ్య ఇగోలను చల్లార్చాలి. ఈ దశలో ఎవరు ముందుకు వస్తారన్నదే ముఖ్యం.

# అభివృద్ధికి అవరోధంగా ఉన్న చట్టాల రద్దు

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం. 15 రోజుల పాటు జరిగిన శాసనసభలో ఐదు కోట్ల మంది ప్రజల భవిష్యత్తు గురించి చర్చలు జరిగాయి. భవితరాల భవిష్యత్ నిర్ణయించే ఈ సమావేశాల్లో చర్చలు, నిర్ణయాలు జరిగాయి. విభజన వల్ల, గత పాలకుల విధ్వంసం వల్ల నష్టపోయిన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ప్రధాని మోదీ సహకారంతో కీలకమైన నిర్ణయాలు తీసుకుని ప్రజలకు మేలు చేస్తున్నాం. గత ఎన్నికల్లో కూటమి తరపున పోటీ చేసిన అభ్యర్థుల్లో 94 శాతం మంది గెలవటం మా అందరిపై ప్రజల్లో ఉన్న నమ్మకానికి నిదర్శనం. ఎన్డీఏ పక్షాలన్నీ పూర్తి సఖ్యతతో ప్రజలకు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటున్నాం' అని ముఖ్యమంత్రి తెలిపారు.

**ప్రజలు ఓటేస్తేనే అధికారం..ప్రతిపక్షం :** 'తీవ్ర అగమ్య గోచరంగా మారిపోయిన రాష్ట్ర భవిష్యత్తును తిరిగి నిర్మించేలా, గట్టెక్కించే బాధ్యత తీసుకున్నాం. రూ.3.32 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టాం. ఎన్డీఏ పార్టీలన్నీ పూర్తి సమన్వయంతో వెళ్ల బట్టే అనుకున్నది సాధించగలిగాం. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ శాసన సభకు రాకుండా తప్పించుకు తిరుగుతోంది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే శాసనసభకు వస్తామని చెప్పటం ఏమిటి.? ప్రజలు ఓట్లు వేస్తేనే అధికారం, ప్రతిపక్ష హోదా వస్తాయి. ఈ నిబంధనలన్నీ రాజ్యాంగంలో స్పష్టంగా ఉన్నాయి. ఇవన్నీ తెలియకుండానే రాజకీయం చేస్తున్నారు. గత పాలనలో అన్ని వ్యవస్థలూ ధ్వంసం అయ్యాయి. అలాంటి పరిస్థితిని చక్కదిద్ది గాడిన పెట్టాం. 92 కేంద్ర ప్రాయోజిత పథకాలను నిర్వీర్యం చేశారు. కేంద్రం నిధులు దారి మళ్లించారు. ఒక్క జల జీవన్ మిషన్‌లోనే రూ.85 వేల కోట్లు రావాల్సి ఉంటే కేవలం రూ.25 వేల కోట్లు మాత్రమే ప్రతిపాదనలు పెట్టారు. ఆ పథకానికి 5 ఏళ్లలో చేసిన ఖర్చు కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే. మేం అధికారంలోకి వచ్చాక పథకం సమయాన్ని పొడిగించాలని కోరాం. ఇంటింటికీ కుళాయి ఇచ్చేలా ఈ జల్ జీవన్ మిషన్‌ను ప్రణాళిక చేశాం. దీనిపై ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను అభినందిస్తున్నాం.' అని ముఖ్యమంత్రి తెలిపారు.

**అధిక వడ్డీలకు ప్రభుత్వ ఆస్తులు తాకట్టు ప్రజాధనం దుర్వినియోగం :** 'ప్రజలకు మెరుగైన సుపరిపాలన ఇచ్చేందుకు నిరంతరం పోరాటం చేశాం. గత పాలకులు ప్రభుత్వ ఆస్తులు కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారు. ఎమ్మార్వో ఆఫీసు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సర్క్యూట్ హౌస్ లాంటి ఆస్తులను తాకట్టు పెట్టారు. 12, 13 శాతంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ప్రభుత్వ ఆర్థిక వనరుల్ని దుర్వినియోగం చేశారు. రూ.43,298 కోట్ల విలువైన అప్పులకు ప్రభుత్వం రీ షెడ్యూలు చేయించాం. తద్వారా రూ.328 కోట్ల మేర ఆదా అవుతుంది. మరో రూ.1 లక్ష కోట్ల మేర అప్పులు కూడా రీ షెడ్యూలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. దీని వల్ల రూ.1,658 కోట్లు వెసులుబాటు వస్తుంది. ఈ నిధులతో మరో సంక్షేమ పథకాన్ని అమలు చేసే అవకాశం ఉంటుంది. ఒక వ్యక్తి తన స్వార్థంతో రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును ధ్వంసం చేసేశారు. గోదావరి పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టును జాతికి అంకితం చేసి నీళ్లు ఇస్తాం. కేంద్ర సహకారంతో అమరావతి రాజధానిని ట్రాక్‌లో పెట్టాం. మూడేళ్లలో రాజధానికి ఓ రూపు వస్తుంది. వచ్చే సమావేశాలు ఎమ్మెల్యేలు, మంత్రులు రాజధానిలోని వారి క్వార్టర్లలో ఉండేలా చర్యలు చేపడుతున్నాం. కేంద్ర నిధులతో విశాఖ ఉక్కును కాపాడుకున్నాం. తొలిసారి విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల్లోకి వచ్చింది. స్టీల్ ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి సహకారాన్ని అందిస్తోంది' అని ముఖ్యమంత్రి తెలిపారు.

**గత పాలనలో ట్రూ అప్.. కూటమి వచ్చాక ట్రూడౌన్ :** 'రాష్ట్రానికి నీటి భద్రత అత్యంత ముఖ్యమైన అంశం. 20 నెలల్లో దీనికి అనుగుణంగా చర్యలు తీసుకున్నాం. హంద్రీనీవాకు రూ.3850 కోట్లు ఖర్చు చేసి కుప్పం వరకూ నీళు తీసుకెళ్లాం. అనంతపురం లాంటి జిల్లాకు 55 టీఎంసీల నీటిని తీసుకువెళ్లాం. ప్రస్తుతం వేసవి వచ్చినా 628 టీఎంసీల నీరు వివిధ రిజర్వాయర్లలో నిల్వ ఉంది. సమర్ధ నీటి నిర్వహణతోనే ఇది సాధ్యమైంది. భూగర్భజలాలు కూడా రాష్ట్రవ్యాప్తంగా గణనీయంగా పెరిగాయి. రాష్ట్రంలో 2.96 మీటర్ల మేర భూగర్భజలాలు పెరిగేలా వివిధ సంరక్షణా చర్యలు చేపట్టాం. భూగర్భ జలాలు పెరగటం వల్ల వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గింది. ఆ మేరకు వ్యయాన్ని ఆదా చేసుకున్నాం. ఎన్ని ఇబ్బందులు ఉన్నా కరెంటు ఛార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు చెప్పిన మాటను నిలబెట్టుకున్నాం. గత పాలకులు రూ.32 వేల కోట్ల కరెంటు ఛార్జీల భారం ప్రజలపై మోపారు. ట్రూ అప్ భారం వేస్తే చరిత్రలో తొలిసారి మేం ట్రూడౌన్ చేశాం. రూ.4420 కోట్ల మేర ట్రూ అప్ భారాన్ని ప్రజలపై మోపకుండా చర్యలు తీసుకున్నాం. పీఎం సూర్యఘర్ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సౌర ప్యానెళ్లు ఏర్పాటు చేసి ఇంటిపైనే విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. యూనిట్ కొనుగోలు ధరను రూ. 5.19 నుంచి 4.80కు తగ్గించేలా చర్యలు చేపట్టాం. అగ్రిటెక్‌తో వ్యవసాయ రంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. రూ.1 లక్ష కోట్లతో ఉమ్మడి ప్రకాశం సహా రాయలసీమ జిల్లాలను హార్టీ కల్చర్ హబ్‌గా పూర్వోదయ పథకం కింద అభివృద్ధి చేస్తాం' అని సీఎం తెలిపారు.

**ప్రతీ కుటుంబానికి ఫ్యామిలీ బెన్‌ఫిట్ కార్డు :** 'ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు ఇవ్వాలనే పది సూత్రాలతో 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపకల్పన చేశాం. ఆర్థిక అసమానతలు తగ్గించేలా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది. త్వరలోనే ప్రతీ కుటుంబానికి ఫ్యామిలి బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టం కార్డును కూడా జారీ చేస్తాం. కేంద్రం, రాష్ట్రం అందించే పథకాలన్నిటినీ ఈ కార్డు ద్వారా ఇంటిగ్రేట్ చేస్తాం. రాష్ట్రంలో 25 నూతన పాలసీలు తీసుకురావటం ద్వారా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. వీటితో 23 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉంది. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. సర్క్యులర్ ఎకానమీతో వ్యర్థాల ద్వారా సంపద సృష్టిస్తున్నాం. ఇటీవలే వివాదాల పరిష్కారించేలా మధ్యవర్తిత్వంపై ఓ సదస్సు జరిగింది. మధ్యవర్తిత్వంపై దృష్టి పెట్టాలని సూచనలు వచ్చాయి. వివాదం పరిష్కారం అయితే రూ.10 వేల ప్రోత్సాహకం ఇవ్వాలని నిర్ణయించాం. రాష్ట్రంలో అభివృద్ధికి అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేసి అవినీతిని కట్టడి చేశాం. జన్ విశ్వాస్ ద్వారా పాత చట్టాలను రద్దు చేస్తున్నాం అవసరమైన మార్పులు చేస్తున్నాం. దీనికి సంబంధించి బిల్లుకు కూడా శాసనసభ ఆమోదం తెలిపింది. గత పాలకులు ఐదేళ్లలో 884 కి.మీ సీసీ రోడ్లు, 234 కిలోమీటర్ల బీటీ రోడ్లు మాత్రమే వేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక గ్రామీణ ప్రాంతాల్లో 4,998 కిలోమీటర్ల సీసీ రోడ్లను కేవలం 20 నెలల్లో పూర్తి చేయించేలా డిప్యూటీ సీఎం చర్యలు తీసుకున్నారు. పల్లె పండుగ, అడవి తల్లి బాట పేరిట గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా గోశాలలు నిర్మాణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం కూడా జరుగుతోంది. 9 కోట్ల పని దినాలు కల్పించేలా కూడా ఉపముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారు. నరేగా నుంచి వీబీజీ రామ్ జీ పథకానికి మార్పు జరిగింది. బడ్జెట్ తగ్గకుండా ఆ పథకాన్ని సమర్ధంగా వినియోగించుకుంటామని ముఖ్యమంత్రి అన్నారు.

**వైట్ కాలర్ క్రైమ్స్, సోషల్ సైకోలు అరాచకం**

'స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్ తయారు చేసుకున్నాం. అభివృద్ధి వికేంద్రీకరణ జరిగేలా నిర్ణయం తీసుకుంటున్నాం. మూడు ప్రాంతాల్లో ఎకనామిక్ రీజియన్లు ఏర్పాటు చేస్తున్నాం. సుప్రీంకోర్టు అనుమతితో కర్నూలుకు హైకోర్టు బెంచ్ సాధించుకునేలా చర్యలు తీసుకుంటాం. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో 5 లక్షల మంది మహిళల్ని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే అంశంపై సంకల్పం చేస్తాం. ఉగాదికి 3 లక్షల గృహ ప్రవేశాలు చేయిస్తాం. హెల్తీ, వెల్తీ హ్యాపీ సొసైటీగా ఏపీని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపడుతున్నాం. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నాం. ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ప్రజారోగ్యాన్ని సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నాం. వైట్ కాలర్ క్రైమ్స్, డిజిటల్ క్రైమ్స్, సైకోలు సోషల్ మీడియాలో అరాచకం చేస్తున్నారు. మహిళలపై నేరాలకు పాల్పడితే వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరిస్తున్నాను. మావోయిస్టులను కట్టడి చేశాం, ఫాక్షనిజం రూపుమాపాం తద్వారా ప్రగతి సాధించాం' అని సీఎం తెలిపారు.

**పెళ్లికి వెళ్లి రప్పా రప్పా అంటూ దాడులు చేయడం ఎక్కడి సంస్కృతి?**

'రాష్ట్రంలో ఇప్పుడు కొత్తగా రప్పా రప్పా రాజకీయం వచ్చింది. ఓ రాజకీయ నాయకుడు పర్యటన చేస్తే రప్పా రప్పా అంటున్నారు. పెళ్లికి వెళ్ళి రప్పా రప్పా అంటూ దాడులు చేయాలా? భద్రత కోసం వెళ్లిన ఎస్ఐ గాయపడినా పట్టించుకోవటం లేదు. గంజాయి, డ్రగ్స్, బ్లేడ్ బ్యాచ్‌లను పక్కన పెట్టుకుని తిరిగే నాయకుడు ఎక్కడైనా ఉంటారా? కటౌట్లకు పొట్టేళ్లతో రక్తాభిషేకం చేయటం ఏమిటి? ఇంత నేరుగా హింసను ప్రోత్సహిస్తారా?. పోస్టు మార్టానికి కారకులైన వారు పోస్టు మార్టానికే వెళ్తారు. రాష్ట్రంలో ఈ విధ్వంస యాత్రలు ఏమిటి, టైర్ల కింద మనుషుల్ని తొక్కించి నింద ప్రభుత్వంపై వేస్తారు. పరామర్శలకు వెళ్లి బలప్రదర్శనలు చేయటం ఏమిటి. 5 కిలోమీటర్ల దూరాన్ని 6-7 గంటల పాటు ప్రయాణిస్తారా ఎవరైనా.? ప్రతిపక్షంలో ఉండి పెట్టుబడులు రాకుండా ఇష్టానుసారం మాట్లాడుతున్నారు మేం అధికారంలోకి వస్తే పెట్టుబడులు రద్దు చేస్తామంటూ హెచ్చరికలు చేయటం ఏమిటి? దేశంలో ఏ రాజకీయ పార్టీ ఈ విధంగా వ్యవహరించలేదు' అని సీఎం వ్యాఖ్యానించారు

**రెండు కొండలన్నప్పటి నుంచే కుట్రలు :** 'తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని గత పాలకులు అపవిత్రం చేశారు. ఇది తెలియకుండా జరిగిన వ్యవహారం కాదు. కుట్రతోనే కావాలని చేసిన నేరం. ఏడు కొండలను రెండు కొండలు చేసినప్పటి నుంచే ఈ కుట్ర కొనసాగుతోంది. ఎన్డీడీబీ ఇచ్చిన నివేదిక కూడా అది కల్తీ నెయ్యి అని స్పష్టంగా తేల్చి చెప్పింది. దేశ వ్యాప్తంగా హిందూ మఠాలు, పీఠాలు ముక్త కంఠంతో వ్యతిరేకించినా కనీసం ఆ పార్టీ క్షమాపణ చెప్పలేదు. ప్రభువా క్షమించు అంటూ సాక్షి పత్రికలో పెద్ద ఎత్తున వార్తలు రాయించుకున్న వ్యక్తి తిరుమల నైవేద్యం కల్తీ చేసి ఏడుకొండల స్వామికి క్షమాపణలు చెప్పరా? మత సామరస్యాన్ని గౌరవించకుండా.. క్షమాపణ చెప్పకుండా దౌర్జన్యం చేస్తున్నారు. శాసనమండలిలోనూ ఇదే అంశంపై గొడవ చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీస్తారా?' అని సీఎం నిలదీశారు.

**వ్యక్తిగత ప్రవర్తనతో చెడ్డ పేరు తేవొద్దు :** పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధాలతో మన మార్కెట్లు ప్రభావితం అవుతున్నాయి. ఎగుమతులు పడిపోవటంతో అరటి ధర తగ్గిపోయింది. చమురు ధరల వల్ల కూడా ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజాప్రతినిధులు వ్యవహరించాలి. ప్రజాప్రతినిధులు-అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని కోరుతున్నాను. కూటమిగా వెళ్లి ప్రజల మద్దతుతోనే అంతా గెలిచామని గుర్తుంచుకోవాలి. వ్యక్తిగత ప్రవర్తన వల్ల ప్రభుత్వానికి, పార్టీలకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని కోరుతున్నాను. 15 ఏళ్ల పాటు ఎన్డీఏ కూటమి కొనసాగితేనే రాష్ట్రానికి మంచి జరుగుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పదేపదే చెబుతున్నారు. కూటమిగా మనకు ఓ అజెండా ఉంది. 2029లోనూ మనం గెలిచి 2047 లక్ష్యాలను సాధించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఎపి శాసనసభ నిరవధిక వాయిదా

**15 రోజులు సమావేశాలు జరిగాయి**
**వివరాలు వెల్లడించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు**

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఏపీ శాసనసభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. అసెంబ్లీ సమావేశాలు జరిగేందుకు సహకరించిన అందరికీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృతజ్ఞతలు తెలిపారు. 16వ శాసనసభ ఐదో సమావేశాలు 15 రోజుల పాటు జరిగాయన్నారు. 72 గంటల 14 నిమిషాల పాటు సమావేశాలు జరిగాయని స్పీకర్ తెలిపారు. మొత్తం 122 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారని... 80 ప్రశ్నలకు సభాసమక్షంలో ఉంచారని చెప్పారు. ఈసారి సమావేశాల్లో 18 బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. ఒక లఘు చర్చ, 344వ నియమం కింద చర్చించిన అంశాలు ఒకటి అని వివరించారు. శాసనసభలో టీడీపీ-135, జనసేన-21, వైసీపీ-11, బీజేపీ-8 మంది సభ్యులున్నారని స్పీకర్ తెలిపారు. ఈరోజు సాయంత్రం సభ్యుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ కుటుంబసమేతంగా రావాలని స్పీకర్ కోరారు. క్రీడాపోటీల్లో అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. 166 పాఠశాలల నుంచి 6,693 విద్యార్థులు అసెంబ్లీని సందర్శించారని.. అసెంబ్లీకి ఇంత భారీ సంఖ్యలో విద్యార్థులు ఎప్పుడూ రాలేదని స్పీకర్ అన్నారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు శాసనసభ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేశారు.

## ఛత్తీస్‌ఘడ్‌లో ప్రైవేట్ బస్సు బోల్తా

**ఐదుగురు ప్రయాణికుల మృతి**

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్ లోని జాష్‌పూర్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. మరికొన్ని గంటల్లో తమ గమ్య స్థానం చేరుకుంటామనే లోపు మృత్యు ఒడిలోకి చేరుకున్నారు. ఒక ప్రైవేట్ బస్సు బోల్తా పడటంతో ఐదుగురు మృతి చెందగా, 20 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను దగ్గరలోని ఆస్పత్రులకు తరలించారు. తప్కరా పోలీస్ స్టేషన్ పరిధిలోని గోడాంబ గ్రామ సమీపంలో బస్సు అదుపు తప్పి బోల్తా పడటంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. జార్ఖండ్‌లోని కుర్దేగ్ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని కుంకురి పట్టణం వైపు వెళ్తున్న బస్సు ప్రమాదానికి గురి కావడంతో బస్సులో ఐదుగురు మృతి చెందారని జాష్‌పూర్ సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ లాల్ ఉమేద్ సింగ్ తెలిపారు. ప్రమాద సమయంలో బస్సులో 24 మంది ప్రయాణికులు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు..

## హోర్ముజ్ జలసంధిలో భారత నౌకలకు ఆటంకం కలిగించడం లేదు

హోర్ముజ్ జలసంధిలో స్థిరత్వం కోసం ఇరాన్ నిరంతరం ప్రయత్నిస్తుందని, ఒకవేళ ఆ జలసంధిని మూసివేయాల్సి వస్తే తామే అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. ప్రస్తుతానికి అలాంటి ఉద్దేశం లేదని, తమది బాధ్యతాయుతమైన దేశమని స్పష్టం చేశారు. అంతర్జాతీయ జలాల్లో అమెరికా తీరు ప్రమాదకరంగా ఉందని, ఆ దేశపు "ఫుట్‌బాల్ మెంటాలిటీ" (దూకుడు స్వభావం) వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు. భారత్, ఇరాన్ దేశాలు "చదరంగం" ఆడే మనస్తత్వం కలవని, అంటే దౌత్యపరమైన ఆలోచనలతో, వ్యూహాత్మకంగా సమస్యలను పరిష్కరించుకుంటాయని ఆయన అభివర్ణించారు. ఉద్రిక్తతలను తగ్గించుకోవడానికి దౌత్యమే సరైన మార్గమని, వివాదాలను చర్చల ద్వారానే పరిష్కరించుకోగలమని ఆయన అభిప్రాయపడ్డారు.



# ఢిల్లీలో రైసినా డైలాగ్ 2026 సదస్సుకు సీఎం చంద్రబాబు

ఇందులో పాల్గొనేందుకు రేపు ఉదయం 10.50 గంటలకు సీఎం విజయవాడ నుంచి ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో జరిగే రైసినా డైలాగ్ 2026 సదస్సుకు ముఖ్యమంత్రి హాజరవుతారు. అనంతరం ఆయన అమరావతి తిరిగి రానున్నారు. 2016 నుంచి ఎంఓఈఏ- ఓఆర్‌ఎఫ్ సంస్థలు రైసినా డైలాగ్ పేరిట ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. ప్రపంచ రాజకీయాలు- అంతర్జాతీయంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థపై ప్రపంచ స్థాయిలో చర్చించే అత్యున్నత వేదికగా రైసినా డైలాగ్ సదస్సుకు మంచి పేరుంది. వివిధ దేశాల అధినేతలు, మంత్రులు, అత్యున్నత సైనిక అధికారులు, విధానకర్తలు, మేధావులు, నిపుణులు ఒకే వేదికపై గ్లోబల్ వ్యూహాలను చర్చించేలా ఈ సదస్సు జరగనుంది. అంతర్జాతీయంగా పేరొందిన మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్సు లాంటి ప్రతిష్టాత్మక వేదికల సరసన రైసినా డైలాగ్ నిలుస్తోంది. ఈ ఏడాది జరగనున్న 11వ ఎడిషన్ రైసినా డైలాగ్ సదస్సు సంస్కార- అన్వేషణ, సమన్వయం, పురోగతి అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. 110 దేశాలకు చెందిన 2,700 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కానున్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ రైసినా డైలాగ్ సదస్సులో కీలకోపన్యాసం చేస్తారు. దేశంలో అభివృద్ధి పథాన నడుస్తున్న రాష్ట్రంగా ఏపీలో అమలు చేస్తున్న సుపరిపాలన- డిజిటల్ అంశాలపై ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించనున్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్, డేటా ఆధారిత విధాన నిర్ణయాల ద్వారా ప్రజలకు అందుతున్న మెరుగైన పౌరసేవల గురించి ఈ సదస్సులో ప్రస్తావించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అంతర్జాతీయ ఆవిష్కరణల కేంద్రంగా, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ డెస్టినేషన్‌గా మార్చేందుకు అనుసరిస్తున్న దార్శనిక నిర్ణయాలను ప్రపంచ దేశాల ముందు ఉంచనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎకోసిస్టమ్స్, డేటా సెంటర్లు, క్లీన్, గ్రీన్ ఎనర్జీ, నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీ కారిడార్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించనున్నారు. పాలనకు సాంకేతికతను జోడించి ఆర్థిక వృద్ధిని ఎలా వేగవంతం చేయవచ్చున్న అంశాలతో పాటు పాలనలో పారదర్శకత, సంపద సృష్టి, స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ వంటి వినూత్న అంశాలపై అంతర్జాతీయ ప్రతినిధులతో తన అనుభవాలను ముఖ్యమంత్రి పంచుకోనున్నారు.

## మాది ప్రజాప్రభుత్వం...

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ విద్యాసంస్థల్లో 7వ తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు చదువుతున్న బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్ కిన్ లను సరఫరా చేయడం జరుగుతోంది. గతంలో ఏడు రెగ్యులర్ సైజ్, మూడు లార్జ్ సైజ్ న్యాప్ కిన్ లు ఇచ్చేవారు. ఫీడ్ బ్యాక్ తీసుకున్న తర్వాత 5 రెగ్యులర్ సైజ్, 5 లార్జ్ సైజ్ శానిటరీ ప్యాడ్ ను ప్రభుత్వం అందజేస్తోంది. గత ప్రభుత్వంలో 18.96 కోట్ల బకాయిలు పెట్టారు. ప్రజా ప్రభుత్వం ఆ బకాయిలను తీర్చడం జరిగింది. ఆర్టీజీఎస్ నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా ఫోన్ కాల్స్ చేసి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం జరుగుతోంది. 96శాతం బాలిలకు తమకు శానిటరీ న్యాప్ కిన్ లు అందుతున్నాయని, 4 శాతం మంది అందడం లేదని చెప్పడం జరిగింది. నాణ్యత విషయంలో 1 శాతం బాగాలేదని, 14శాతం పర్వాలేదు, బాగుందని 85శాతం మంది చెప్పారు. శానిటరీ న్యాప్ కిన్స్ ఎబ్సార్ ప్షన్ పై 84శాతం మంది బాగుందని, 14 శాతం మంది పర్వాలేదని, బాగాలేదని 2శాతం మంది ఫీడ్ బ్యాక్ ఇచ్చారు. సైజ్ విషయంలో 89శాతం మంది బాగుందని, 11శాతం బాగాలేదని చెప్పారు. ఎకో ఫ్రెండ్లీ శానిటరీ ప్యాడ్స్ పంపిణీపైనా చర్చించడం జరిగింది. దీనిపైనా పరిశీలన చేస్తాం. ఎన్జీవోలతో మాట్లాడి బాలికల్లో అవగాహన పెంచేందుకు కూడా చర్యలు తీసుకుంటాం. వెండింగ్ మిషన్స్ విత్ స్మార్ట్ కార్డ్ ను ఇప్పటికే కేజీబీవీల్లో పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాం. అన్ని పాఠశాలలకు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటాం. హెచ్ పీవీ వ్యాక్సిన్ ను ప్రధాని నరేంద్ర మోదీ గారు చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇదో క్యాంపెయిల్ లా చేస్తాం. దీనిపై అనేక అపోహలు ఉన్నాయి. ఇది అవసరం. అందరం కలిసికట్టుగా దీనిపై అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి చెప్పారు. అంతముందు ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ మాట్లాడుతూ.. విద్యార్థినులకు నెలసరి వచ్చే సమయంలో సరైన హైజీన్ ప్రొడక్ట్స్ అందక పాఠశాలలకు గైర్హాజరవుతున్నారు. ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉంది. కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లో, కాలేజీల్లో చదువుతున్న బాలికలకు ఎకో ఫ్రెండ్లీ శానిటరీ ప్యాడ్స్ కచ్చితంగా అందించాలని ప్రభుత్వాన్నికోరారు.

## గల్ఫ్‌కు వెళ్లే 12 విమానాలు రద్దు

12 విమానాలు కూడా రద్దయ్యాయి. ఖతార్, యూఏఈ, కువైట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా నుంచి రావాల్సిన, వెళ్లాల్సిన విమానాలు రద్దు అయినట్లు అధికారులు తెలిపారు.

# అంతర్జాతీయ స్థాయి థీమ్ పార్కుల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం సిద్ధం

ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అడిగిన ప్రశ్నకు మంత్రి కందుల దుర్గేష్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ డిస్నీ వరల్డ్ లేదా యూనివర్సల్ స్టూడియోస్ వంటి భారీ ప్రాజెక్టులకు రూ. 35,000 కోట్ల నుండి రూ. 60,000 కోట్ల వరకు పెట్టుబడి అవసరమవుతుందని పేర్కొన్నారు.ఇటువంటి ప్రాజెక్టులను ప్రపంచవ్యాప్తంగా ప్రైవేట్ సంస్థలే నిర్వహిస్తాయని, ప్రభుత్వం కేవలం భూమి కేటాయింపు, అనుమతులు, రాయితీలు మాత్రమే కల్పిస్తుందని వివరించారు. ప్రస్తుతం భారతదేశంలో పర్యాటకుల సగటు ఖర్చు చేసే సామర్థ్యం (రూ. 20,000-21,000) అంతర్జాతీయ ప్రమాణాల కంటే తక్కువగా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో వీటిని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా డిస్నీ వరల్డ్ మరియు యూనివర్సల్ స్టూడియోస్ వంటివి యూఎస్ఏలోని ఓర్లాండో, లాస్ ఏంజిల్స్, జపాన్ లోని టోక్యో, ఫ్రాన్స్ లోని పారిస్,చైనాలోని షాంఘై వంటి మెట్రో పాలిటన్ నగరాల్లో ఉన్నాయని ఈ సందర్భంగా వివరించారు.వీటి ఏర్పాటు డిమాండ్, సప్లైల మీద ఆధారపడి ఉంటుందన్నారు.ఆయా దేశాల్లో రిటర్న్ ఉన్నాయి కాబట్టి వాటి ఏర్పాటుకు ఆస్కారం ఉందన్నారు. మన దేశంలో ఏర్పాటు చేయాలంటే పర్యాటకుల రాక, వారి ఖర్చు చేసే సామర్థ్యం ఎక్కువగా ఉండాలని స్పష్టం చేశారు.రాష్ట్రంలో పర్యాటక రంగానికి 'పారిశ్రామిక హోదా' కల్పించామని, భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం రూ. 40 కోట్ల వరకు, 5--10 శాతం స్థిర మూలధన పెట్టుబడి సబ్సిడీ అందిస్తుందని మంత్రి దుర్గేష్ తెలిపారు. 100% స్టాంపు డ్యూటీ రీయింబర్స్‌మెంట్, 100 శాతం భూ వినియోగ మార్పిడి రుసుము మినహాయింపు, పారిశ్రామిక టారిఫ్ ప్రకారం విద్యుత్ ఖర్చు రీయింబర్స్‌మెంట్ 7--15 ఏళ్ల పాటు 100 శాతం ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, 3 ఏళ్ల పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐలలో 50--100 శాతం రీయింబర్స్‌మెంట్, మెగా,అల్ట్రా-మెగా ప్రాజెక్టుల కోసం కేసు ప్రాతిపదికన ప్రత్యేక రాయితీలు ఇస్తుందన్నారు. భారత దేశంలో ముంబై, బెంగళూరు, హైదరాబాద్ లలో ఈ తరహా పార్కులు నిర్వహిస్తున్న ఇమాజికా, వండర్ లా వంటి సంస్థలతో పర్యాటక శాఖ చర్చలు జరుపుతోందని.. వారు తిరుపతి మరియు విశాఖపట్నంలో ప్రాజెక్టులపై ఆసక్తి చూపారని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. డిస్నీ వరల్డ్ తరహా ఏర్పాటుకు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడానికి హిక్సా, అరేబియన్ ట్రావెల్ మార్కెట్, ఐటీబీ బెర్లిన్, వరల్డ్ ట్రావెల్ మార్ట్ వంటి అంతర్జాతీయ రోడ్‌షోలతో పాటు ఢిల్లీలో జరిగిన సాటే( సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్ టూరిజం ఎగ్జిబిషన్), హైదరాబాద్ లో జరిగిన ట్రావెల్ టూరిజం ఫెయిర్ (టీటీఎఫ్) వంటి జాతీయ, ప్రాంతీయ సదస్సులలో పాల్గొన్నామన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన విశాఖ భాగస్వామ్య సదస్సులో పర్యాటక శాఖ రూ. 18,448 కోట్ల విలువైన 102 అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసిందని అందులో మూడు థీమ్ పార్కులకు సంబంధించినవని వివరించారు.ప్రత్తిపాడుఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సూచించిన కర్నూతల గ్రామంలోని స్థలంలో వీటి ఏర్పాటుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపితే సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారని మంత్రి దుర్గేష్ పునరుద్ఘాటించారు. పర్యాటక శాఖ పనితీరుపై, మంత్రి కందుల దుర్గేష్ సమర్థతపై ఎమ్మెల్యే రామాంజనేయులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

# పర్యావరణ హిత ప్రయాణానికి ప్రోత్సాహం



- ప్రభుత్వ ఉద్యోగులు, మీడియా ప్రతినిధులకు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు
- కంపెనీల నుంచి నేరుగా రాయితీపై కొనుగోలు అవకాశం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
- ఈవీల వినియోగంలో జిల్లాను మోడల్ జిల్లాగా మారుద్దామని పిలుపు

**ప్రజాభూమి ప్రతినిధి – విజయవాడ**
పర్యావరణ పరిరక్షణలో మేము సైతం అంటూ ప్రభుత్వ ఉద్యోగులు, మీడియా ప్రతినిధులను ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల వినియోగానికి చేరువచేసి.. తద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలనే ఉద్దేశంతో కంపెనీల నుంచి నేరుగా రాయితీపై జీరో డౌన్‌పేమెంట్, ఈఎంఐలతో ఈవీలను అందించే అవకాశం కల్పిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ.. కలెక్టరేట్‌లో ద్విచక్ర వాహనాల కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశం అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది ఏ ఒక్కరి బాధ్యతో కాదని.. సమష్టిగా కలిసి అడుగులేస్తేనే భావితరాలకు కాలుష్య రహిత పర్యావరణాన్ని బహుమతిగా అందించేందుకు అవకాశముంటుందన్నారు. పెరుగుతున్న వాయు కాలుష్యం, ఇంధనం ధరల నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాలు సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా మారుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు తమ దైనందిన ప్రయాణాల్లో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను ఉపయోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించడమే కాకుండా ఇంధన ఖర్చులను కూడా గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. ప్రభుత్వం కూడా పర్యావరణ హిత చర్యలను ప్రోత్సహిస్తూ ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని విస్తృతంగా పెంచేందుకు పలు చర్యలు తీసుకుంటోందన్నారు. పర్యావరణాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాల్సిన అవసరముందని.. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తూ ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంలో ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. పచ్చని పర్యావరణం, స్వచ్ఛమైన గాలి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

**వాహన కొనుగోలుకు పేరు నమోదు ఇలా..**
ఈవీ ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేయాలనుకునే వారు పేరు, వృత్తి, కార్యాలయం పేరు, సీఎఫ్ఎంఎస్/ఐడీ నంబరు, మొబైల్ నంబరు తదితర వివరాలతో అవసరమైన ధ్రువీకరణపత్రాలను సమర్పించి ఈ నెల 9వ తేదీ సోమవారం నుంచి కలెక్టరేట్‌లోని ప్రత్యేక కౌంటర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కేడీసీసీ బ్యాంకు సహకారంతో కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందని కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఎల్‌డీ ఎం కె.ప్రియాంక, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విజయవాడలో తారెత్తిస్తున్న భానుడు

**ప్రజాభూమి ప్రతినిధి – విజయవాడ సెంట్రల్**
విజయవాడలో ఎండలు నిప్పులు చెరుగుతున్నాయి. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు దాటడంతో బెంజ్ సర్కిల్, ఏలూరు రోడ్డు వంటి రద్దీ ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి. ఉక్కబోతతో ప్రజలు అల్లాడిపోతుండగా, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు. చిన్నారుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

## విష్ణుభట్ల సూర్యనారాయణ మృతి చాలా బాధాకరం



**ప్రజాభూమి ప్రతినిధి – అవనిగడ్డ/కోడూరు**
కోడూరు మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామ ప్రముఖులు విశ్రాంత మున్సబ్ విష్ణుభట్ల సూర్యనారాయణ మృతి చాలా బాధాకరమని మాజీ ఎంపీపీ పూత బోయిన భారత లక్ష్మి, కోడూరు పిఎసిఎస్ అధ్యక్షులు పూతబోయిన కరుణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కరుణ్ కుమార్ మాట్లాడుతూ మొదటి నుండి కూడా పూత బోయిన చిన్న వెంకటేశ్వరరావు విష్ణుభట్ల సూర్యనారాయణ తో చాలా సన్నిహితులుగా ఉండేవారని, మా కుటుంబానికి ఎప్పుడుకూడా సూచనలు సలహాలిస్తూ వారి ఆశీస్సులు ఉండేవి అని కరుణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు తెలిపారు. విష్ణుభట్ల సూర్యనారాయణ మృతి చెందడంతో ఆయన జ్ఞాపకంగా గతంలో మాజీ ఎంపీపీ పూతబోయిన చిన్న వెంకటేశ్వరరావు, వారి సతీమణి భారతి లక్ష్మి విష్ణుభట్ల సూర్యనారాయణ ను సన్మానిస్తున్న ఫోటోని తీసి పాత జ్ఞాపకలను గుర్తుతెచ్చుకున్నారు.

# పీ4 ప్రయాణంలో మరో ముందడుగు

- హాస్టల్ విద్యార్థులకు చేయూతగా కాకాని ఆశయ సాధన సమితి
- మరింత మంది మార్గదర్శులు ముందుకు రావాలని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పిలుపు



**ప్రజాభూమిప్రతినిధి – విజయవాడ**
ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 (పబ్లిక్--ప్రైవేట్--పీపుల్ పార్ట్‌నర్‌షిప్) కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా ముందుకు సాగుతోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. జి.కొండూరు గ్రామంలోని డా. బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు అందించేందుకు కాకాని ఆశయ సాధన సమితి సిద్ధం చేసిన పరుపులను కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం కలెక్టరేట్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సమాజంలోని వివిధ వర్గాలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి పేద కుటుంబాలు, విద్యార్థుల అభ్యున్నతికి చేయూతనందిస్తున్నారన్నారు. కొత్తగా ముందుకు వస్తున్న మార్గదర్శులను స్ఫూర్తిగా తీసుకొని పేదరిక నిర్మూలనలో మరింత మంది భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. దాతృత్వ భావంతో కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షులు డా. కాకాని తరుణ్ ముందుకు వచ్చి హాస్టల్ విద్యార్థులకు అవసరమైన పరుపులను అందించడం అభినందనీయమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు సరైన సదుపాయాలతో చదువుకునేలా చేయడంలో ప్రభుత్వం చేస్తున్న కృషిలో మార్గదర్శులు కూడా భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. పేదరిక నిర్మూలనలో సమాజంలోని ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. పీ4 కార్యక్రమం ద్వారా మార్గదర్శులు, దాతలు, సంస్థలు ముందుకు వచ్చి బంగారు కుటుంబాలకు చేయూత నందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచే అవకాశాలు కలుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమం సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడుతోందని చెప్పారు. 2029 నాటికి రాష్ట్రంలో జీరో పావర్టీ లక్ష్యాన్ని సాధించడం, 2047 నాటికి స్వర్ణాంధ్ర నిర్మాణం సాధించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని కలెక్టర్ వివరించారు. ఈ లక్ష్యాల సాధనలో పీ4 కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.

# సమాజ నిర్మాణానికి మహిళది ప్రధాన భూమిక : కె రామ్ జీ





**ప్రజాభూమి ప్రతినిధి – మచిలీపట్నం**
ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సూచనల మేరకు మహిళా సాధి కారత కార్యక్రమాలను ప్రోత్స హించే ఉద్దేశంతో కృష్ణా విశ్వవిద్యాలయం మహిళా సాధికారత సమన్వయకర్త డా. ఎల్. సుశీల ఆధ్వర్యంలో వాకథాన్ కార్యక్ర మం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల్లో మహిళా సాధికారత కార్యక్రమాలను బలోపే తం చేయడానికి విద్యార్థులు, అధ్యాపకులను అంబాసిడర్లుగా నామినేట్ చేయాలని ఆంధ్రప్ర దేశ్ మహిళా కమిషన్ విశ్వవిద్యాలయాలు కళాశాలలకు సూచించిన నేపథ్యంలో ఈ కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి కృష్ణా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కూన రామజీ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు సందేశం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళల సాధికారతకు అవగాహన అత్యంత అవసరమని, యువత ముందుండి సమానత్వం, గౌరవం కలిగిన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం రెక్టర్ ప్రొఫెసర్ ఎం.వి.బి. రావు మాట్లాడుతూ వాకథాన్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యతో పాటు సమాజానికి సేవ చేసే భావన ప్రతి విద్యార్థిలో పెంపొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. నవీన లావణ్య లత కూడా పాల్గొని మహిళా సాధికారత, సమాన హక్కులు, మహిళల భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళల పురోగతికి యువత చురుకైన పాత్ర పోషించాలని ఆమె పేర్కొన్నారు. మహిళా సాధికారత సమన్వయకర్త డా. ఎల్. సుశీల మాట్లాడుతూ మహిళల హక్కులు, సమాన అవకాశాలు సురక్షిత సమాజ నిర్మాణంపై అవగాహన పెంపొందించడమే ఈ వాకథాన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళల హక్కుల పరిరక్షణ సాధికారతకు మరింత బలం చేకూ ర్చే దిశగా ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్‌ను ఏర్పాటు చేసి రాయపూడి శైలజ ని ఛైర్‌పర్స న్‌గా నియమించడం ప్రశంసనీయమైన చర్య అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవి ద్యాలయం అధ్యాపకులు ప్రొఫెసర్ మారుతి, అమల, డా. మాధురి, డా. రంగశ్రీ పాల్గొన్నారు.

## బ్రాహ్మణులు అందరినీ కలుపుకుంటూ హిందూ ధర్మంలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయాలి



**ప్రజాభూమి ప్రతినిధి – మచిలీపట్నం**
సంకష్ట హర చతుర్థి సందర్భముగా సర్వేజనా సుఖినోభవంతు అంటూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ బ్రహ్మశ్రీ విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ ఘనాపాటి ఆధ్వర్యంలో బ్రాహ్మణ సేవా సంఘం వారు బుట్టాయిపేట శ్రీ చిట్టి పిళ్ళారయ్య స్వామి వారి దేవాలయములో లోక సంక్షేమం కొరకు శుక్రవారం స్వామివారికి అభిషేకము లు, అర్చన లు, శ్రీ లక్ష్మీ గణపతి హోమం లను బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ దంపతు లు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణ సేవా సంఘం వారి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ప్రముఖ వైద్యులు, బ్రాహ్మణ సేవా సంఘం సీనియర్ నాయకుడు, డాక్టర్ బృందావనం ధన్వంతరి ఆచార్య మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణలో బ్రాహ్మణులు అందరినీ కలుపుకుంటూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి అని కోరారు. బ్రాహ్మణులు సమాజ సేవలో ముందు ఉంటూ, సమాజాభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేయడం మన బాధ్యత అన్నారు. బ్రహ్మశ్రీ విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణ పిల్లలకు సంధ్యావందనం ఉచితంగా నేర్పించడం జరుగుతుందని, భవిష్యత్తు తరాలకు మన సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసే బాధ్యత తల్లిదండ్రులపై ఎంతో ఉంది అన్నారు. హిందూ ధర్మం ఎంతో గొప్పదని అటువంటి ధర్మ పరిరక్షణలో మనం మనతోపాటు ఉన్నవారందరినీ కలుపుకుంటూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం కృషి చేయాలి అన్నారు. దేవాలయాలు మన సంస్కృతికి చిహ్నాలని, అటువంటి దేవాలయాలలో మంచి మంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది అన్నారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి దేవాలయంలోనూ అర్చకుడితోపాటు, ఒక బ్రాహ్మణుడిని దేవాలయ కమిటీలలో నియమించడం జరిగిందని, ఆ కమిటీలలో ఉన్న బ్రాహ్మణులు దేవాలయాల అభివృద్ధికి చక్కటి సూచనలు, సలహాలు ఇస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు దేవాలయాల్లో వెల్లివిరిసేలా విశేష కృషి చేయాలి అని కోరారు. బ్రాహ్మణులకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పెద్దల దృష్టికి ఆ సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఫణి కుమార్ పలువురు బ్రాహ్మణులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు, మోపర్తి సుబ్రమణ్యం, కానుకొలను ఫణి కిరణ్ శర్మ, సింగరాజు గోవర్ధన్, వడ్లమన్నాటి మారుతి దివాకర్, జమ్మలమడక సేతురామయ్య, జొన్నలగడ్డ కాంత్, దిట్టకవి వెంకటేశ్వరరావు ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, నిమ్మగడ్డ శ్రీధర్, సర్వా లలిత కుమారి, జొన్నలగడ్డ మాధవి తదితరులతో పాటు జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి నూతన సూపర్నెంట్ గా బాధ్యతలు స్వీకరించిన డా. లీలా ప్రసాద్



**ప్రజాభూమి ప్రతినిధి – మచిలీపట్నం**
మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రి నూతన సూపర్నెంట్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ లీల ప్రసాద్. ఇటీవల ప్రభుత్వం నూతన సూపర్నెంట్ గా లీలా ప్రసాద్ ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆసుపత్రి లో పలువురు డాక్టర్లు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా భాద్యతలు స్వీకరించిన సూపరింటెండెంట్ డా.లీలా ప్రసాద్ మాట్లాడుతూ ఆసుపత్రికి సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ముం దుగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తామన్నారు. కొన్ని సమస్యలు బడ్జెట్ తో ముడి పడిన అంశాలు కూడా ఉంటాయి అని వాటిని ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ లు, డాక్టర్లు, ఆఫీస్ ఏ డి, ఏఓ, సహచర డాక్టర్లు, సెక్యూరిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

### కలెక్టరు డీకే బాలాజీ



**ప్రజాభూమి ప్రతినిధి – మచిలీపట్నం**
ఈనెల 8 వ తేదీన అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నగరంలోని తన క్యాంపు కార్యాలయం నుండి అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహణ ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 8 వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా స్థాయి సమావేశం తో పాటు నియోజకవర్గాల వారీగా ఉత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి జిల్లా స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించామన్నారు. ఆ అధికారి స్థానిక ప్రజాప్రతితులు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో డిఆర్డిఏ ఏపిఎం లు, పోలీసులతో సమన్వయం చేసుకొని సజావుగా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలన్నారు ముఖ్యంగా మహిళ వ్యాపారవేత్తలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇందులో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖల ప్రదర్శనశాలలు కూడా ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా మహిళా శిశు సంక్షేమ శాఖ హెల్ప్ లైన్ 112 టోల్ ఫ్రీ సర్వీసు, గృహహింస, వన్ స్టాప్ సెంటర్, బాల్యవివా హాల నిరోధక చట్టం తదితర అంశాలతో కూడిన ప్రదర్శన శాల ఏర్పాటు చేయాలన్నా రు. అలాగే పోలీస్ శాఖ ముఖ్యంగా శక్తి టీం, మహిళల భద్రత వంటి అంశాలపై ప్రదర్శనశాల ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సత్యనారాయణ జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి ఎంఎన్ రాణీ, డి ఆర్ డి ఎ పిడి హరిహరనాథ్ జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, మెప్మా పిడి సాయిబాబు, ఎల్ డి ఎం రవీంద్రారెడ్డి, పలువురు ఎంపీడీవోలు మునిసిపల్ కమిషనర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థినిలకు అవగాహన సదస్సులు నిర్వహించాలి : కలెక్టర్ డీకే బాలాజీ



**ప్రజాభూమి ప్రతినిధి – మచిలీపట్నం**
జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థిని విద్యార్థులు తప్పుదారి పట్టకుండా మంచి చెడుల వ్యవహార శైలిపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుతో కలసి వారి చాంబర్లో బాలబాలికలు, యువత భద్రతపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రాను రాను యువత వ్యవహార శైలి చాలా మార్పు చెంది తప్పుదారి పడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బాల్య దశలోనే ముఖ్యంగా బాలికలకు మంచిగా తాకడం, చెడుగా తాకడం( గుడ్ టచ్, బ్యాడ్ టచ్) వంటి విషయాల పైన సరైన అవగాహన కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో ఉండే విద్యార్థులకు నూటికి నూరు శాతం అర్థమయ్యే విధంగా వాటి గురించి వివరించాలన్నారు. అంతేకాకుండా తొందరపాటు చర్యతో ముందస్తు గర్భధారణ వలన కలిగే ఇబ్బందులు విశదంగా తెలియజేయాలన్నారు. అంతే కాకుండా బాల్య వివాహాలు కూడా చేసుకోరాదని దాని వలన కలిగే నష్టాలను, ఆరోగ్య సమస్యలను వివరించాలన్నారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ తల్లిదండ్రులకు తమ పిల్లలపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో వారు తప్పుదారి పడుతున్నారన్నారు. ముఖ్యంగా బాలికలు విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఇటువంటివి పునరావృతం కాకుండా నియంత్రించేందుకు జిల్లా విద్యాధికారి వారానికి 3 రోజుల చొప్పున 10 రోజుల షెడ్యూల్ తయారు చేయాలని ఆ షెడ్యూల్ ప్రకారము ఏ రోజు ఏ పాఠశాలలో సంబంధించిన విద్యా, వైద్య , పోలీసు తదితర సంబంధిత శాఖల అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల లో కూడా మార్పు రావాలని తమ పిల్లల బంగారు భవిష్యత్తుకు వారు తోడ్పడే విధంగా జిల్లా యంత్రాంగంతో సహకరించాలన్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం లో విద్యార్థుల బాగోగుల గురించి సరైన అవగాహన కలిగించాలన్నారు. వసతి గృహాలకు సెలవులు ఇచ్చినప్పుడు విద్యార్థులు వారి స్వగ్రామం వెళ్లే ముందు తల్లిదండ్రుల సమక్షంలో ముందస్తు గర్భధారణ, ఫోక్సో చట్టం బాల్యవివాహాల నిరోధక చట్టం గురించి క్షుణ్ణంగా వివరించాలన్నారు. అధికారులందరూ చొరవ తీసుకొని సమన్వయంతో కొంత కాలం అవగాహన తరగతులు నిర్వహిస్తే ఫోక్సో బాల్యవివాహాలు వంటి నేరాలు తగ్గుతాయన్నారు. పాఠశాల విద్యార్థినులకు బాలికలు మంచిగా తాగడం, చెడుగా తాకడం అనే విషయాల పైన స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు.. దానిని గుర్తించి ఎలాంటి భయం లేకుండా తల్లిదండ్రులకు గాని ఉపాధ్యాయులకు గాని ధైర్యంగా చెప్పే విధంగా వారిని చైతన్య పరచాలన్నారు. చదువు అందరి కీ ముఖ్యమని, బాలికలు మధ్యలో చదువును ఆపకుండా దాని యొక్క విలువను కూడా తెలియజేయాలన్నారు ముందస్తు గర్భధారణ వలన కలిగే ప్రతికూల పరిస్థితులను తెలియజేయాలన్నారు ముఖ్యంగా ఆర్థిక , సామాజిక ఇబ్బందులు వివరించాలన్నారు బాలికలు గాని, యువతులుగాని ఎవరికైనా అవసరం అయితే 112 అనే హెల్ప్ లైన్ నెంబర్ కు గాని, 1098 చైల్డ్ కేర్ నెంబర్కు గాని ఫోన్ చేసి వారి ఇబ్బందులను తెలియజేయాలన్నారు అటువంటి వారికి రక్షణ కల్పించి అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి సరళ కుమారి, డీఈవో సుబ్బారావు, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ యుగంధర్, బీసీ సంక్షేమ సాధికారత అధికారి రమేష్ , కార్మిక శాఖ సహాయ కమిషనర్ విష్ణు, ఐసిడిఎస్ పీవో విజయలక్ష్మి, డి సి ఆర్ బి సి ఐ పెద్దిరాజు, ఇంటర్ విద్యాశాఖ ఏజీఎంసి నాగ రవి తదితర అధికారులు పాల్గొన్నారు.

## వేముల దీవిలో సబ్ స్టేషన్‌కు రూ.3.5 కోట్ల నిధులు మంజూరు

టెండర్ల ప్రక్రియ పూర్తయ్యాక పనులు ప్రారంభిస్తాం

విద్యుత్ శాఖ ఏడిఈ డి రాజీవ్

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు



పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం నియోజకవర్గ పరిధిలోని వేముల దీవి గ్రామంలో రూ. 3. 5 కోట్లు నిధులు సబ్ స్టేషన్ నిర్మాణానికి మంజురయ్యాయని ఏపీ ఈపీడీసీఎల్, విద్యుత్ శాఖ నర్సాపురం సబ్ డివిజన్ ఏడిఈ డి రాజీవ్ తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యాక పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సబ్ స్టేషన్ వల్ల నరసాపురం నియోజకవర్గం లోడు ఒత్తిడి తగ్గి నాణ్యమైన విద్యుత్తు సరఫరా అవుతుంది అని తెలిపారు. నరసాపురం నియోజకవర్గంలో ఇంత వరకు 489 సోలార్ విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. లో వోల్టేజ్ నిర్మూలనకు యుద్ధ ప్రాతిపదికన ట్రాన్స్ఫార్మర్లు అవసరమైన చోట్ల ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్పు బొమ్మిడి నాయకర్ సిఫా ర్సుల మేరకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. వేసవి విద్యుత్ లోడును తట్టుకునేందుకు భీమవరం నుంచి నర్సాపురం 130 కె వి స్టేషన్కు కొత్త విద్యుత్తు అదనపు లైను రూ. మూడు కోట్ల నిధులతో ఏర్పాటు చేస్తున్నామని శరవేగంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ పనులు పూర్తయితే నాణ్యమైన విద్యుత్తు నరసాపురం నియోజకవర్గం లో అంతరాయం లేకుండా సరఫరా జరుగుతుందని ఏ డి ఈ రాజీవ్ వివరించారు.

## పశువుల కాపరులు రైతుల పరిస్థితి ని అర్థం చేసుకోవాలి

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం



పొగాకు, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలు పండించే రైతులు, పశువులు పంట పొలాల్లో పడ టం వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, కనుక పశువుల కాపరులు రైతుల పరిస్థితి ని అర్థం చేసుకోవాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని పలుగ్రామాల్లో, రామవరం, చిన్న మట్టపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న పలు రకాల పంటలను రైతులు పొగాకు,మిర్చి,మొక్క జొన్న వేసిన రైతులు పంట ఇంకా కోతకి రాలేదు, కారణం అందరికీ తెలిచిన విషయమే ఈ సంవత్సరం గోదావరి వరదలు కారణంగా వ్యవసాయం ఆలస్యం అవడంతో ఇంకా పంటలను చాలా కష్టపడి పెట్టుబడి పెట్టాము కానీ చాలా వరకు పంటలు కోతకి రాకపోవడంతో మిర్చి పం టలకు ఇంకా కంచెలు కట్టుకోకపోవడంతో పశువుల కాపరులు పశువులను వదిలిపెడితే మా పంటలు మొత్తం పాడైపోతాయని రైతులు ఆందోళన చెందుతున్న పరిస్థితి. రైతన్నల పరిస్థితిని పశువుల కాపరులు ఈ నెల చివరి వరకు పశువులను కాపు కాసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## దివ్యాంగ పిల్లలకు ఇంటివద్దే మధ్యాహ్న భోజన పథకం అందించాలి



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

1995, 2016 దివ్యాంగుల హక్కుల చట్టాల ప్రకారం పాఠశాలకు హాజరు కాలేని దివ్యాంగ పిల్లలు ఇంటి వద్దే ఉండి చదువుకుంటున్న ప్పటికీ, పాఠశాలలో వారి పేరు నమోదు ఉన్నట్లయితే వారికి కూడా మధ్యాహ్న భోజన పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని ల్యాంప్ అడ్వకేసి కోఆర్డినేటర్ బడుగు సుబ్బాయ మ్మ మండల విద్యాశాఖ అధికారి బి. శ్రీనివాసరాజుకి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై స్పందించిన మండల విద్యాశాఖ అధికారి బి. శ్రీనివాసరాజు మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈ విషయాన్ని తెలియజేసి, పాఠశాలకు రాలేని దివ్యాంగ విద్యార్థులకు కూడా వారికి అందాల్సిన బియ్యం, గుడ్లు, చిక్కీలు అందేలా చర్య లు తీసుకుం టామని హామీ ఇచ్చారు. అందులో భాగంగానే అధికారుల ఆదేశాల మేరకు రావుల పాలెం మండలంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, వెదిరేశ్వరంలో ప్రధానో పాధ్యాయులు వి. మురళీకృష్ణ శుక్రవారం ముప్పిడి దివ్య (మానసిక వైకల్యం)కు ఫిబ్రవరి నెలకు సంబంధించిన మధ్యాహ్న భోజన పథకం సరుకులు అయిన బియ్యం, గుడ్లు, చిక్కీలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్, పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ ఎస్. రాంప్రసాద్, క్లాస్ టీచర్ దేబో రా గ్రేస్ తదితరులు పాల్గొన్నారు. ఈ చర్యతో పాఠశాలకు హాజరు కావలేని దివ్యాంగ విద్యా ర్థులకు కూడా ప్రభుత్వ పథకాలు చేరువ కావడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

## బాణాసంచా తయారీ కేంద్రాల్లో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి - ఎస్పీ రాహుల్ మీనా హెచ్చరిక.



ప్రజాభూమి ప్రతినిధి కొత్తపేట.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బాణాసంచా తయారీ కేంద్రాల్లో భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించినట్లయితే కఠిన చర్యలు తీసుకోవ డంతో పాటు అనుమతులను రద్దు చేసే పరిస్థితి వస్తుందని స్పష్టం చేశారు. శుక్రవారం కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని బాణాసంచా తయారీ కేంద్రాల్లో ఎస్పీ రాహుల్ మీనా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రావులపాలెం రూరల్ సిఐ విద్యాసాగర్, ఎస్సై సురేంద్ర తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు. తయారీ కేంద్రాల్లో తయారవుతున్న బాణాసంచా, వాటి తయారీలో ఉపయోగిస్తున్న ముడి పదార్థాలు, కార్మికులకు కల్పిస్తున్న భద్రతా చర్యలు తదితర అంశాలను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. కార్మికులు భద్రతా పరికరాలు ఉపయోగిస్తున్నారా, అగ్ని ప్రమాదాలు నివారించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గతంలో రాయవరం ప్రాంతంలో, ఇటీవల వేట్లపాలెం బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాద ఘటనలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని బాణాసంచా తయారీ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ప్రతి కేంద్రం ప్రభుత్వం నిర్దేశించిన భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. జిల్లాలో బాణాసంచా తయారీ కేంద్రాలు నిర్వహిస్తున్న యజమానులు భద్రతా ప్రమాణాలను పాటించి కార్మికుల ప్రాణాలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.

## ఎమ్మెల్యేల ప్రజాదర్బార్‌లో అందిన వినతుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

- 10 సూత్రాలు, పీ4 కార్యక్రమాలు పూర్తి లక్ష్య సాధన చేయాలి.
- జిల్లాలోని నియోజకవర్గాలను ర్యాంకింగ్ లలో ముందుస్థాయిలో ఉండేలా చూడాలి.
- నియోజకవర్గ స్థాయిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి.
- వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కలిగించి ప్రభుత్వ సేవలు వినియోగించుకునేలా చూడాలి.
- జిల్లా అధికారులు, నియోజకవర్గ విజన్ యూనిట్ కార్యాలయాల ఇంచార్జ్‌లతో జిల్లా కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్.

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా



నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు నిర్వహించే 'ప్రజాదర్బార్' లో అందిన వినతులు నిర్దేశించిన సమయంలోగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి శుక్రవారం ప్రజాదర్బార్ లో వినతులు పరిష్కారం, 10 సూత్రాల అమలు, పీ4 కార్యక్రమం, వాట్సాప్ గవర్నెన్స్ అంతర్జాతీయ మహిళా దినోత్సం నిర్వహణ, వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై వివిధ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ విజన్ యూనిట్ కార్యాలయాల అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే లు ప్రజాదర్బార్ లు నిర్వహించి ప్రజల నుండి పెన్షన్లు, భూ సమస్యలు, సామజిక సమస్యలపై వినతులను స్వీకరిసున్నారని, వాటి పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, నిర్దేశించిన సమయంలోగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ప్రతీ దశలోనూ సంబంధిత సిబ్బందితో నియోజకవర్గ విజన్ యూనిట్ కార్యాలయ సిబ్బంది పరిశీలించాలన్నారు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న 10 సూత్రాల కార్యక్రమాలను నూరు శాతం లక్ష్యాలను సాధించేలా అధికారులు పనిచేయాలన్నారు. జిల్లాలోని ప్రతీ నియోజకవర్గ స్థాయిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించేలా నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా దినోత్స కార్యక్రమంలో నిర్వహించే కార్యక్రమాలపై సంబంధిత ఎమ్మెల్యేతో చర్చించి కార్యక్రమాల ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. నియోజకవర్గాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ర్యాంకింగ్ ఇస్తున్న దృష్ట్యా, సిబ్బంది 10 సూత్రాల కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలు జరిగి, జిల్లాలోని ప్రతీ నియోజకవర్గం అభివృద్ధిలో ర్యాంకింగ్ లో ముందువరసలో ఉండేలా నియోజకవర్గ విజన్ యూనిట్ కార్యాలయ పర్యవేక్షించాలన్నారు. పీ4 కార్యక్రమంలో నూరు శాతం బంగారు కుటుంబాలను మార్గదర్శులతో అనుసంధానం చేయాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ అందిస్తున్న సేవలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కలిగించి, ప్రజలు వినియోగించుకునేలా గ్రామ స్థాయి సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ విజన్ యూనిట్ కార్యాలయాల ఇంచార్జ్‌లు పాల్గొన్నారు.

## వంట గ్యాస్ గండం, సిలిండర్ల బుకింగ్ సరఫరాపై ఆంక్షలు

ప్రజా భూమి ప్రతినిధి-పెదపాడు.

వంటగ్యాస్ వినియోగదారులకు అలర్ట్. వంట గ్యాస్ సరఫరాకు గండం పొంచి ఉంది. పశ్చిమా సియాలో నెలకొన్ని ఉద్రిక్తతల ప్రభావం చమురు సరఫరా పై పడింది. దీంతో.. నాలుగు రోజులుగా వంట గ్యాస్ సిలిండర్ల కోసం బుకింగ్ ఒత్తిడి పెరుగుతోంది. దీంతో.. అనధికారికంగా ఆంక్షలను ఆయిల్ కంపెనీలు అమలు చేస్తున్నాయి. ఫలితంగా వినియోగదారుల్లో మరింత ఆందోళన పెరుగుతోంది. బుకింగ్ కోసం తాజాగా నిర్దేశించిన గడువు పూర్తియిన తరువాతనే రిజిస్టర్ చేసుకోవటం ఈ ఆందోళనకు కారణంగా నిలుస్తోంది. పశ్చిమా సియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు భారతీయ వంటింట్లో మంట పుట్టిస్తున్నాయి. ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో వంటగ్యాస్ (ఎల్పిజి) సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ముడి చమురు నిల్వలు దాదాపు 8 వారాల వరకు ఉన్నప్పటికీ, సరఫరా పూర్తిగా నిలిచిపోతే ఇంధన రేషనింగ్ చేయాల్సిన గడ్డు పరిస్థితి తప్పదనే అంచనాలు మొదలు అయ్యాయి. ఫలితంగా డొమెస్టిక్ వంట గ్యాస్ వినియోగదారులు ముందుగానే గ్యాస్ రీఫిల్స్ కోసం పెద్ద ఎత్తున బుక్ చేసుకుంటున్నారు. గత నాలుగు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో వంట గ్యాస్ బుకింగ్ కోసం వినియోగదారులు పెద్ద సంఖ్యలో బుక్ చేసుకుంటున్నారు. ఒత్తిడి పెరుగుతున్న వేళ ప్రధాన అయిల్ కంపెనీల డీలర్లు అనధికారికంగా సిలిండర్ బుకింగ్ పైన ఆంక్షలను



అమలు చేస్తున్నారు. ఇందు కోసం డబుల్ సిలిండర్ ఉన్న వారికి 30 రోజులు.. సింగిల్ సిలిండర్ ఉన్న వారికి 21 రోజులు గడువుగా నిర్దేశించారు.సిలిండర్ల బుకింగ్‌పై ఆంక్షలు చివరి సిలిండర్ అందుకున్న రోజు నుంచి 21 రోజుల తరువాత అయితేనే గ్యాస్ సిలిండర్ తిరిగి బుక్ చేసుకుంటామని చెబుతున్నారు. ఆయిల్ కంపెనీల నుంచి అధికారికంగా ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు రాకపోయినా... వినియోగదారుల నుంచి పెరుగుతున్న బుకింగ్ ఒత్తిడిని తగ్గించేందుకు ఈ ఆంక్షలను అమలు చేస్తున్నారు. యుద్ధ ప్రభావంతో రానున్న రోజుల్లో వంట గ్యాస్ కు కొరత ఏర్పడుతుందనే చర్చ పెద్ద ఎత్తున జరుగుతోంది. దీంతో.. గతం కంటే భిన్నంగా ఒకే సారి రెట్టింపు సంఖ్యలో వంట గ్యాస్ సిలిండర్ల కోసం బుకింగ్ లు జరుగుతున్నాయి. నిర్దేశిత గడువు మేరకే బుకింగ్స్ జరిగే విధంగా ఆయిల్ కంపెనీలు వినియోగదారులు ఉపయోగించే పోర్టల్స్, యాప్ ల సాఫ్ట్ వేర్ లో మార్పులు చేసారు. దీంతో.. ఈ యుద్ధం మరింత కాలం కొనసాగితే వంట గ్యాస్ తో పాటుగా పెట్రోల్, డీజిల్ సరఫరాలోనూ సమస్యలు వస్తాయనే చర్చ సాగుతోంది.

## ఇంటర్ పరీక్షలలో మాస్ కాపీయింగ్ జరగకుండా సిసి కెమెరాలతో నిఘా పెట్టాలి.

- మాస్ కాపీయింగ్ జరిగితే సంబంధిత ఇన్విజిలేటర్, కేంద్రం పర్యవేక్షకులపై చర్యలు.
- జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా

ఇంటర్ పరీక్షలలో మాస్ కాపీయింగ్ జరగకుండా సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక అశోక్ నగర్ లోని పిడి బిటి కళాశాలలో శుక్రవారం ఇంటర్ పరీక్షల నిర్వహణను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీ రూమ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఇంటర్ పరీక్షలను 130 కేంద్రాలలో ఈనెల 24వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. 34,615 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. ప్రతీ పరీక్షా కేంద్రాల హాల్స్ లో సిసి కెమెరాలతో నిఘా ఏర్పాటుచేయడం జరిగిందని, ఎక్కడైనా మాస్ కాపీయింగ్ జరిగితే సంబంధిత ఇన్విజిలేటర్ పై చర్యలు తీసుకుంటామని, ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా ఇన్విజిలేటర్లు పర్య



వేక్షించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో సెల్ ఫోన్‌లను ఎట్టిపరిస్థితులలోనూ అనుమతించవద్దన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్ నెట్ సెంటర్ల ను ఉదయం 8.30 గంటల నుంచి పరీక్ష ముగిసేవరకు ఆయా షాపులను మూసివుంచాలన్నారు. పరీక్షా కేంద్రాలలో త్రాగునీరు, పారిశుద్యం ఏర్పాట్లను ప్రతిరోజు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ 08812-230197 ఫోన్ నెంబరుతో ఏర్పాటు చేయడం జరిగిందని, ఏదైనా సమస్య ఉంటె కంట్రోల్ ఫోన్ చేయవచ్చని కలెక్టర్ చెప్పారు. అనంతరం కళాశాలలోని సిసి కెమెరాల పర్యవేక్షణ విభాగాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఓ పి. యోహాను, ఏలూరు తహసీల్దార్ గాయత్రి, ప్రభృతులు పాల్గొన్నారు.

## 7వ డివిజన్ చొదిమెళ్ళలో క్రియా శీలక సభ్యత్వం నమోదు కార్యక్రమం

- కార్యకర్తల సంక్షేమానికి జనసేన పార్టీ ప్రాధాన్యత
- రెడ్డి అప్పల నాయుడు వెల్లడి..

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు



జనసేన పార్టీ 5వ విడత ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఏలూరులో విజయవంతంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి శివరామకృష్ణ ప్రసాద్ తో కలిసి జనసేన నాయకులు,సాధక్ లు, 27 వ డివిజన్ చొదిమెళ్ళలో నిర్వహించిన సభ్యత్వం నమోదు శిబిరాన్ని శుక్రవారం పరిశీలించారు. సభ్యత్వ నమోదులో ఎదురయ్యే సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. అలాగే జనసేన నాయకులకు ఉద్యమి సభ్యత్వ నమోదు ద్వారా కార్యకర్తలకు కలిగే ప్రయోజనాలు, నమోదు విధానం, భవిష్యత్తులో పార్టీ పరంగా అందించే భద్రతా అంశాలను వివరించారు. కార్యకర్తల క్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పవన్ కళ్యాణ్ ప్రారంభించిన ఈ ఉద్యమి సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకొని ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. 27 వ డివిజన్ చొదిమెళ్ళలో అధిక సంఖ్యలో ఉద్యమి సభ్యత్వాలు నమోదు అయ్యేలా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకొని పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో డివిజన్ ఇంచార్జీ బెజవాడ నాగభూషణం కుమార్, ఉద్యమి సభ్యులు, వీర మహిళలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## నేడు "కోట" సర్వసభ్య సమావేశం

ప్రజా భూమి ప్రతినిధి-కామవరపుకోట

కామవరపుకోట మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశము నేడు (శనివారం) మధ్యా హ్నం 2.30 గం.లకు అధ్యక్షులు మేడవరపు వెంకట సత్య ఛాయా విజయలక్ష్మి ఆధ్వర్యం లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చెప్పారు. మండల ప్రజా పరిషత్ కామవరపుకోట వారి అధ్యక్షతన కామవరపుకోట మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరము నందు సర్వ సభ్య సమావేశము నిర్వహించబడును. ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో రావాలని కోరారు.

## జీలుగుమిల్లిలో ప్రగతి పథం రూ.25 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

### సర్పంచ్ చిర్రి జగదంబ చొరవతో మారుతున్న గ్రామ రూపురేఖలు

ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

జీలుగుమిల్లి గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు సరికొత్త రూపు సంతరించుకుంటున్నాయి. గ్రామస్తుల దశాబ్దాల నాటి కలలను సాకారం చేస్తూ, మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా సర్పంచ్ చిర్రి జగదంబ ఆధ్వర్యంలో రహదారుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.25 లక్షల భారీ నిధులతో పలు ప్రధాన అంతర్గత రహదారులను సిమెంట్ (సీసీ) రోడ్లుగా మారుస్తున్నారు.స్థానిక హౌసింగ్ ఆఫీసు నుండి హిందూ స్మశాన వాటిక వరకు 340 మీటర్ల పొడవునా నూతన రహదారిని నిర్మించారు. గతంలో గుంతలమయంగా ఉన్న ఈ మార్గంలో అంత్య



క్రియల సమయంలో ప్రజలు పడే ఇబ్బందులకు ఇప్పుడు చెక్ పడింది.మైలవరపు మల్లికార్జున్ నివాసం నుండి రాము నివాసం వరకు 36 మీటర్లు, అలాగే పొట్ట ప్రసాద్ ఇంటి నుండి కొప్పుల సత్యనారాయణ ఇంటి వరకు 37 మీటర్ల మేర సిమెంట్ రోడ్లను నిర్మించి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచారు. గతంలో వర్షాకాలంలో బురదమయంగా మారే ఈ వీధుల్లో ఇప్పుడు వృద్ధులు, విద్యార్థులు సులభంగా ప్రయాణించగలుగుతున్నారు.పనుల నాణ్యతలో రాజీ పడకుండా సర్పంచ్ స్వయంగా పర్యవేక్షించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## భారీగా గంజాయి పట్టివేత: రూ. 14 కోట్ల విలువైన సరుకు స్వాధీనం!

ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

పోలీసులు భారీ ఆపరేషన్ నిర్వహించి భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 598 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నట్లు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ వెల్లడించారు.

**డీసీఎం వ్యాన్‌లో గుట్టుచప్పుడు కాకుండా రవాణా**

ఒక మినీ డీసీఎం వ్యాన్ లోని ట్రే లలో గంజాయిని ఉంచి రవాణా చేస్తున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీనిపై తక్షణమే స్పందించిన జీలుగుమిల్లి పోలీసులు నిఘా పెట్టి, వాహనాన్ని అడ్డుకొని తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భారీగా నిల్వ ఉన్న గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. వీటి మార్కెట్ విలువ సుమారు 14 కోట్ల రూపాయల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**పోలీసుల కీలక పాత్ర**

గంజాయితో పాటు రవాణాకు ఉపయోగించిన మినీ వ్యాన్‌ను కూడా పోలీసులు స్వాధీనం



చేసుకున్నారు. ఈ భారీ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించిన అధికారులను ఎస్పీ అభినందించారు.జంగారెడ్డిగూడెం ఏఎస్పీ సుష్మిత్ రామనాథన్, పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు ఈ మీడియా సమావేశంలో పాల్గొని వివరాలను వెల్లడించారు.అక్రమ రవాణాను సమర్థవంతంగా అడ్డుకున్న జీలుగుమిల్లి సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ క్రాంతి కుమార్ మరియు వారి సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు.

**నిఘా కఠినతరం**

జిల్లాలో అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని, గంజాయి సాగు లేదా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను మరింత కఠినతరం చేస్తామని తెలిపారు.

## కొబ్బరి కాయ ధరకు చేరిన నిమ్మకాయ ధర



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

గతంలో నిమ్మకాయ ధర ఒకటికి రూపాయి కంటే తక్కువ ఉండేది. దీంతో గిట్టుబాటు ధర లభించక పశ్చిమగోదావరి జిల్లాలో నిమ్మ తోటలను రైతులు తొలగించారు. సోషల్ మీడియా పుణ్యమా అంటూ నిమ్మకాయ వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేపడంతో మళ్లీ నిమ్మకాయలను వినియోగించడం ఎక్కువైంది. దీంతో నిమ్మ కాయలకు డిమాండ్ ఏర్పడి ధర పెరిగింది. ప్రస్తుతానికి దీని ధర ఏకంగా రిటైల్ మార్కెట్లో ఒక్కొక్కటి పెద్ద సైజు రూ. 7 నుంచి 10 రూపాయల వరకు పలుకుతోంది. దీంతో నిమ్మకాయ కూడా కొబ్బరికాయతో పోటీపడుతోందని పలువురు అంటున్నారు. గతంలో ఇక్కడ నిమ్మ తోటలు ఎక్కువగా ఉండేవని ధర లేకపోవడంతో రైతులు నిమ్మ తోటలను తీసివేయడంతో గూడూరు నుంచి వెయ్యి కాయలకు 5000 రూపాయలు హోల్సేల్ మార్కెట్లో కొనుగోలు చేస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు.


## హెల్మెట్ ధరించడం ప్రాణరక్షణకు కవచం: ఎస్సై శుభశేఖర్



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు హెల్మెట్ ధరించడం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలని ఆగిరిపల్లి ఎస్సై శుభశేఖర్ సూచించారు. శుక్రవారం ఆగిరిపల్లి నుండి నూజివీడు వెళ్లే ప్రధాన రహదారి వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం ప్రమాదకరమని, ప్రతి ఒక్కరూ తమ భద్రత కోసం తప్పని సరి గా హెల్మెట్ ధరించాలని శుభ శేఖర్ సూచిం చారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు.

## పూర్తి బాధ్యతలతో ఎంపీడీవోగా షేక్ అబ్దుల్ సలాం నియామకం



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్గా విధులు నిర్వహిస్తున్న షేక్ అబ్దుల్ సలాంను మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఎంపీడీవో) పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ ముఖ్య కార్యనిర్వాహణాధికారి, జిల్లా ప్రజా పరిషత్, కృష్ణా జిల్లా, మచిలీపట్నం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆయన ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

ఈ సందర్భంగా అబ్దుల్ సలాం మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా కొనసాగించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

## కొత్తపేటలో 14న నేషనల్ లోక్ అదాలత్ నిర్వహణ

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఏ. సాయికుమార్, కె. ప్రకాష్ బాబు వారి ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ (రెండవ శనివారం) నేషనల్ లోక్ అదాలత్ కొత్తపేట కోర్టు ఆవరణంలో నిర్వహించనున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ వెల్లడించింది. ఈ లోక్ అదాలత్లో కోర్టుల్లో పెండింగ్లో ఉన్న సివిల్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు, ఎంవీ కేసులు తదితరాలను పరస్పర రాజీ ద్వారా పరిష్కరించనున్నట్లు తెలిపారు. సంబంధిత కేసుల పక్షులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని త్వరితగతిన సమస్యలను పరిష్కరించుకోవాలని కమిటీ కోరింది.

## గిరిజన గ్రామాలలో పెరుగుతున్న హిందూ ధార్మిక భావం

ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి



గిరిజన గ్రామాలలో పరాయి మతాలు దూసుకొస్తున్న హిందూ ధార్మికతపై చైతన్యం చూపుతున్నారు. రాయి రప్ప చెట్టు పుట్ట మొక్కుకునే గిరిజన గ్రామాలు హిందూ ధార్మికతపై మొక్కు చూపుతున్నారు. అందుకు గ్రామాలలో వివిధ దేవత లా గుడులు నేలకొలుపుతున్నారు.హిందూ ధార్మిక చైతన్యానికి, గిరిజనుల యొక్క సంస్కృతి సాంప్రదాయాలు నిలుపుకొనుటకు, ప్రజల యొక్క వ్యవసాయ వ్యాపార ఉద్యోగ అభివృద్ధికి.., లోక కళ్యాణర్థం.... గ్రామ దేవతలు... గ్రామాలుని సంరక్షిస్తుంటాయి. నేడు జీలుగుమిల్లి మండలం, పాత పండు వారి గూడెం గ్రామంలో... గ్రామ పెద్ద దేవుడమ్మ, మూక మామిడి స్వామిజీ ( పాల్వంచ)ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో గ్రామంలో నూతనంగా ప్రతిష్టించిన దేవాలయం నందు శ్రీశ్రీశ్రీ సమ్మక్క,సారలమ్మ, అంకాలమ్మ మరియు కనకదుర్గమ్మ తల్లి విగ్రహాల ప్రాణ ప్రతిష్ట మహోత్సవం, మహా పూర్ణాతి హోమం.. గిరిజన అర్చక పండితులచే... వేదమంత్రోచరణాలతో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలో గిరిజన మహిళలు దేవతలకి సారే, అన్న అభిషేకాలు... నూతన వస్త్రాలు సమర్పించి... దేవతలు యొక్క ఆశీస్సులు పొందినారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదుల జనార్ధన్, ఎంపీటీసీ సున్నం సురేష్, గ్రామ ఉపసర్పంచ్ సున్నం ఉషారాణి, పండు బాబురావు, కుంజా శ్రీరామ మూర్తి, ఊక దుర్గారావు, ఊక సూర్య చంద్రరావు, తెల్లం వెంకన్న బాబు, పండు రాజేంద్ర బాబు, కోర్స చిరంజీవి, కుంజా వెంకటేశ్వరరావు, రాచూరి ఏసుబాబు, బొంతు రామకృష్ణ ( ఎస్ ఎస్ ఎఫ్ ) మరియు గ్రామంలో గిరిజనులు చుట్టుపక్క గిరిజనులు పెద్దలు అందరూ పాల్గొన్నారు. గిరిజనులు విశేషంగా పాల్గొన్నారు.

## పాలకొల్లులో ఏకీకృత ఫ్యామిలీ సర్వే 100% పూర్తి

### ఎంపీడీవో ఉమామహేశ్వరరావు



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలంలో యూనిఫాడ్ ఫ్యామిలీ సర్వే( ఏకీకృత కుటుంబ సర్వే) నూటికి నూరు శాతం పూర్తయిందని పాలకొల్లు ఎంపీడీవో ఎన్ ఎన్ ఉమామహేశ్వరరావు తెలిపారు. మండలంలో 25,068 కుటుంబాలు ఉన్నాయని అందులో 23,0754 కుటుంబాలు సర్వే పూర్తి చేసినట్టు తెలిపారు. ఇంకా కొంతమంది మరణాలు, ఊరు బయటకు వెళ్లిపోయిన వారు ఉన్నారని వారిని తిరిగి పరిశీలించి మళ్లీ చేర్చడం జరుగుతుందని తెలిపారు.ఈ సర్వే వల్ల రాబోయే కాలంలో ఆయా కుటుంబానికి ప్రభుత్వ పథకాలు ఇంకా దేనికి అర్హులు దాన్నిబట్టి ప్రభుత్వ పథకాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా మండలంలోని ఇల్ల పన్నులు, కులాయి పనులు వసూళ్ల ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. పంచాయతీ అభివృద్ధి అధికారులు, సిబ్బంది పన్నుల వసూళ్ల పనుల్లో నిమగ్నం అయ్యారని తెలిపారు.ఇంత వరకు మండలంలో 80 శాతం వరకు పన్నులు వసూలు అయ్యాయని తెలిపారు. మిగిలిన 20% పన్నులు ఈనెల 20వ తేదీ లోగా వసూల్ చేయడం జరుగుతుందని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు వివరించారు.

### అఖిల భారత మహాసభ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా

## మహిళా విభాగం అధ్యక్షురాలుగా కోర్నాని దుర్గా నియామకం

- యాదవుల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా అందరం కలిసి పని చేద్దాం
- అఖిలభారత యాదవ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింకా నారాయణ




ఏలూరు.

యాదవుల అభివృద్ధి సంక్షేమానికి యాదవులు విద్యా వైద్యం సేవా రాజకీయ ఆర్థిక అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఉద్దేశంతోనే అఖిల భారత యాదవ మహాసభ కమిటీ పని చేస్తుందని అఖిల భారత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చింకా నారాయణ రావు అన్నారు. శుక్రవారం విజయవాడ సమీపంలోని కానూరులో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యాలయం నందు అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చింకా నారాయణరావు యాదవ్ చేతుల మీదుగా పశ్చిమ గోదావరి జిల్లా అఖిలభారత యాదవ మహాసభ జిల్లా మహిళా అధ్యక్షురాలుగా తణుకు గ్రామానికి చెందిన,యాదవ సంఘం సీనియర్ మహిళా నాయకురాలు కోర్నాని దుర్గ కి నియామక పత్రాన్ని నారాయణరావు అందజేశారు.ఈ కార్యక్రమంలో అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పెద్ది బోయిన శ్రీనివాస్ యాదవ్ రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ సూర్య యాదవ్ అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోకల రామకృష్ణ యాదవ్ పాల్గొనడం జరిగింది.

## డిగ్రీ కళాశాలలో స్టాల్స్ ఏర్పాటు

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం



రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా కళాశాల ఆవరణలో స్టాల్స్ ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకటప్ప నాయుడు (నాయుడు మాస్టారు) ఈ స్టాల్స్ ని ప్రారంభించారు. కళాశాల విద్యార్థినిలు రకరకాల స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయుడు మాస్టర్ మాట్లాడుతూ మీరందరూ భవిష్యత్తులో ఎంతో అభివృద్ధిని సాధించాలని, ప్రతి ఒక్కరిలో ఏదో ఒక నైపుణ్యం దాగి ఉంటుందని దాని వైపుగా మీ అడుగులు ముందుకు సాగి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యార్థిని చదువుతోపాటు ఎంటర్ పెన్యూర్ గా ఎదగడానికి కావలసిన స్కిల్స్ ను కూడా నేర్చుకోవాలని, భవిష్యత్తులో ఇది విద్యార్థులకుఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు అధిక సంఖ్యలో స్టాల్స్ ఏర్పాటు చేసి వారికి వచ్చిన స్కిల్స్ అన్నిటిని ప్రదర్శించారు. భవిష్యత్తులో భావి వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ఇదొక నాందిగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమం ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.వి.శోభారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు తమ ఇంటి వద్ద తయారు చేసిన వంటలు ,గాజులు, ఇతర వస్తువులుఈ స్టాల్స్ లో అమ్మడం జరిగింది. విజ్ఞానాన్ని పెంచే ఆటలు ఆడించారు.ఈ మహిళా దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు గత వారం రోజులుగా అనేక రకాల పోటీలు నిర్వహిస్తూ వారిలో ఉన్న నైపుణ్యాల నువెలికి తీయడంలో కళాశాల ఎప్పుడు ముందంజలో ఉంటుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

### నారాయణ ఒలింపియాడ్ పాఠశాలలో

## ఘనంగా 'స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్'

ప్రజా భూమి ప్రతినిధి-నిడదవోలు





స్థానిక రామ్ నగర్లోని నారాయణ ఒలింపియాడ్ పాఠశాలలో ప్రి ప్రైమరీ విద్యార్థుల ప్రతిభా పాటవాలను వెలికితీసేలా నిర్వహించిన స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ఎల్‌సి) కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా సాగింది. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి, తాము నేర్చుకున్న అంశాలను తల్లిదండ్రులకు వివరించడం ఈ కార్యక్రమం యొక్క ప్రత్యేకత.

**విద్యార్థుల ప్రదర్శన అమోఘం**

ఈ సందర్భంగా విద్యార్థులు అకడమిక్ అంశాలతో పాటు రీడింగ్, రైటింగ్ మరియు ప్రాజెక్ట్ వర్క్లను లైవ్ డెమోల ద్వారా తల్లిదండ్రులకు వివరించి మెప్పించారు. తమ పిల్లల్లో ఉన్న ఆత్మవిశ్వాసాన్ని చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

**ముఖ్య అతిథుల ప్రసంగం**

కార్యక్రమంలో పాల్గొన్న పశ్చిమగోదావరి జిల్లా నారాయణ విద్యాసంస్థల డి.జి.ఎం రామిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో విశ్లేషణాత్మక నైపుణ్యాలను పెంచడమే నారాయణ విద్యాసంస్థల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం,క్లస్టర్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు.

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని, ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని? ప్రిన్సిపాల్ ఆకుల రాంప్రసాద్ తెలిపారు.

ప్రి-ప్రైమరీ కో-ఆర్డినేటర్ రాణి ఆద్యంతం విద్యార్థుల ప్రాజెక్టులలో నిమగ్నమై పునాది స్థాయి నుండే పిల్లలకు ప్రయోగాత్మక విద్యను అందించడం వల్ల వారు భవిష్యత్తులో గొప్ప విజయాలు సాధిస్తారని అన్నారు.

**బహుమతుల ప్రదానం**

ఎస్.ఎల్.సి ప్రోగ్రాంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రి ప్రైమరీ వైస్ ప్రిన్సిపాల్ విజయకుమారి, ఉపాధ్యాయినులు గౌతమి, దివ్య, చంద్రవతి, శృతి, తేజశ్రీ,ఫణి, శ్యామల, పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆలమూరు జనార్ధనస్వామి వారికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం

-72 రోజులకు గాను రూ.1,13,175ల ఆదాయం.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

నవ జనార్ధన ఆలయాల్లో ప్రముఖమైన ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి వారి ఆలయానికి శుక్రవారం జరిగిన హుండీ లెక్కింపు ద్వారా రికార్డు స్థాయిలో ఆదాయం లభించింది. 72 రోజులకు గాను రూ.1,13,175ల హుండీ ఆదాయం రావడం విశేషం. శుక్రవారం మధ్యాహ్నం ఆలయ ఈవో నరేంద్రకుమార్, ఆలయ పాలకమండలి చైర్మన్ బైరిశెట్టి రాంబాబుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అంగర భగవానాచార్యులు ప్రత్యేక పూజలు చేసి హుండీని తెరిచారు. అనంతరం భక్తులు ఆదాయాన్ని లెక్కించారు. ఇందులో నోట్ల ద్వారా రూ.96,310లు, నాణెముల ద్వారా రూ.16,865లు లభించాయి.దేవాదాయ శాఖ నుంచి తనిఖీదారుగా రాపాక బాలాజీ వ్యవహరించారు. రికార్డు స్థాయిలో ఆదాయం లభించడం పట్ల ఈవో నరేంద్రకుమార్, పాలకమండలి చైర్మన్ బైరిశెట్టి రాంబాబులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు ద్విభాష్యం సత్యలక్ష్మి, చిన్నం సుబ్బలక్ష్మి, బొబ్బా రాంబాబు, అయినవిల్లి శ్రీనివాస్, కొప్పాడి జయబాబు, కట్టా శ్రీనివాస్, సబ్బవరపు రామాయమ్మ, దారా దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి కాలువలో నీటిమట్టం తగ్గడంతో చిన్న మోటార్ల ఏర్పాటు

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు



గోదావరి కాలువలో నీటిమట్టం తగ్గిపోవడంతో 150 హెచ్పీ మోటార్లు పనిచేయకపోవడంతో నగరానికి త్రాగునీటి సరఫరా నిలిచిపోకుండా 15 హెచ్పీ చిన్న మోటార్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ఆదేశించినట్లు కో-ఆప్షన్ సభ్యులు ఎస్.ఎం.ఆర్. పెదబాబు తెలిపారు.దెందులూరు సమీపంలోని గోదావరి జలాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించిన ఆయన, ప్రస్తుతం ఉన్న చిన్న మోటార్లతో పాటు మరో 10 మోటార్లు అత్యవసరంగా కొనుగోలు చేసి ట్యాంక్ను నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.వేసవికాలంలో నగర ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్నకు రూ.60 లక్షల విలువైన మకరతోరణం విరాళం



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో భక్తి వైభవం వెల్లివిరిసింది. తణుకు వాస్తవ్యులు పుణ్యమూర్తుల రామచంద్ర స్వామి, సావిత్రి దంపతులు ఆలయానికి సుమారు రూ.60 లక్షల విలువగల మకర తోరణాన్ని భక్తిశ్రద్ధలతో సమర్పించారు. సుమారు 350 గ్రాముల బంగారంతో ప్రత్యేకంగా తయారు చేయించిన ఈ మకర తోరణాన్ని భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావుకి అందజేశారు. తదుపరి ఆలయంలో నిర్వహించిన సంప్రోక్షణ కార్యక్రమం అనంతరం స్వామివారికి ఈ మకర తోరణాన్ని శాస్త్రోక్తంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు దాతలను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల విరాళాలతో ఆలయ అభివృద్ధి మరింత వేగంగా కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.

## పొడగట్లపల్లిలో పాడి రైతులకు జాతీయ కృత్రిమ గర్భధారణపై అవగాహన కార్యక్రమం



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ, కాకినాడ ఆధ్వర్యంలో జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమం, దూడల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె. మూర్తి పాడి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. సెక్స్ సాటెడ్ సెమెన్ వినియోగం ద్వారా మెరుగైన జాతి దూడలను పొందడంతో పాటు పాడి రైతులు అధిక ఆదాయం సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గంధం దేవి అన్నవరం, కె. సత్తిపండు, సకినాల గణపతి, అల్లూరి పెద్ద కృష్ణంరాజు, కొండపర్తి భూరయ్యతో పాటు అధిక సంఖ్యలో పాడి రైతులు పాల్గొన్నారు. రావులపాలెం ఏరియా ఆసుపత్రి సహాయ సంచాలకులు డాక్టర్ జానకిరావు, మండల పశు వైద్యాధికారి డాక్టర్ సోమేశ్వర రెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థకు చెందిన డాక్టర్ కళ్యాణి, పొడగట్లపల్లి జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ కె.వి. రామారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొని సేవలు అందించారు.

# ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

శనివారం 07 మార్చి 2025


## నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆర్ఎంపీ లపై చర్యలు తీసుకోవాలి సిపిఐ



ప్రజాభూమి ఎన్ పి కుంట

ఎటువంటి విద్యార్హతలు లేకుండా ఆర్ఎంపీ సర్టిఫికెట్లు పెట్టుకొని తెలిసీ తెలియని వైద్యం చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎంపీలపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సిపిఐ మండల కార్యదర్శి రాజారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సూర్యనారాయణ రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆర్ఎంపీల నిర్లక్ష్యానికి ఇంకా ఎంతమంది బలి కావాలని ప్రశ్నించారు. మండలంలో గత మూడు సంవత్సరాల్లో ఆర్ఎంపీల నిర్లక్ష్యానికి ఇద్దరు మృతి చెందగా, మరెంతో మంది తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాలు మీదకు తెచ్చుకున్నారని తెలిపారు. జనవరి నెలలో ఒక ఆర్ఎంపి నిర్లక్ష్యానికి ఒక వ్యక్తి చావుకు అంచుల వరకు వెళ్లి, బెంగళూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో సుమారు రూ.10 లక్షలు ఖర్చు చేసి ప్రాణాలతో బయటపడ్డాడని వివరించారు. కేవలం ప్రథమ చికిత్స మాత్రమే ఇవ్వాలనే నిబంధనలు ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంతో ఆర్ఎంపీలు ఇష్టారాజ్యంగా సూదిమందులు వేయడం, సెలైన్ బాటిళ్లు పెట్టడం వంటి చర్యలు చేపడుతూ ప్రజలను ఆర్థికంగా దోచుకోవడమే కాకుండా వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు మాత్రమే అధికారులు హడావిడి చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప కఠిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. నిబంధనలను ఉల్లంఘించి వైద్యం చేస్తున్న ఆర్ఎంపీలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేదంటే ప్రజా సంఘాలతో కలిసి మండలంలో తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## మెగాజాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలి

### -విస్తృత ప్రచారానికి ఐటీడీపీ నాయకుల శ్రీకారం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నేతృత్వంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ఈనెల 15వ తేదీన హిందూపురం పట్టణంలోని సప్తగిరి కళాశాలలో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జాబ్ మేళాను పెద్ద ఎత్తున విజయవంతం చేసేందుకు ఐటిడీపీ నాయకులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని వివిధ డిగ్రీ కళాశాలలో కరపత్రాలను పంపిణీ చేస్తూ జాబ్ మేళాకు అభ్యర్థులను నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, బాల యేసు, బాలాజీ విద్యా విహార్, సప్తగిరి కళాశాలలో కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఐటీడీపీ నాయకులు మాట్లాడుతూ, స్థానికంగానే కాకుండా శ్రీ సత్యసాయి జిల్లా నలుమూలల నుండి నిరుద్యోగ యువతీ, యువతులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. 90కి పైగా కంపెనీలు వస్తున్నాయని, అదే విధంగా 5000 కి పైగా ఉద్యోగ నియామకాలు జరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ పార్లమెంట్ అధ్యకులు రామాంజనేయులు, సర్పంచ్ మంజునాథ్, ఐటీడీపీ పట్టణ అధ్యక్షులు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి సురేష్, నాలుగవ వార్డుఇంచార్జి అశోక్, నవీన్ కుమార్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా పరిశీలకుడిగా ఫయాజ్ భాషా



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా పరిశీలకుడిగా ఫయాజ్ భాష. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుండి నియామక ఉత్తర్వులను జారీ చేసినట్లు నియోజకవర్గ సమన్వయకర్త దీపిక వేణు రెడ్డి తెలిపారు. అదేవిధంగా హిందూపురం నియోజకవర్గానికి చెందిన వైకాపా రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతి రెడ్డి పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకురాలిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుండి నియామక ఉత్తర్వులు విడుదలయ్యాయి. వీరి నియామకం పట్ల దీపికా వేణు రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## మామిడి తోటకు నిప్పు

### -పది ఎకరాల్లో చెట్టు దగ్ధం

### -కన్నీరుమున్నీరవుతున్న రైతు నారాయణమ్మ

### -రూ.5 లక్షల నష్టం అంచనా



ప్రజాభూమి, హిందూపురం టౌన్

పంట చేతికందే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చేసిన దుశ్చర్య ఒక నిరుపేద రైతు కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. హిందూపురం రూరల్ మండలం బాలంపల్లి గ్రామానికి చెందిన రైతు నారాయణమ్మకు చలివెందల పొలం పరిధిలో ఉన్న 10 ఎకరాల మామిడి తోటకు శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అగ్నికి ఆహుతయింది. నారాయణమ్మ తనకున్న 10 ఎకరాల పొలంలో ఎంతో కష్టపడి మామిడి తోటను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం మామిడి సీజన్ ప్రారంభమై పంట



ఆశాజనకంగా ఉన్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తోటకు నిప్పు పెట్టినట్లు సమాచారం. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పాటు తోటలో ఉన్న ఎండుగడ్డి కారణంగా మంటలు క్షణాల్లో వ్యాపించి మొత్తం తోటను చుట్టుముట్టాయి. దీంతో కోతకు వచ్చిన మామిడి చెట్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ అగ్నిప్రమాదం వల్ల సుమారు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితురాలు నారాయణమ్మ వాపోతున్నారు. ఏడాది పొడవునా చేసిన కష్టం, పెట్టిన పెట్టుబడి అంతా కళ్ల ముందే బూడిదవ్వడంతో ఆమె కన్నీరుమున్నీరవుతున్నారు. అప్పులు చేసి తోటను సాగు చేశాను, ఇప్పుడు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన విషయం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే భారీ నష్టం జరిగిపోయింది. అగ్నిమాపక శాఖకు సమాచారం అందించినప్పటికీ ట్యాంకర్లలో నీరు లేకపోవడంతో వెంటనే రావడం సాధ్యం కాదని చెప్పారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితురాలు విజ్ఞప్తి చేస్తుంది. అదే విధంగా ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# అనంతపురంలో పోలీస్ ఓపెన్ హౌస్ కార్యక్రమం

- జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు ఓపెన్ హౌస్ నిర్వహించి, పోలీసులు వినియోగించే ఆయుధాలు, సాధనాలపై విద్యార్థులకు అవగాహన
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలలో భాగంగా చేపట్టిన ఈకార్యక్రమానికి విద్యార్థుల నుండీ మంచి స్పందన



ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని షాదీఖానాలో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగరంలోని పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పోలీస్ శాఖ తమ దైనందిన విధుల్లో ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు, రక్షణ పరికరాలు, సాంకేతిక సాధనాలు ప్రదర్శనలో ఉంచారు. ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా ఆధ్వర్యంలో శిక్షణ పొందిన పోలీస్ సిబ్బంది ప్రతి ఆయుధం యొక్క వినియోగం, పని విధానం, భద్రతా నియమాలు గురించి విద్యార్థులకు సందర్శకులకు వివరంగా తెలియజేశారు. పోలీసులు తమ విధుల్లో వినియోగించే ఆయుధాలు, సాధనాలు మరియు సాంకేతిక పరికరాల గురించి విద్యార్థి దశ నుండే అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ సందర్భంలో ఏ ఆయుధాన్ని వినియోగిస్తారు, వాటి ప్రత్యేకతలు ఏమిటి అనే విషయాలను కూడా వివరించారు. ప్రదర్శనలో .22 రైఫిల్, .410 మస్కెట్, .303 రైఫిల్, 7.62 ఎం.ఎం ఎస్.ఎల్.ఆర్, ఏకే-47, 5.56 ఎం.ఎం ఇన్సాస్ రైఫిల్, 9 ఎం.ఎం కార్బైన్, .38 రివాల్వర్, 9 ఎం.ఎం పిస్టల్, 9 ఎం.ఎం గ్లాక్, వి.ఎల్ పిస్టల్, 12 బోర్ పంప్ యాక్షన్ గన్, ఎల్.ఎం.జి, 51 ఎం.ఎం మోర్టార్, హెచ్.ఇ 36 గ్రనేడ్, యాంటీ రయట్ గన్స్, గ్యాస్ గన్ వంటి ఆయుధాలతో పాటు బాడీ ప్రొటెక్టర్లు, ఫైబర్ లాఠీలు, హెల్మెట్లు, స్టోన్ గార్డులు, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు (హెవీ, మీడియం, లైట్) వంటి రక్షణ పరికరాలు కూడా ప్రదర్శించారు. అదేవిధంగా డే నైట్ విజన్ బైనాక్యులర్లు, జి.పి.ఎస్ పరికరాలు, మెగాఫోన్లు, లెటర్ బాంబ్ డిటెక్టర్లు, డీఎస్ఎమ్‌డీ, హెచ్‌హెచ్ఎమ్‌డీ, ఎన్ఎల్‌జెడీ, నార్కో డిటెక్షన్ కిట్లు, బాంబ్ బ్లాంకెట్లు, బాంబ్ షీల్డ్‌లు, ఎక్స్‌ప్లోసివ్ డిటెక్టర్లు, యూవీ లైట్లు, క్లూస్ టీం ఉపయోగించే ఫుట్ ప్రింట్ లిఫ్టర్లు వంటి ఫోరెన్సిక్ పరికరాలను కూడా ప్రదర్శించారు. ఆధునిక సాంకేతిక పరికరాలుగా టెథర్డ్ డ్రోన్‌లు, డ్రోన్ కెమెరాలు, బాడీ వోర్న్ కెమెరాలు, నెట్‌వర్క్ కెమెరాలు, సిమ్ బేస్డ్ కెమెరాలు, ఫిన్స్ (ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ నెట్‌వర్క్ సిస్టమ్), డీఎఫ్ఐడీ వంటి డిజిటల్ పరికరాలు కూడా విద్యార్థులకు చూపించారు. పోలీస్ డాగ్ స్క్వాడ్‌ను కూడా ప్రదర్శనలో ఉంచి వాటి పనితీరును వివరించారు. అంతేకాకుండా సైబర్ సురక్ష వాహనంపై వివిధ రకాల సైబర్ నేరాలు, వాటి దుష్ప్రభావాలు, సైబర్ నేరాల అడ్డుకట్ట కోసం ఎలాంటి జాగ్రత్తలు చేపట్టాలో వీడియోలు చూపించారు. మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ వినియోగం, శక్తి బృందాల సేవలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి, ఆర్.ఐ పవన్ కుమార్, మహిళా విభాగం సి.ఐ వెంకటేశ్వర్లు, నగరంలోని పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



# అంతరాష్ట్ర ఒలింపియాడ్ పరీక్షలో పాంచజన్య విద్యార్థుల ప్రతిభ -అభినందించిన యాజమాన్యం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

అంతరాష్ట్ర ఒలింపియాడ్ పరీక్షలో పాంచజన్య బ్రిలియంట్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షులు పీఎస్ శ్రీనివాసులు తెలిపారు. 2026 సైంటిఫిక్ యాటిట్యూడ్ టెస్ట్ లో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యం ఆధ్వర్యంలో జనవరి 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా సైంటిఫిక్ యాటిట్యూడ్ టెస్టు 3వ తరగతి నుండి 9వ తరగతి వరకు 125 పాఠశాలలు, 15000 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. ఇందులో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు 9 మంది రాష్ట్రస్థాయిలో మూడు లోపు ర్యాంకులు సాధించి ఎవరు ఇంతవరకు సాధించని స్థాయిలో చెక్కుచెదరని రికార్డును సాధించినారని, ఇన్ని ర్యాంకులు సాధించడానికి ప్రధాన కారణం మా పాఠశాలలో ప్రత్యేకించి పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడమేనని పేర్కొన్నారు. ప్రతిరోజూ పాఠ్యాంశాలతో పాటుగా పోటీ పరీక్షలను ఎలా రాయాలో ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తూ ఉంటారని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఎంతో సహకరిస్తూ ఉంటారన్నారు. నిరంతర శ్రమ, సమయపాలన, అకుంఠిత దీక్ష, పట్టుదలగా చదవడం, యాజమాన్యం విద్యార్థులకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణ అని తెలియజేస్తూ ర్యాంకు సాధించిన విద్యార్థులను హృదయపూర్వకంగా అభినందిస్తూ, ఈ పరీక్ష ను ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించిన ఉపాధ్యాయురాలు సుగుణను ప్రశంసించారు. సుప్రియ 4వ తరగతి మొదటి ర్యాంకు, బషీర్ 4వ తరగతి మూడవ ర్యాంకు, సాయి కృష్ణ 5వ తరగతి రెండవ ర్యాంకు, ఫైజా హర్మేన్ 5వ తరగతి రెండవ ర్యాంకు, ప్రత్యూష 5వ తరగతి రెండవ ర్యాంకు, ఫైజా అంజూమ్ 6వ తరగతి మూడవ ర్యాంకు, హర్షిత 7వ తరగతి మూడవ ర్యాంకు, హాదియా హర్మెయిన్ మూడవ ర్యాంకు, అర్హా 9వ తరగతి మూడవ ర్యాంకు సాధించినట్లు వివరించారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నంద కుమార్, ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, పరిపాలన అధికారి, భాస్కర్ గారు, సూపరింటెండెంట్ విజయేంద్ర, సహ ప్రధానోపాధ్యాయులు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు చర్యలు

- కేంద్ర ప్రభుత్వ పథకాలను జిల్లాలో సజావుగా అమలు చేయాలి ఎంపీ అంబికా
- జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్






ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురం

జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను జిల్లాలో సజావుగా, మరింత బాగా అమలు చేయాలని పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలోని డిపిఆర్సీ సమావేశ మందిరంలో దిశా (జిల్లా అభివృద్ధి సమన్వయ – పర్యవేక్షణ కమిటీ) సమావేశాన్ని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించగా, జడ్పి చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జెడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఆయా శాఖల జిల్లా అధికారులు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు అంబికా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే పథకాల అమలుకు సంబంధించి నిధుల అంశంపై, పనితీరు మెరుగుపరచడంపై సమీక్ష నిర్వహించామన్నారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్ష చేసి, ఇంకా ఏమైనా ప్రభావవంతంగా అమలు చేయడానికి సూచనలను తీసుకుని మెరుగైన సేవలను ప్రజలకు అందించే దిశలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాను అభివృద్ధిలో రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలపాలన్నారు. తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమావేశం నిర్వహించడం జరిగిందని, ఇందులో జిల్లా పనితీరు బాగుందని, జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని సీఎం తెలిపారన్నారు. జిల్లా కలెక్టర్ వేగవంతంగా పని చేస్తున్నారని, ఆదర్శవంతంగా జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. మన్ కి బాత్ లో కూడా దేశ ప్రధాని జిల్లా రైతులు, శ్రమజీవుల గురించి మాట్లాడి అభినందించారన్నారు. అన్ని కేంద్ర పథకాల అమలులో పూర్తిస్థాయిలో పనిచేయాలన్నారు. సాయిల్ టెస్టింగ్ ల్యాబ్స్ పనిచేసేలా చూడాలన్నారు. అనంతపురం రూరల్ లోని నారాయణపురంలో ఉపాధి పనులకు సంబంధించిన మస్టర్ ఓపెన్ కావడం లేదని, నిర్దేశిత సమయంలోగా సమస్య పరిష్కరించాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి గడువులోపు పూర్తిచేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. హార్టికల్చర్, ఫామ్ మెకనైజేషన్, డ్వామా, పిఎంకెఎస్వై, నేషనల్ హెల్త్ మిషన్, అంబేద్కర్ గురుకులం, మైనారిటీ వెల్ఫేర్, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జడ్పి చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ జిల్లాలో మాతా శిశు మరణాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీలు ఎక్కువగా ఉన్నాయని, వాటి నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై పాఠశాలల్లో అవగాహన కల్పించాలన్నారు. 108 వాహనాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, కొన్ని పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగా లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద చేస్తున్న పనులు పూర్తికి మరికొంత సమయం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ దిశా సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. బెలుగుప్ప మండలం ఆవులన్న సొసైటీని తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిసిఓని ఆదేశించారు. జిల్లాలో మైక్రో ఇరిగేషన్, హార్టికల్చర్ అభివృద్ధి, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. పిఎండి డికేవై కింద కార్యచరణ ప్రణాళిక పంపించాలన్నారు. మైక్రో ఇరిగేషన్ కింద మరింత విస్తీర్ణం పెంచేలా ప్రణాళిక తయారు చేశామన్నారు. ఆత్మ పరిధిలో అగ్రిటెక్ స్టార్టప్ లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద జిల్లాలో చేపట్టిన పనులన్నీ పూర్తి చేయాలని, నెలాఖరు నాటికి పనులు అయినంతవరకు బిల్లులు అప్లోడ్ చేసి వాటిని పూర్తి చేయాలని, ఇందులో ఏవైనా సమస్యలు ఉంటే డ్వామా పీడీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం అర్హత ఉంటే గ్రామాల్లో పిహెచ్సి ఏర్పాటుకు అవకాశం ఉంటే సంబంధిత అధికారులు తెలియజేయాలన్నారు. 108 వాహనాలు రావడం ఆలస్యం అవుతోందని పలు ఫిర్యాదులు వస్తున్నాయని, సమయానికి వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని, పూర్తి వివరాలతో సమావేశానికి రావాలని 108 జిల్లా కోఆర్డినేటర్ ని ఆదేశించారు. అనంతరం రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహ విముక్తి రథంపై సంతకాల సేకరణలో భాగంగా ఎంపీ, జిల్లా కలెక్టర్, ఆయా శాఖల జిల్లా అధికారులు సంతకాలు చేశారు. బాల్య వివాహ రహిత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో సిపిఓ అశోక్ కుమార్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, డిపిఓ నాగరాజునాయుడు, డ్వామా పిడి సలీమ్ భాష, పంచాయతీరాజ్ ఎస్ఈ సుబ్బరాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి రవి, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, ఎపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, డిసిఓ అరుణకుమారి, హౌసింగ్ పిడి శైలజ, ఐసీడీఎస్ పిడి శ్రీదేవి, డిఆర్డీఏ పిడి శైలజ, మైన్స్ డిడి ఆదినారాయణ, నాబార్డు ఏజీఎం అనురాధ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసరావు, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బూ కొఠారి, మెప్మా పిడి విశ్వజ్యోతి, ఎస్సి కార్పొరేషన్ ఈడి కుముద, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.మల్లీశ్వరి, డిసిఓ అరుణకుమారి, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీలక్ష్మి, సివిల్ సప్లయిస్ డిఎం రమేష్ రెడ్డి, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, కమిటీ మెంబర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆటో నగర్ లో అభివృద్ధి పనులకు భూమిపూజ



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలోని ఆటో నగర్ లో శుక్రవారం నూతన రహదారులు, మురికి కాలువల నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర బాలాజీ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హిందూపురం అభివృద్ధి కోసం ఇటీవల విడుదలైన రూ.92.50 కోట్లలో రూ.2కోట్లతో ఆటోనగర్ లో రహదారులు, మురికి కాలువలను ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి వార్డులలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఇక నుండి తొలగిపోతాయని తెలిపారు. శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ హిందూపురం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ నిధులతో హిందూపురం రూపురేఖలు మారి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తారని, రాష్ట్రంలోనే హిందూపురం అభివృద్ధిలో ముందంజు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రహమత్ బీ, సునీత, మాజీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ జే.వి.ఎస్. అనిల్ కుమార్, టీడీపీ నాయకులు వెంకటేష్ రెడ్డి, ఆదిల్, ముస్తఫా, ఫాజిల్, జబీవుల్లా, మహబూబ్ బాషా, మున్సిపల్ డిఈఈ. వాణి, ఏ.ఈ. రాజేంద్ర, సచివాలయం సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# జనాభా పెరుగుదలపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు విడ్డూరం హాస్యాస్పదం - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



ప్రజా భూమి, కడప సిటీ:
రాష్ట్రంలో జనాభా పెరగాలి. ఇది అత్యంత ఆవశ్యకం. జనాభా పెరుగుదల భారం కాదు. జనాభా సంపద అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదం, విడ్డూరం అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచంలో 242 దేశాలు ఉన్నాయని, ప్రపంచ జనాభా 809 కోట్లని,అందులో భారతదేశం జనాభా 147 కోట్లని తులసి రెడ్డి అన్నారు. ఇప్పటికే జనాభాలో చైనాను కూడా దాటి భారతదేశము ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంది మొదటి స్థానంలో ఉన్న భారతదేశపు జనాభా 147 కోట్లు కాగా,రెండవ స్థానంలో ఉన్న చైనా జనాభా 142 కోట్లు కాగా,మూడవ స్థానంలో ఉన్న అమెరికా జనాభా కేవలం 34 కోట్లు మాత్రమే అని తులసి రెడ్డి వివరించారు.ప్రపంచ భూ విస్తీర్ణంలో భారత దేశపు విస్తీర్ణత 2.4% కాగా, ప్రపంచ జనాభాలో భారతదేశపు జనాభా 18 శాతం అన్నారు. ప్రపంచ సగటు జనసాంద్రత చదరపు కిలోమీటర్ కు 55 మంది కాగా, భారత్ లో 488 8అన్నారు. చైనా జనసాంద్రత 151 కాగా, అమెరికా జనసాంద్రత 38 రష్యా జనసాంద్రత 9 అని తులసి రెడ్డి వివరించారు. ఇప్పుడు ఉన్న వారికే కనీస సౌకర్యాలు కల్పించలేకపోతున్నాం.ఉపాధి,ఉద్యోగాలు దొరకడం లేదు. యువత మద్యానికి,డ్రగ్స్ కు, గంజాయి కి బానిసలై అసాంఘిక శక్తులుగా మారుతున్నారు . దేశంలో నిరుద్యోగం విలయ తాండవం చేస్తోంది.ప్రపంచంలో భారతదేశం తలసరి ఆదాయంలో 144 స్థానంలో, ఆకలి సూచికలో 101 వ స్థానంలో, సంతోష సూచికలో 144 స్థానంలో ఉన్నాం. ప్రపంచవ్యాప్తంగా లోకల్,నాన్ లోకల్ అనే భావన రోజు రోజుకు పెరుగుతా ఉంది. ఈ నేపథ్యంలో విదేశాలలో, దేశంలో ఇతర రాష్ట్రాలలో ఉద్యోగాలు ఉ పాధి పొందిన మన యువత తిరిగి రాష్ట్రానికి రావలసిన పరిస్థితి ఉంది. ఉన్న వారికే ఉద్యోగాలు, ఉపాధి కల్పించలేకపోతున్నాం.ఈ నేపథ్యంలో విదేశాల నుంచి, వివిధ రాష్ట్రాల నుంచి మన రాష్ట్రానికి తిరిగి వచ్చే వారికి ఎలా ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తాం అని తులసి రెడ్డి ప్రశ్నించారు.పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు ఉంది ముఖ్యమంత్రి గారి ఆలోచనా ధోరణి అని తులసి రెడ్డి ధ్వజమెత్తారు. జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ తదితర దేశాలను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారు . ఈ పోలిక సమంజసం కాదు. ఇవి అభివృద్ధి చెందిన దేశాలు.తలసరి ఆదాయం మనకంటే అనేక రెట్లు ఎక్కువ.జనాభా తక్కువ.జన సాంద్రత తక్కువ.జపాన్ తలసరి ఆదాయం 34 713 డాలర్లు కాగా భారత్ తలసరి ఆదాయం 28 18 డాలర్లు మాత్రమే. జనాభా పెరుగుదలకు ఇది సరియయిన సమయం కాదు.ముఖ్యమంత్రి పునరాలోచించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# దోమలు బాబోయ్ దోమలు నివారణ చర్యలు ఎక్కడ? సిపిఐ

## విపరీతమైన దోమల వలన అంటువ్యాధులతో అల్లాడుతున్న ప్రజలు సిపిఐ ఆగ్రహం



ప్రజాభూమి పోరుమామిళ్ల :
పోరుమామిళ్ల పట్టణంలో రంగసముద్రం, పోరుమామిళ్ల పంచాయతీలతో పాటు మండలంలో ఏ గ్రామంలోనైనా విపరీతమైన దోమల ఎక్కువై వాటి వలన, రకరకాల అంటువ్యాధులతో ప్రజలు అల్లాడుతున్నారని సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, పంచాయతీ అధికారులపై ఆగ్రహం చెందారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ పోరుమామిళ్ల మండలంలో, పట్టణంలో రోడ్డుపైన ఐదు గంటలు దాటితే ఒక్క నిమిషం ప్రజలు నిలబడిన,దోమలతో సంగీతం,పందులతో సహజీవనం అన్న రీతిలో దోమలు ఎక్కువయ్యాయి వాటి వలన ప్రతి ఇంటిలో జ్వరము, దగ్గు,జలుబు, వైరల్ ఫీవర్, రక్త కణాలు తగ్గడం, పరుగు, పరుగుమని దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి పట్టణంలో ప్రజలు ఇబ్బంది పడుతుంటే దానికి అదునుగా ప్రైవేట్ హాస్పటల్లో టెస్టుల పేరుతో పేషెంట్ ను నిలువు దోపిడీ చేసి, మూడు నాలుగు రోజులు తిప్పుకుంటే గాని జ్వరాలు తగ్గలేని పరిస్థితి, ఈ విధంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మండల అభివృద్ధి అధికారి, ఏవో రమణయ్యకు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో విన్నత పత్రం అందించడం జరిగింది. ఈ సమస్యలపై పంచాయతీ అధికారులు ఎందుకు నివారణ చర్యలు చేపట్టలేకపోతున్నారు అర్థం కాని పరిస్థితి. అధికారులు ఉండడం బాధాకరం అలాగే గ్రామాల్లో మా పెద్దలు బర్రె లకు జోరీగలు పట్టాయి పొగ పెట్టండి అని చెప్పేవాళ్ళు ఆ విధంగా ప్రజలపై ఐదు నిమిషాలు కూడా సాయంత్రం సమయంలో రోడ్డుపైన ఎక్కడ కూడా నిలబడలేని పరిస్థితి అందువలన వెంటనే ప్రజల కోసం పనిచేసే పంచాయతీ అధికారులు ఇంటి పన్నులు రాబట్టుకునే శ్రద్ధ ప్రజల అవసరాలు తీర్చడంలో నిర్లక్ష్యం వహించడం సిగ్గుచేటు అన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో దోమలపై చర్యలు తీసుకోవాలి, ప్రత్యేకంగా పోరుమామిళ్ల పట్టణంలో ప్రతి వీధిలో రెండు పంచాయతీ అధికారులు వెంటనే దోమలపై, ఫాగింగ్, స్ప్రేయింగ్, చేయాలని వారు కోరారు లేనిపక్షంలో వీధులలో పన్నులు ఏ విధంగా రాబడతారని వారు అధికారులపై ఆగ్రహం చెందారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కోడూరు కేశవ, సఫా, వెంగయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ నగర్‌లో 'డ్రై డే - ఫ్రై డే' కార్యక్రమం నిర్వహించిన ఆరోగ్య శాఖ అధికారులు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని గాంధీ నగర్‌లో పొన్నవోలు కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 'డ్రై డే - ఫ్రై డే' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారిణి పి. రంగ లక్ష్మి, సబ్ యూనిట్ ఆఫీసర్ ఇండ్ల సుబ్బరాయుడు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. దోమల నియంత్రణ: ప్రతి శుక్రవారం ఇళ్లలోని నీటి తొట్టెలు, డ్రమ్ములను శుభ్రం చేసుకోవడం ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులను అరికట్టవచ్చని సుబ్బరాయుడు తెలిపారు. ఎండలు పెరుగుతున్న దృష్ట్యా గర్భిణులు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలని, వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్, మజ్జిగ వంటి ద్రవపదార్థాలు తీసుకోవాలని డాక్టర్ రంగ లక్ష్మి సూచించారు.14 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించాలని అవగాహన కల్పించారు.104 వాహనం ద్వారా గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, సలహాలు అందించారు.

# మాతమ్మ గుడి కూల్చివేతపై దళిత మహిళల ఆగ్రహం

## పునర్నిర్మించకపోతే ఆందోళన తప్పదని హెచ్చరిక!



ప్రజభూని, సిద్ధవటం:
రహదారి విస్తరణ పనుల సాకుతో దళితుల ఆరాధ్య దైవమైన మాతమ్మ గుడిని కూల్చివేయడంపై వైఎస్ఆర్ జిల్లా సిద్ధవటం మండలం మాధవరం-1 పంచాయతీ లక్ష్మీపురంలో ఉద్రిక్తత నెలకొంది. గత కొన్ని రోజులుగా జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా 30 ఏళ్ల నాటి పురాతన ఆలయాన్ని చెట్లు తొలగింపు పేరుతో నేలమట్టం చేశారు. రహదారిలో ఉన్న చెట్లను తొలగించే క్రమంలో మాతమ్మ గుడిని కూడా తొలగించారు. ఇది తమ ఆరాధ్య దైవమని, దళితుల మనోభావాల ను దెబ్బతీశారని స్థానిక మహిళలు మండిప డుతున్నారు. ఆలయం తొలగించిన సమయంలో స్థానికులు అడ్డుకోగా, "పొరపాటు జరిగింది.. సొంత ఖర్చులతో ఆలయాన్ని మళ్ళీ కట్టిస్తాం" అని హామీ ఇచ్చిన పనుల నిర్వాహకులు, ప్రస్తుతం ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదని సుబ్బ లక్ష్మమ్మ, మస్తానమ్మ అనే స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాభివృద్ధి జరుగుతున్నా, కొందరు కావాలనే ఆలయాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ధ్వజమెత్తారు. వెంటనే ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని దీని వెనకాల ఉన్న వ్యక్తులను వదిలిపెట్టమని బాధితులు హెచ్చరించారు.

# పట్రా నాయుళ్ళ కళ్యాణ మండపం ప్రారంభోత్సవానికి ప్రతి ఒక్క పట్రా కులస్తులు పాల్గొని విజయవంతం చేయాలి

## - రాష్ట్రఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా సునీల్ కుమార్

## - బ్రహ్మంగారి మఠం లో అత్యంత అద్భుతంగా పట్రా నాయుళ్ళ కళ్యాణ మండపం



ప్రజాభూమి, వేముల
ఆంధ్రప్రదేశ్ లో ఉండే పట్రా కులస్తులు ఏ కాకుండా దేశం లోని వివిధ ప్రాంతాల్లో వివిధ రాష్ట్రాల్లో ఉన్నటువంటి ప్రతి ఒక్క పట్రా కులస్తులు పాల్గొని ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం ను విజయవంతం చేయాలి అని ఆంధ్ర ప్రదేశ్ పట్రా ప్రగతి మరియు సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ,వేముల ఎంపీపీ కుమారుడు చల్లా సునీల్ మాట్లాడుతూ పట్రా కులస్తులు చేయి చేయి కలిసి ప్రతి ఒక్కరూ ఆర్థిక సహాయం తో దాదాపు 4 కోట్ల రూపాయలు వెచ్చించి వైఎస్ఆర్ కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గం బ్రహ్మంగారి మఠం లో పట్రా కులస్తులు ఆధ్వర్యం లో నిర్మించి ఈ నెల 8 వ తేదీ అనగా (రేపు..ఆదివారం) అశేష పట్రా కులస్థుల ఆధ్వర్యం లో పెద్ద ఎత్తున ప్రారంభిస్తున్న పట్రా నాయుళ్ళ కళ్యాణ మండపం మరియు పట్రా ప్రగతి భవనం అన్నదాన సదనం ప్రారంభోత్సవానికి ప్రతి ఒక్క కులస్తులు పాల్గొని విజయవంతం చేయాలి అని తెలిపారు. బ్రహ్మం గారి మఠం లోనే కనివిని ఎరుగని స్థాయిలో కళ్యాణ మండపం ను అత్యంత అద్భుతంగా సుందరంగా నిర్మాణం చేపట్టడం జరిగిందిఅంతే కాకుండా బ్రహ్మం గారి మఠం లో అత్యంత విశాలవంతమ మండపం,సౌకర్యవంతమైన త్రాగునీటి సదుపాయం ఈ కళ్యాణ మండపం ప్రత్యేకం అని అన్నారు.ఈ కళ్యాణ మండపం ప్రారంభోత్సవానికి 1 రూపాయి నుంచి 5 లక్షల నుంచి ఇంకా ఎక్కువ సహాయ సహకారం అందించిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ఆహ్వానం పలుకుతున్నాం అని ఎందుకంటే వారి సహాయ సహకారంతో నే ఇంతటి మహోన్నత కార్యక్రమం ను విజయవంతంగా పూర్తి చేయడం జరిగింది అని అన్నారు ఉన్నటువంటి ప్రతి ఒక్క పట్రా కులస్తులు పాల్గొని ఈ ప్రారంభోత్రృతి ఒక్కరూ పాల్గొనాలి అని ఆంధ్ర ప్రదేశ్ పట్రా ప్రగతి మరియు సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వేముల ఎంపీపీ కుమారుడు చల్లా సునీల్ కుమార్ కోరారు.

# శ్రీ చైతన్య హైస్కూల్ లో ఘనంగా క్రీడా దినోత్సవం

## - వివిధ క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

## పాఠశాల చైర్మన్ బి.చక్రపాణి రెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె
స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య హైస్కూల్ లో ఎంతో ఉత్సాహంగా, క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల చైర్మన్ బి.చక్రపాణి రెడ్డి తెలిపారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పరుగుపందెం సహా పలు క్రీడా పోటీల్లో పోటీ పడుతూ అందరినీ ఆకట్టుకున్నారు. శుక్రవారం వార్షిక క్రీడా దినోత్సవ కార్యక్రమాలను ప్రారంభించగా, రానున్న నాలుగు నుండి ఐదు రోజులు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించబడతాయని అన్నారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బి.చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ "నిత్యం సాధన చేస్తే అసాధ్యం కూడా సాధ్యమవుతుంది" అని విద్యార్థులను ప్రోత్సహించారు. క్రీడలు ఆడేటప్పుడు క్రమశిక్షణతో పాటు జట్టు భావనతో ఆడాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం శాంతి, స్వేచ్ఛ, ఐక్యతకు ప్రతీకగా పావురాన్ని ఆకాశంలోకి ఎగురవేసి అది శాంతి, స్వేచ్ఛ మరియు ఐక్యతకు చిహ్నమని తెలియజేశారు.పాఠశాల డైరెక్టర్లు బి.చేతన్ రెడ్డి, బి.చైతన్య రెడ్డి లు మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనూ, క్రీడలలోనూ ప్రతిభ కనబరచి పాఠశాల ప్రతిష్ఠను మరింత పెంచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# మారిన ప్రభుత్వాలు.. మారని తలరాతలు

## జంగాలపల్లి ఎస్సీ కాలనీలో పేరుకుపోయిన అపరిశుభ్రత



ప్రజాభూమి, సిద్దవటం: ప్రభుత్వాలు మారినా తమ సమస్యలు మాత్రం తీరడం లేదని జంగాలపల్లి ఎస్సీ కాలనీ నివాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని అంగన్‌వాడీ స్కూల్ పక్కన, త్రాగునీటి ట్యాంక్ వద్ద చెత్తాచెదారం పేరుకు పోయి తీవ్ర దుర్వాసన వస్తోందని వారు వాపోతున్నారు. అపరిశుభ్రత కారణంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, తక్షణమే అధికారులు స్పందించి గ్రామాన్ని శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీవో మెహతాబ్ యాస్మిన్ స్పందిస్తూ.. కాలనీలో పేరుకుపోయిన అపరిశుభ్రతను తక్షణమే తొలగించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# వైసిపి గురు మోహన్కు ఘన సన్మానం

## కడప మేయర్ పాక సురేష్ కుమార్



ప్రజాభూమి, కడప సిటీ:
కడప నగర పాలక సంస్థ మేయర్ చాంబర్ నందు వైఎస్ఆర్సిపి కడప నియోజక వర్గ అసెంబ్లీ పరిశీలకులుగా నియమితులైన గురు మోహన్ని కడప నగర మేయర్ పాక సురేష్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకా ర్యక్రమంలో వైఎస్ఆర్సీపీ కా ర్పొరేటర్లు బాలస్వామి రెడ్డి,కె బాబు,15వ డివిజన్ ఇంచార్జి విష్ణు వర్ధన్ రెడ్డి,నార్త్ జోన్ అ బ్జర్వర్ పవర్ అల్తాఫ్,2వ డివి జన్ నాయకులు సుబ్బారెడ్డి, రామకృష్ణ,రాష్ట్ర మైనార్టీ కా కార్యదర్శి మున్నాతదితరులు పాల్గొన్నారు.

# బ్లాక్ బెల్ట్ సాధించిన క్రీడా కారులను అభినందించిన ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి



ప్రజాభూమి పోరుమామిళ్ల :
విజయనగరం నందు ఇటీవల నిర్వహించిన తైక్వాండో బ్లాక్ బెల్ట్ పరీక్షలలో వైఎస్సార్ కడప జిల్లా లోని పోరుమామిళ్ల ప్రాంతానికి చెందిన బాలుర విభాగంలో శ్రీనిజ్, గౌస్లాజం, నాగూర్, మిథీల్ కుమార్ రెడ్డి, ఆసిఫ్, జాఫర్, సఫాన్ మరియు బాలికల విభాగంలో తశ్వీక, రాజనాల లక్కీ తైక్వాండో క్రీడాకారులు ప్రతిభ కనబరిచి విజయవంతంగా బ్లాక్ బెల్ట్ అర్హతను సాధించారు. కఠినమైన శిక్షణ, క్రమశిక్షణ మరియు పట్టుదలతో పరీక్షలను పూర్తి చేసి బ్లాక్ బెల్ట్ స్థాయిని అందుకోవడం పట్ల క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేశారు. బ్లాక్ బెల్ట్ సాధించిన అనంతరం క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫుడ్ కమిషనర్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు మరియు అభినందనలు పొందారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను అభినందిస్తూ తైక్వాండో వంటి క్రీడలు యువతలో క్రమశిక్షణ, ధైర్యం మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రం మరియు దేశ స్థాయిలో మరింత ప్రతిభ కనబరచాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి నాయబ్ రసూల్ సీనియర్ క్రీడాకారులు నరసింహ మరియు ఆంజనేయులుపాల్గొని బ్లాక్ బెల్ట్ సాధించిన క్రీడాకారులను అభినందించారు. తైక్వాండో క్రీడను గ్రామీణ ప్రాంతాల్లో మరింతగా అభివృద్ధి చేయడానికి కృషి కొనసాగిస్తామని తెలిపారు. అలాగే క్రీడాకారులు నిరంతరం సాధన చేస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# అధునాతన సౌకర్యాలతో లింగాల పోలీస్ స్టేషన్ భవనం



ప్రజభూని, పులివెందుల
పులివెందుల నియోజకవర్గంలోని లింగాల లో అధునాతన సౌకర్యాలతో పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు తెలిపారు. శుక్రవారం ఆయన లింగా ల పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించి పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్ కు చేరుకు న్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ లింగాల పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని త్వరలోనే రాష్ట్ర హోం మంత్రి అనిత చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే పులివెందుల-ముద్దనూరు ప్రధాన రహదారిపై ఉన్న తొండూరు పోలీస్ స్టేషన్ రోడ్డు వెడల్పు కారణంగా రోడ్డు ప్రక్కన ఉన్న పోలీస్ స్టేషన్ తొలగించి నూతన పోలీస్ స్టేషన్ ను నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపామని, ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే తొండూరు లో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు చేపడుతామని ఆయన తెలిపారు.

# పులివెందులలో భారీగా సిఐ ల బదిలీలు


ప్రజాభూమి,పులివెందుల
పులివెందుల అర్బన్,రూరల్,ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లలో సిఐల బదిలీలు జరిగాయి. కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న సీఐ సీతారామిరెడ్డిని రూరల్ సిఐ గా నియమించారు. ఆయన స్థానంలో నంద్యాల డిటిపిసి లో పనిచేస్తున్న శ్రీరామ్ ను అర్బన్ సీఐ గా నియమిస్తున్నట్లు నియామకాలు జారీ చేశారు. రూరల్ సీఐ కార్యాలయంలో సీతారామిరెడ్డి శుక్ర వారం బాధ్యతలను చేపట్టారు.అలాగే పులివెందు ల రూరల్ సీఐ గా పని చేస్తున్న శాంతి లాల్ ను పులివెందుల ట్రాఫిక్ సిఐ గా నియమించారు. శాంతి లాల్ శుక్రవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో బాధ్యతలు చేపట్టారు. ట్రాఫిక్ సిఐగా పనిచేస్తున్న హాజీవల్లి ని నంద్యాల డిటిపిసి కి బదిలీ చేస్తున్న ట్లు కర్నూల్ డి ఐ జి కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు.

# కోటపోలేరమ్మ తల్లి దేవస్థానం బొడ్డురాయి పునః ప్రతిష్ట



ప్రజాభూమి పోరుమామిళ్ల :
పోరుమామిళ్ల పట్టణంలో రంపాడు రోడ్డులో వెలసిన కోట పోలేరమ్మ దేవస్థానం సంబంధించి పోరుమా మిళ్ల మెయిన్ రోడ్డులో బొడ్డురా యిని శుక్రవారం పునః ప్రతిష్టించారు. ఇంతకుముందు ఉన్న బొడ్డు రాయి రోడ్డు వెడల్పు చేయడంతో అడ్డుగా ఉన్నందున బొడ్డు రాయిని తీసి దాన్ని బాగా తయారు చేయించి ఈరోజు గ్రామస్తుల సమక్షంలో పండితుల వేదమంత్రాలతో పునః ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పోరమామిళ్ల పట్టణ మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ పాల్గొన్నారు. పోలేరమ్మ దేవస్థానం కమిటీ అధ్యక్షులు బొల్లు రవికుమార్, సంఘు వీరయ్య, అమ్మవారి శాల దేవస్థానం అధ్యక్షులు ప్రసాద్, నీటి సంఘ చైర్మన్ తోటా వెంకటయ్య, మాధవి క్లాత్ షోరూం తులసి సుధాకర్ కుటుంబ సభ్యులు, గడ్డం వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ సభ్యులు షరీఫ్, బొల్లు నాగయ్య, రైస్ బిల్లు రామ్మోహన్, గ్రామస్తులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా మదరసాలో సతీష్ రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాభూమి,పులివెందుల
దారుల్-ఉలూమ్-తన్విరుల్- హుదా టమదరసాఊ వేల్పుల దగ్గర శుక్రవారం సతీష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఓ.రసూల్, నూరుల్లా ఆధ్వర్యంలో మదరసా ప్రసిడెంట్ అబ్దుల్లా మౌలానా, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పులివెందుల పట్టణ వైకాపా అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి,లు వైసీపీ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సతీష్ రెడ్డి కి ఘన స్వాగతం పలికి పూలమాల దుశాల్వాతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా మదరసలో ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం వైసిపి నాయకులు మదరసా పెద్దలు మాట్లాడుతూ సతీష్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు సుఖసంతోషాలు కలగాలని మదరసలోని పిల్లలు వైసిపి నాయకులు కలిసి అల్లా దీవెనలు కలగాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ చంద్రమౌళి, మదరస కమిటీ సభ్యులు మత పెద్దలు వైయస్సార్ సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్- దళితవాడపై వివక్షను విడనాడాలి

## - వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చింత రాజేంద్ర

ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

వి.యం పల్లిలో దళితవాడల పట్ల మున్సిపల్ కమిషనర్ మరియు మునిసిపాల్ అధికార యంత్రాంగం అనుసరిస్తున్న వివక్షాపూరిత వైఖరి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తోందని,ఇంటి పన్నులు చెల్లించలేదనే నెపంతో పట్టణమంతా తాగునీటి సరఫరా సజావుగా సాగుతుండగా కేవలం వి.యం పల్లి దళితవాడల్లోనే నీటిని సరఫరా చేసే పైప్ లైన్ వాల్వ్ తీసుకెళ్ళి,నీటి సరఫరాను నిలిపైవేయడం శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ యొక్క అప్రజాస్వామిక ధోరణికి నిదర్శనం అని వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చింతా రాజేంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని 1వార్డు ఇతర సంపన్న వర్గాల ప్రాంతాల్లో పన్ను బకాయిలు ఉన్నప్పటికీ అక్కడ లేని కఠిన నిబంధనలు కేవలం వి.యం పల్లిలో మాత్రమే వర్తింపజేయడం రాజ్యాంగ విరుద్ధం అని పన్ను వసూలుకు ఇతర మార్గాలు ఉన్నప్పటికీ నిత్యావసరమైన నీటిని నిలిపివేసి నిరుపేదలైన దళితులను ఇబ్బందులకు గురిచేయడం అమానుషం అని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలను లక్ష్యంగా చేసుకొని ఇబ్బందులకు భయభ్రాంతులకు గురిచేయడం మున్సిపల్ చట్టాలకు వ్యతిరేకం అని శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ అధికార దుర్వినియోగం చేస్తున్నాడని తెలిపారు. "పన్నుల వసూలు పేరుతో దళితుల పైనే కక్ష సాధింపు చర్యలకు దిగడం నాగరిక సమాజంలో ఆమోదయోగ్యం కాదని,ఇది ముమ్మాటికీ దళితులపై జరుగుతున్న సామాజిక వివక్షే అని ఆవేదన వ్యక్తం చేశారు." విఎం పల్లి -శ్రీకాళహస్తి పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారి పైన మహిళలు బయటాయించి ఖాళీ



బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. దీంతో వాహనాలకు రాకపోకలు స్తంభించాయి. వెంటనే శ్రీకాళహస్తి పట్టణంలోని మొదటి వార్డు అయిన వి.యం పల్లిలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని,వివక్షాపూరిత నిర్ణయాలు తీసుకున్న శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్పై ఉన్నతాధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని పేద ప్రజల ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకోకుండా ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు మళ్ళీ పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ చేసిన ఈ వివక్షాపూరిత చర్యపై జాతీయ మరియు రాష్ట్ర ఎస్.సి కమిషన్,మానవ హక్కుల సంఘాలకు మరియు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు చింత రాజేంద్ర, పసల కృష్ణయ్య తెలియజేశారు. సమాచారం అందుకున్న టూటౌన్ సిఐ నాగరాజు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ధర్నాను విరమించాలని మీ సమస్యలను ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని వారితో మంతనాలు జరిపిన బాధితులు అంగీకరించకపోవడంతో సమాచారం అందుకున్న టిడిపి పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు ఒకటవ వార్డుకు చేరుకుని విఎం పల్లె వాసుల సమస్యలను పరిష్కరిస్తామని వారికి భరోసా ఇచ్చారు. వెంటనే మున్సిపల్ కమిషనర్తో చరవాణి ద్వారా మాట్లాడి తాగునీరుని కాలనీవాసులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు నాయకులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్- దళితవాడపై వివక్షను విడనాడాలి

## -: వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చింత రాజేంద్ర

ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్



వి.యం పల్లిలో దళితవాడల పట్ల మున్సిపల్ కమిషనర్ మరియు మునిసిపాల్ అధికార యంత్రాంగం అనుసరిస్తున్న వివక్షాపూరిత వైఖరి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తోందని,ఇంటి పన్నులు చెల్లించలేదనే నెపంతో పట్టణమంతా తాగునీటి సరఫరా సజావుగా సాగుతుండగా కేవలం వి.యం పల్లి దళితవాడల్లోనే నీటిని సరఫరా చేసే పైప్ లైన్ వాల్వ్ తీసుకెళ్ళి,నీటి సరఫరాను నిలిపైవేయడం శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ యొక్క అప్రజాస్వామిక ధోరణికి నిదర్శనం అని వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చింతా రాజేంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని 1వార్డు ఇతర సంపన్న వర్గాల ప్రాంతాల్లో పన్ను బకాయిలు ఉన్నప్పటికీ అక్కడ లేని కఠిన నిబంధనలు కేవలం వి.యం పల్లిలో మాత్రమే వర్తింపజేయడం రాజ్యాంగ విరుద్ధం అని పన్ను వసూలుకు ఇతర మార్గాలు ఉన్నప్పటికీ నిత్యావసరమైన నీటిని నిలిపివేసి నిరుపేదలైన దళితులను ఇబ్బందులకు



గురిచేయడం అమానుషం అని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలను లక్ష్యంగా చేసుకొని ఇబ్బందులకు భయభ్రాంతులకు గురిచేయడం మున్సిపల్ చట్టాలకు వ్యతిరేకం అని శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ అధికార దుర్వినియోగం చేస్తున్నాడని తెలిపారు. "పన్నుల వసూలు పేరుతో దళితుల పైనే కక్ష సాధింపు చర్యలకు దిగడం నాగరిక సమాజంలో ఆమోదయోగ్యం కాదని,ఇది ముమ్మాటికీ దళితులపై జరుగుతున్న సామాజిక వివక్షే అని ఆవేదన వ్యక్తం చేశారు." విఎం పల్లి -శ్రీకాళహస్తి పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారి పైన మహిళలు బయటాయించి ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. దీంతో వాహనాలకు రాకపోకలు స్తంభించాయి. వెంటనే శ్రీకాళహస్తి పట్టణంలోని మొదటి వార్డు అయిన వి.యం పల్లిలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని,వివక్షాపూరిత నిర్ణయాలు తీసుకున్న శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్పై ఉన్నతాధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని పేద ప్రజల ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకోకుండా ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు మళ్ళీ పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ చేసిన ఈ వివక్షాపూరిత చర్యపై జాతీయ మరియు రాష్ట్ర ఎస్.సి కమిషన్,మానవ హక్కుల సంఘాలకు మరియు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు చింత రాజేంద్ర, పసల కృష్ణయ్య తెలియజేశారు. సమాచారం అందుకున్న టూటౌన్ సిఐ నాగరాజు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ధర్నాను విరమించాలని మీ సమస్యలను ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని వారితో మంతనాలు జరిపిన బాధితులు అంగీకరించకపోవడంతో సమాచారం అందుకున్న టిడిపి పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు ఒకటవ వార్డుకు చేరుకుని విఎం పల్లె వాసుల సమస్యలను పరిష్కరిస్తామని వారికి భరోసా ఇచ్చారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ తో చరవాణి ద్వారా మాట్లాడి తాగునీరుని కాలనీవాసులు అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు విజయకుమార్ శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డ్ నెంబర్ సభ్యులు గాంధీపాకుల గోపి.వైఎస్ఆర్సిపి నియోజకవర్గ అధ్యక్షులు పసల కృష్ణయ్య. పసల రామచంద్రయ్య. సుమతి. పసల సురేష్. దేవా వైఎస్ఆర్సిపి నాయకులు గ్రామస్తులు మహిళలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫాదర్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ ఎం. ఎల్. ష్రాఫ్ 124వ జయంతి

ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రపురం




ఫాదర్ ఆఫ్ ఫార్మసీ, కీర్తిశేషులు ప్రొఫెసర్ ఎం ఎల్ ష్రాఫ్, 124 వ జయంతి సందర్భంగా తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం వెంకట్రామాపురం సమీపంలో ఉన్న సెవెన్ హిల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రాంగణంలో ఫార్మ అన్వేషన్ -2026 కార్యక్రమము ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితగా విచ్చేసిన డా॥ సయద్ రహమతుల్ల పాథోజీన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ జీవ - ఔషద రంగాలలో నాణ్యత మరియు కొలమానము విశిష్టతను మరియు అదునాతన సాంకేతిక ఫలితాల వినియోగ మెళుకువలు ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను డా॥ లక్ష్మయ్య మరియు డా॥ ప్రసన్న రాజు మరియు అధ్యాపక సిబ్బందిని, ఫార్మశ్రీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కేంద్రియ సభ్యులు డా॥ నిరంజన్ బాబు మరియు కళాశాల యాజమాన్యం- అభినందించారు.

# ఆంధ్రరాష్ట్ర గవర్నర్,కు రేణిగుంటలో ఎయిర్ పోర్ట్,లో ఘనస్వాగతం

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం శుక్రవారం రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయంకు చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కు ఘన స్వాగతం లభించింది.స్వాగతం పలికిన వారిలో జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువానిషి, జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమ, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి భరత్ పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు.ఈరోజు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 22వ కన్వోకేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.

# శ్రీ అగస్తీశ్వర స్వామి ఆలయ మహా కుంబాభిషేకం పాల్గొన్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి రూరల్

తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన శ్రీ కామాక్షి సమేత అగస్తీశ్వర స్వామి వార్ల ఆలయ మహా కుంబాభిషేకం, నూతన విగ్రహ ప్రతిష్టాపనకు రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్



చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డితో పాటు తిరుపతి రూరల్ ఎంపీపీ విడుదల మాదవ రెడ్డిలకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయం వద్ద కుంబాభిషేకంలో పాలు పంచుకున్నారు. స్వామి వారి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో గాంధీ పురం మాజీ సర్పంచ్ శెల్వంతో పాటు ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి -జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:

మార్చి 8న జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నియోజకవర్గ స్థాయిలో ఘనంగా నిర్వహించాలని సూచించారు. మహిళా సాధికారత భావనకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణలో డీఆర్డీఏ, మెప్మా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే పోలీసు శాఖలోని మహిళా విభాగాన్ని కూడా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ముందస్తు ప్రణాళిక సమావేశాలు నిర్వహించి, ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారంగా వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఇటీవల ఆమోదం పొందిన 10 వన్ స్టాప్ సెంటర్లను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నందున, వాటిని వర్చువల్ ద్వారా వీక్షించేలా సరైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మహిళల కోసం అందుబాటులో ఉన్న 112 టోల్ ఫ్రీ సేవలు, వన్ స్టాప్ సెంటర్ సేవలు, డీవీ సెల్, ప్రసూతి సేవలు వంటి అంశాలపై జిల్లా కేంద్రాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ శుక్రవారం పై ప్రకటనలో తెలిపారు.

# తిరుపతిలోని పళని థియేటర్ సమీపంలో జనసేన పార్టీ 'ఉద్యమి' క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం .కార్యక్రమాన్ని ప్రారంభించిన తిరుపతి జనసేన పార్టీ ఇంచార్జ్ కిరణ్ రాయల్

## కిరణ్ రాయల్, తిరుపతి జనసేన పార్టీ ఇంచార్జ్

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి.



తిరుపతి వ్యాప్తంగా 4 కేంద్రాల్లో చురుకుగా సాగుతున్న సభ్యత్వ నమోదు ప్రక్రియ. క్రియాశీలక సభ్యులకు ప్రమాదం జరిగితే ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు జనసేన సాయం.దురదృష్టవశాత్తు సభ్యుడు మరణిస్తే ఆ కుటుంబానికి



రూ. 5 లక్షల ఆర్థిక భరోసా కల్పిస్తున్న పవన్ కళ్యాణ్. దేశంలో మరే రాజకీయ పార్టీ చేయని విధంగా వేలాది మంది కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తున్న జనసేన పార్టీ. లక్షలాది రూపాయల సాయం కార్యకర్తలకు అందించిన చరిత్ర జనసేనకు ఉంది.. చనిపోయిన కుటుంబ సభ్యులకు డబ్బులు ఇచ్చిన దాఖలాలు వైసీపీకి ఉందా. గత ఏడాది తిరుపతిలో 16,500 సభ్యత్వాలు జరగ్గా.. ఈ ఏడాది 30,000 సభ్యత్వాలు సాధించడమే లక్ష్యం. అని ఆయన వెల్లడించారు.

# పదవ తరగతి పరీక్షలను అత్యంత పగడ్బందీగా నిర్వహించాలి....

## కాపీయింగ్ జరిగితే చర్యలు తప్పవు...

## అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడిల్

## పదవ తరగతి పరీక్షలు విద్యార్థి జీవితంలో చాలా కీలక పాత్ర

## -ఆర్ జె డి శ్యాముల్

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:పదవ తరగతి పరీక్షలను అత్యంత పగడ్బందీగా నిర్వహించాలి అని అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడిల్ పేర్కొన్నారు. శుక్రవారం జడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మార్చి నెల 16 తేదీ నుండి నిర్వహించే ఏప్రిల్ ఒకటో తేదీ వరకు పదో తరగతి పరీక్షల సందర్భంగా ముందస్తు ఏర్పాట్లు అమలులో భాగంగా ఆయా పాఠశాల హెడ్మాస్టర్ లతో, డిప్యూటీ తాసిల్దార్లతో, ఎంఈఓ లతో, సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో కడప ఆర్ జి డి శ్యాముల్, డీఈవో రాజేంద్రప్రసాద్, డిప్యూటీ ఙజూ లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రశ్నాపత్రాలను పరీక్ష కేంద్రాలకు చేరవేయడంలో, విద్యార్థులు రాసిన ఆన్సర్ పత్రాలను స్ట్రాంగ్ రూములకు చేరవేయడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన పోలీసు శాఖ వారు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి చిన్న తప్పును సహించనని, కాపీయింగ్ జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆర్జెడిశ్యాముల్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు విద్యార్థి జీవితంలో చాలా కీలక పాత్రపోషిస్తాయని, వీటిని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ముందుగా జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్ర ప్రసాద్ పదవ తరగతి పరీక్షలపై వివిధ అంశాలను అసిస్టెంట్ కలెక్టర్లకు వివరించారు. జిల్లాలో 129 కేంద్రాలలో 23095 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారన్నారు. 12105 మంది అబ్బాయిలు 10990 మంది అమ్మాయిలు పరీక్షకు హాజరు అవ్వబోతున్నారన్నారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# అమరావతి శాసనసభ కార్యకలాపాలను ప్రత్యక్షంగా వీక్షించిన కేవిబి పురం విద్యార్థులు

ప్రజాభూమి ప్రతినిధి కేవీబీపురం

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కె వి బి పురం విద్యార్థులు ఈరోజు అమరావతిలోని శాసనసభ కార్యకలాపాలను ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు విద్యార్థులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరు కూడా భవిష్యత్తులో మంచి రాజకీయ నాయకులు కావాలని, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. సత్యవేడు నియోజకవర్గ శాసనసభ్యులు నేటి ఆది విద్యార్థులకు అవసరమైన భోజనం వసతులు ఏర్పాటు చేశారు. శాసనసభ కార్యకలాపాల పట్ల పూర్తి అవగాహన పెంచుకున్నట్లు ఉపాధ్యాయులు సత్య సుబ్రహ్మణ్యం మరియు విజయ తెలియజేశారు ఇ లాంటి అవకాశం ప్రభుత్వం కల్పించినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఆకస్మిక తనిఖీలు చేపట్టిన ఎంఈఓ డి .ప్రేమలత....

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.



తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మడిబాక గ్రామపంచాయతీ రాజుల కండ్రిగ ఆదర్శ పాఠశాలను ఈరోజు ఎంఈఓ డి. ప్రేమలత ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా ఆమె పాఠశాలలోని పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలోని ఉపాధ్యాయుల హాజరు పట్టికలు, విద్యార్థుల అటెండెన్స్ మరియు స్టాక్ రిజిస్టర్ లను ఆమె తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, వంటగది శుభ్రతను, ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. తరగతి గదులకు వెళ్లి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగి వారి విద్యా స్థాయిని అంచనా వేశారు. స్కూల్ పరిసరాలను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల సరస్వతి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అంగనవాడి కార్యకర్తలకు అసంక్రమిత వ్యాధులపై అవగాహన

ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి. ఎన్ కండ్రిగ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మార్చ్ 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ముందస్తు గా పురస్కరించుకొని వైద్యాధికారి డాక్టర్ మురళీధర్ రెడ్డి, ఆరోగ్య అధికారి డి.ఎం. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు అసంక్రమిత వ్యాధులపై స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ టీచర్లకు రక్త పరీక్షలు, యూరిన్ పరీక్షలు



సహా మొత్తం 28 రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే బీపీ చెక్ చేసి అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, థైరాయిడ్, మూర్ఛ వ్యాధి, పక్షవాతం, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, నోటి క్యాన్సర్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి మార్పులు, ఆహారపు అలవాట్లలో మార్పులు, ప్రకృతి వినాశనం వంటి కారణాల వల్ల అసంక్రమిత వ్యాధులు సమాజంలో పెరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ శారీరక శ్రమ చేయడం, రోజూ వ్యాయామం చేయడం, మానసిక ప్రశాంతత కోసం ధ్యానం అలవరుచుకోవడం అవసరమని సూచించారు. అలాగే పుష్టికరమైన ఆహారం తీసుకోవడం, ఉప్పు, నూనె, మైదా వాడకాన్ని తగ్గించడం, చెట్లను విరివిగా నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి అలవాట్లు పాటించాలని తెలిపారు. పాన్ పరాగ్, గుట్కా, పొగాకు నమలడం, ధూమపానం, మద్యపానం



వంటి అలవాట్లను పూర్తిగా మానుకుంటే అసంక్రమిత వ్యాధులను దూరం చేసుకోవచ్చని చెప్పారు. నోటిలో పుండ్లు, రంగు మచ్చలు, గడ్డలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 9
శనివారం 07 మార్చి 2025

# ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి సిపిఎం డిమాండ్......

## యోగిమల్లవరం చెరువును కాపాడండి......



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్.

తిరుపతి రూరల్ మండలం యోగిమల్లవరం చెరువు ఆక్రమణపై సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజన్ అధికారికి వినతి.తిరుపతి జిల్లా, తిరుపతి రూరల్ మండలం పరిధిలోని యోగిమల్లవరం చెరువు సర్వే నెంబర్ 1/1/2 లో జరుగుతున్న భారీ ఆక్రమణలను వెంటనే నిలిపివేయాలని, అక్రమంగా నిర్మించిన ఇళ్లను తొలగించాలని సీపీఎం పార్టీ తరఫున తిరుపతి రెవెన్యూ డివిజన్ అధికారి దృష్టికి సిపిఎం జిల్లా నాయకులు ఎస్ జయచంద్ర, జి.బాలసుబ్రహ్మణ్యం, టి మునిశేఖర్ తీసుకెళ్లారు.సీపీఎం నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ సర్వే నంబర్లోని చెరువు భూమిని కొందరు దుర్మార్గులు ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపట్టారని, ఇది చట్టవిరుద్ధమే కాకుండా స్థానిక ప్రజలకు తీవ్ర అన్యాయం అని పేర్కొన్నారు. ఈ ఆక్రమణల వల్ల చెరువు పూడిపోయి, వర్షాకాలంలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడమే కాకుండా, పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, ఈ అక్రమ నిర్మాణాలు చేసిన వారికి విద్యుత్ శాఖ అధికారులు కరెంటు మీటర్లు మంజూరు చేసి, అక్రమణకు పరోక్షంగా ప్రోత్సాహం అందించారని ఆరోపించారు. సదరు అధికారులపై కూడా తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.స్థానిక ప్రజలు, ముఖ్యంగా రైతులు చెరువు కోల్పోవడం వల్ల తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని, చెరువు సర్వే నంబర్ పునరుద్ధరించాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేస్తోంది.... లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం ఆందోళన నిర్వహిస్తానని సిపిఎం పార్టీ తరఫున కోరుకుంటున్నారు.

# జన గణన కార్యక్రమం దేశ నిర్మాణంలో అత్యంత కీలకమైనది: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:

జనగణన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వహించి విజయవంతం చేయాలి అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు, శుక్రవారం ౫ా౫ూమీ కళాశాల నందు సమావేశ మందిరంలో జనగణన శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ప్రారంభించారు, ఈనెల ఆరో తేదీ నుండి 8 తేదీ వరకు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిఆర్ఓ మోహన్ కుమార్, ఏడి సుప్రజ, ఆర్డీవోలు, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన కార్యక్రమం దేశ నిర్మాణంలో అత్యంత కీలకమైన ప్రక్రియ అని, ప్రతి ఒక్క వ్యక్తిని ఖచ్చితంగా లెక్కించడం అవసరమన్నారు. జన గణన ద్వారా సేకరించే ప్రతి సమాచారం దేశం, రాష్ట్రం, జిల్లా మరియు గ్రామ అభివృద్ధికి అత్యంత ప్రాముఖ్యమైనదని పేర్కొన్నారు. ఒక రాష్ట్రం లేదా దేశం అభివృద్ధిని అంచనా వేయడానికి ప్రపంచవ్యాప్తంగా అత్యంత విశ్వసనీయమైన ఆధారం జనగణన మాత్రమే అని తెలిపారు. అక్షరాస్యత రేటు, లింగ నిష్పత్తి, జనాభా సంఖ్య వంటి కీలక అంశాలు అన్నీ జన గణన ఆధారంగానే నిర్ణయించబడతాయని ప్రతి ఎన్యూమరేటర్ సేకరించే సమాచారం ఎంతో విలువైనదని పేర్కొన్నారు.జనగణన ప్రక్రియ 1872 సంవత్సరం నుంచి కొనసాగుతుండగా ఇప్పటి వరకు అనేక సార్లు నిర్వహించబడిందని, ప్రతి దశలోనూ దేశ ప్రణాళికలు రూపొందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చే ఆర్థిక నిధుల కేటాయింపులో కూడా జనాభా ఒక ప్రధాన ప్రమాణంగా ఉండటంతో ప్రతి వ్యక్తిని లెక్కించడం చాలా ముఖ్యమని వివరించారు. ఎన్యూమరేటర్లు కొంతమంది వ్యక్తులను లెక్కించకుండా వదిలేస్తే అది పెద్ద మొత్తంలో జనాభా తగ్గినట్లుగా నమోదవుతుందని దీని ప్రభావంగా రాష్ట్రానికి రావాల్సిన వేల కోట్ల రూపాయల నిధులు తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈసారి జన గణన పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడుతుందని, అందువల్ల గతంలోలాగా ఫలితాలు రావడానికి ఎక్కువ సమయం పట్టదని, సాధారణంగా ఏడాది పట్టే ప్రక్రియ ఇప్పుడు డిజిటల్ విధానంలో సుమారు ఆరు నెలల్లోనే పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు. కుల గణన (కాస్ట్ సెన్సస్) కూడా నిర్వహించబడనున్నందున అది సామాజిక న్యాయం సాధనలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గం యొక్క నిజమైన జనాభా వివరాలు తెలిసినప్పుడే సరైన ప్రాతినిధ్యం మరియు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం సాధ్యమవుతుందని వివరించారు. జన గణన కార్యక్రమాన్ని ప్రతి ఎన్యూమరేటర్ బాధ్యతగా తీసుకొని, ప్రతి ఒక వ్యక్తిని ఖచ్చితంగా లెక్కించాలన్నారు. ఈ ప్రక్రియను నిజమైన “నేషన్ బిల్డింగ్ ఎక్సర్సైజ్” గా భావించి అందరూ సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఓ శ్రీనివాస్ రావు, జెడ్పి సీఈవో రవికుమార్, డీఎఫ్ఓ సుబ్బరాజు, ఆర్డిఓలు,తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, డీటీలు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# మహిళలకు విశ్వాసాన్ని కల్పించడం ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యత అని జిల్లా ఎస్పీ

## - మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళలకు ప్రత్యేక మెడికల్ క్యాంపు







ప్రజా భూమి ప్రతినిధి :తిరుపతి

– తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది మహిళల భద్రత మరియు సాధికారతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.– ఈ కార్యక్రమాల ద్వారా మహిళలు నేటి సమాజంలో ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, నేరాలపై అప్రమత్తంగా ఉండే విధంగా చైతన్యం కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, మహిళా ప్రాంగణాలు, వాణిజ్య సముదాయాలు తదితర ప్రాంతాలను సందర్శించిన మహిళా పోలీసులు పోలీసు అధికారులు మహిళలకు భద్రతకు సంబంధించిన అంశాలు, సైబర్ నేరాలు, మోసాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించారు. మహిళలు తమ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండి చట్టపరమైన సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.– అలాగే గ్రామీణ ప్రాంతాలలో రాత్రిపూట గ్రామస్తులతో సమావేశాలు నిర్వహిస్తూ సమాజంలో మహిళల భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. పోలీసు శాఖ ఎల్లప్పుడూ మహిళల భద్రతకు కట్టుబడి ఉందని ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు.– ఇందులో భాగంగా ఈరోజు జిల్లా ఎస్పీ ఆదేశాలపై మహిళా డీఎస్పీ శ్రీలత ఆధ్వర్యంలో తిరుపతి పోలీస్ మైదానంలో మహిళల కోసం ప్రత్యేకంగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంప్‌లో మహిళలకు రక్తపరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందజేశారు. మహిళలు పెద్ద ఎత్తున ఈ మెడికల్ క్యాంప్‌లో పాల్గొని సేవలను వినియోగించుకున్నారు.– అనంతరం జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., మహిళా పోలీసు సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడుతూ, ఇక్కడికి విచ్చేసిన డాక్టర్లు మరియు మా పోలీస్ కుటుంబ సభ్యులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అన్నారు. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం కావడంతో ముందస్తుగా వారాంతరంగా వివిధ కార్యక్రమాలను ఏర్పాటు చేసి జరుపుకుంటున్నామని తెలిపారు.– మహిళలు నేటి సమాజంలో ప్రతి రంగంలో ముందంజలో ఉన్నారని ఎస్పీ పేర్కొన్నారు. అమ్మగా, అక్కగా, చెల్లిగా, భార్యగా కుటుంబ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తూ, అదే సమయంలో చదువు, ఉద్యోగం, సేవా రంగాలు తదితర అన్ని విభాగాల్లో మహిళలు తమ ప్రతిభను చాటుకుంటూ సమాజ అభివృద్ధికి విశేషంగా తోడ్పడుతున్నారని అన్నారు. ప్రతి రంగంలో తమదైన శైలిలో ముందుకు సాగుతూ మహిళలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు.– సమాజంలో మహిళల భద్రత మరియు సాధికారత కోసం పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా సిబ్బంది తమ ధైర్యం, నిబద్ధత, క్రమశిక్షణతో విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు.– మహిళలపై జరిగే నేరాలను అరికట్టడంలో మహిళా పోలీసులు ముందుండి పనిచేయాలని, ప్రజలకు దగ్గరగా ఉండి వారి సమస్యలను తెలుసుకొని వెంటనే స్పందించే విధంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. మహిళా పోలీసు సిబ్బంది పోలీస్ శాఖకు ఒక ప్రత్యేక బలమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.– ఈ ముఖ్యమైన రోజులలోనే కాకుండా నిరంతరం ఇలాంటి అవగాహన కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా పనిచేయాలని సూచించారు. మహిళలు ఏ సమస్య ఎదురైనా పోలీసులను నమ్మకంగా సంప్రదించేలా విశ్వాసాన్ని కల్పించడం ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యత అని జిల్లా ఎస్పీ తెలిపారు.– అనంతరం మహిళల సాధికారత, మహిళా భద్రతపై అవగాహన కల్పించే కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని విశేష సేవలందించిన మహిళా సిబ్బందిని అభినందించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు, కార్యక్రమం ముగిసిన తరువాత మహిళా పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహిళా సిబ్బందితో కలిసి భోజనం చేసి వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. పోలీస్ కుటుంబ సభ్యులుగా ఎల్లప్పుడూ మీకు నేను అండగా ఉంటాననే భావన కలిగేలా సిబ్బందిని ప్రోత్సహించారు.– ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ సతీమణి ఎల్. ఇందు హారిక , ఆధనపు ఎస్పీ సతీమణి కీర్తి. విమలాకుమారి పాల్గొన్నారు.– అదనపు ఎస్పీలు వెంకట్రావు (పరిపాలన), రవిమనోహర్ ఆచారి (శాంతి భద్రతలు), శ్రీనివాసులు (క్రైమ్స్), పోలీస్ డాక్టర్ మాధురి , సీఐడీ డీఎస్పీ హేమలత , మహిళా పోలీస్ స్టేషన్ సీఐ తమిమ్ అహ్మద్ మహిళా పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయిలో ఘనంగా విజ్ఞాన వారోత్సవాలు



ప్రజా భూమి ప్రతినిధి
బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి.ఎన్ కండ్రిగ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి విజ్ఞాన వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ధనుంజయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, ఎ. ముని సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రభుత్వ యాజమాన్య ప్రాథమిక, ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలల విద్యార్థుల కోసం వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించారు. ప్రాథమిక స్థాయిలో 3, 4, 5 తరగతుల విద్యార్థులు, ఉన్నత స్థాయిలో 6, 7, 8 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. పోస్టర్ ప్రెజెంటేషన్, ట్రైన్ స్టేషన్ అండ్ స్పేస్ టెక్నాలజీ అంశాలపై క్విజ్ పోటీలు, ఫ్యాన్సీ డ్రెస్సు పోటీలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సీనియర్ మరియు జూనియర్ విభాగాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ధనుంజయులు మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, ఎ. ముని సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# అంగన్వాడి భవనాన్ని ప్రారంభించిన బొజ్జల రిషితా రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

ఏర్పేడు మండలం కాట్రకాయలగుంట గ్రామంలో “అంగన్వాడీ స్కూల్ ”భవనాన్ని కోకా కోల కంపెనీ వారిసహకారంతో (సి ఎస్ ఆర్)క్రింద మన ప్రియతమ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి . సతీమణి బొజ్జల రిషితా రెడ్డి . చేతులమీదుగా ప్రారంభోచ్చవం చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో ఏర్పేడు టీడీపీ పార్టీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు . నైనూరు పున్నారావు . ఏర్పేడు పిఎసిఎస్ ఛైర్మన్ మహేష్ .రెడ్డి షైక్ ఖలీల్ బాషా .సి ఎస్ ఆర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, నితేష్ పిఎసి ఆఫీసర్ హెచ్సిసిబి , సిడిపిఓ క్రిష్ణవేణి సూపరవైజర్ రత్నమ్మ .గాలి క్రిష్ణవేణి, రాఘవేంద్ర, సురేష్, చంద్రశేఖర్ నాయుడు, రాజా, గుణాయాదవ్, కేకే రమణ, రాచటి సుబ్రహ్మణ్యం, మునిరెడ్డి, కేశినేని సుబ్రహ్మణ్యం, నారాయణ, రామదాసు, బి.క్రిష్ణయ్య, చంద్ర, శ్రీపతి, వెంకటరమణ, బాలకృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, నాగంపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, చంద్ర, హరి, వై. మనోహర్ నాయుడు అంగన్వాడీ సిబ్బంది పాలుగున్నారు.



# ఎల్లంపల్లి యానాదులు వేసుకున్న గుడిసెలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి సిపిఐ మించల శివకుమార్ డిమాండ్



ప్రజా భూమి ప్రతినిధి: శ్రీ కాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి రూరల్ :మండలం లోని వాగేడు పంచాయతీ ఎల్లంపల్లి ఎస్టి కాలనీలో జనాభా పెరుగుదల కారణంగా ఇంటి స్థలాలు లేక నాన ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మించల శివకుమార్ శుక్రవారం డిమాండ్ చేశారు ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో యానాదుల బాధలను పరిష్కరించే అధికారులు లేరని మండిపడ్డారు స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్న ఈనాటికీ ఎస్ టి, ఎస్ సి లకు ఉండడానికి గూడు, తినడానికి తిండి లేక ఎటువంటి మౌలిక సదుపాయాలు లేక ఎండిన డొక్కలతో వ్యవసాయ కూలీలు ,ఉపాధి కూలీలు నాన ఇబ్బందులు గురవుతున్న పట్టించుకోవలసిన అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్టు అధికారులు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఎల్లంపల్లి యానాదులు వేసుకున్న గుడిసెలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో చంగలరాయిలు, బత్తయ్య శివమ్మ ,కృష్ణయ్య, అమ్ములు, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలకు కేంద్రమవుతున్న కేటీ రోడ్డు

## తలారివెట్టు బస్టాండ్ మలుపు వద్ద ఆగిపోయిన ఇసుక ట్రాక్టర్ -- ప్రమాదపు టంచుల్లో వాహనదారులు



ప్రజా భూమి ప్రతినిధి
బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలోని తలారివెట్టు బస్టాండ్ సమీపంలో ఉన్న కేటీ రోడ్డు మలుపు ప్రమాదాలకు కేంద్రంగా మారుతోంది. రహదారి మలుపు వద్ద అధిక లోడులతో వెళుతున్న భారీ వాహనాలు మొరాయించడం వల్ల వాహనదారులు ప్రమాదపు టంచుల్లో ప్రయా ణించాల్సిన పరిస్థితి నెలకొంది.శుక్రవారం మలుపు వద్ద ఇసుకతో నిండిన ట్రాక్టర్ ఆగిపోవడంతో రోడ్డుపై వెళ్లే వాహనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. మలుపు ప్రాంతం ఇప్పటికే సన్నగా ఉండగా ట్రాక్టర్ నిలిచిపోవడంతో వాహనదారులు చాలా జాగ్రత్తగా ప్రయాణించాల్సి వచ్చింది. కొంతసేపు ట్రాఫిక్‌కు కూడా అంతరాయం ఏర్పడింది.ఈ మార్గంలో బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. మలుపు వద్ద భారీ వాహనాలు నిలిపివేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు స్పందించి మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు వాహనాలను అక్కడ నిలిపివేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు స్థానికులు కోరుతున్నారు.

# డ్రిప్ ఇరిగేషన్ సిస్టంతో అడవి చెట్లు నాటిన శ్రీ స్వర్ణముఖి ఆశ్రమం




ప్రజా భూమి ప్రతినిధి.. శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి మండలంలోని సుబ్బానాయుడు కండ్రిగ పంచాయతీలో శ్రీ స్వర్ణముఖి ఆశ్రమ వ్యవస్థాపకులు కిరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం 1300 అడివి చెట్లను డ్రిప్ ఇరిగేషన్ సిస్టంతో నాటడం జరిగింది.



5 ఎకరాల్లో ఆశ్రమాన్ని నిర్మించనున్నారు.



కిరణ్ ఆశ్రమ వ్యవస్థాపకులు..

ఆశ్రమ వ్యవస్థాపకుడు కిరణ్ మాట్లాడుతూ వ్యాపార రీత్యా 25 సంవత్సరాలు కాలిఫోర్నియా లో ఉండి జన్మభూమి పై ఉన్న ప్రేమతో తిరిగి ఇక్కడకు వచ్చి ఆధ్యాత్మిక ధోరణిలో ఆశ్రమానికి శ్రీకారం చుట్టాను. నేడు 1300 అడివి చెట్లను డ్రిప్ ఇరిగేషన్ సిస్టం ద్వారా నాటడం జరిగింది. ఆశ్రమానికి వచ్చే వారి కోసం రాబోయే రోజుల్లో ఆధ్యాత్మిక వాతావరణంతో పాటు, ధ్యాన మందిరం, యోగ ఓపెన్ ఆడిటోరియం, కుటీరాలు నిర్మించనున్నామని తెలియజేశారు.

# శ్రీకాళహస్తిలో కొట్టే సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం



ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి లికొట్టే సాయి ప్రసాద్‌లి ఆధ్వర్యంలో ఉద్యమి జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టే సాయి ప్రసాద్ పరిసర ప్రాంతాల్లోని దుకాణాలను సందర్శిస్తూ ప్రజలకు జనసేన పార్టీ సిద్ధాంతాలు, పార్టీ లక్ష్యాలు మరియు క్రియాశీలక సభ్యత్వం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఆసక్తి చూపిన ప్రజలతో జనసేన సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కుమార్, జయప్రకాష్, మహేష్, గరికపాటి చంద్ర, జానీ భాషా, చిరంజీవి జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.



# వన్నియకుల క్షత్రియుల ఆత్మీయ సమ్మేళనం

## -- 8న తిరుపతిలో వధూవరుల పరిచయ వేదిక



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

తిరుపతిలోని నేషనల్ హైవే పక్కన తన్నపల్లి క్రాస్ వద్ద అదిత్ గ్రాండ్ ఎదురుగా తాజ్ హోటల్ సమీపంలో ఈ నెల 8న వన్నియకుల క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం మరియు వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు తిరుపతి జిల్లా వన్నియకుల క్షత్రియ సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం తిరుపతిలో వన్నియకుల క్షత్రియ సభ్యులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం మరియు వధూవరుల వివాహ పరిచయ వేదిక కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వన్నియకుల క్షత్రియులు రానున్న రోజుల్లో ఐక్యంగా సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. వన్నియకుల క్షత్రియులను ఏకతాటిపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఆత్మీయ సమ్మేళనం మరియు వధూవరుల వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని అంశాల్లో వన్నియకుల క్షత్రియులు ఏకం కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వన్నియకుల క్షత్రియులను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ నెల 8న నేషనల్ హైవే పక్కన తన్నపల్లి క్రాస్ వద్ద అదిత్ గ్రాండ్ ఎదురుగా తాజ్ హోటల్ దగ్గర నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి వన్నియకుల క్షత్రియ సోదరులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం ఉద్దేశ్యం వన్నియకుల క్షత్రియుల్లో వెనుకబడిన వారికి ఆర్థిక సహాయం అందించడం, స్కాలర్‌షిప్ కార్యక్రమాలు నిర్వహించడం, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టడం, స్వంత వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి ఆర్థిక సహాయం అందించడం మరియు సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయడం అని తెలిపారు.

# వేరుశెనగ రైతులకు శిక్షణ కార్యక్రమం



ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ తిరుపతి జిల్లా బి. ఎన్ కండ్రిగ మండల వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం ఉదయం వేరుశెనగ పండించే రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యాల్యూ చైన్ క్లస్టర్ కింద



వేరుశెనగ పంట సాగు చేస్తున్న రైతులకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే నుండి ఎంటమాలజీ శాస్త్రవేత్త జి. అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వేరుశెనగ పంటకు వచ్చే వివిధ రకాల పురుగులు, వాటి నివారణ పద్ధతులు, అలాగే పంటకు వచ్చే తెగుళ్లు మరియు వాటి నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. పంటను రక్షించుకోవడానికి అనుసరించాల్సిన పద్ధతులపై రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి షణ్ముఖం మాట్లాడుతూ వేరుశెనగ పంట ప్రాముఖ్యత, వేరుశెనగ వినియోగం వల్ల మానవ ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అలాగే సూళ్లూరు పేట ఎఫ్ఎఫ్‌పీఓ నుండి కన్నయ్య నాయుడు పాల్గొని తమ ఎఫ్‌పీఓ ద్వారా రైతులకు అందించే సేవలు, నిర్వహించే కార్యక్రమాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి రేవతి కూడా హాజరయ్యారు. కార్యక్రమంలో పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# టీటీడీ ఈవోగా ముద్దాడ రవిచంద్ర భాధ్యతల స్వీకారం



ప్రజా భూమి ప్రతినిధి తిరుమల.

ముద్దాడ రవిచంద్ర శ్రీవారి ఆలయంలో శుక్రవారం ఉదయం 7.34 గంటలకు టీటీడీ ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన టీటీడీ పాలక మండలి సభ్య కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేశారు. టీటీడీ అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరి వారి చేత



ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఈవో దంపతులకు రంగ నాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం అందించగా అదనపు ఈవో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం ముందు ఈవో మీడియాతో మాట్లాడుతూ గత నెల రోజులుగా తిరుమలలో చాలా విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. శ్రీవారి భక్తులకు సాటి భక్తుడిగా సేవ చేస్తానని చెప్పారు. భక్తుల నుండి చాలా సలహాలు సూచనలు వచ్చాయని, వాటిని తానే స్వయంగా పరిశీలించి ఆ అనుభవంతో భక్తులకు మంచి ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేస్తామని తెలియజేశారు.

# మొక్కు తీర్చుకున్న ముస్లిం దంపతులు:

## మిట్టమీద గంగమ్మ తల్లికి వెండి దీపాల సమర్పణ..!



ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:

చంద్రగిరి పట్టణం, కొత్తపేట, భారతీనగర్‌కు చెందిన అబ్దుల్ రజాక్, రజియా దంపతులు ఈ ఏడాది జనవరిలో జరిగిన అమ్మవారి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్నారు. ఆ సమయంలో తమకు ఉన్న ఒక వ్యక్తిగత కోరిక నెరవేరాలని గంగమ్మ తల్లిని భక్తితో వేడుకున్నారు. తాము మొక్కుకున్న విధంగానే అనుకున్న కార్యం దిగ్విజయంగా పూర్తి కావడంతో, ఈ దంపతులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ మొక్కులో భాగంగా 223 గ్రాముల బరువు కలిగిన వెండి దీపాలను తయారు చేయించి, వాటిని ఆలయ అర్చకులు సుబ్బు స్వామికి అందజేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ రజాక్, రజియా దంపతులు అమ్మవారిపై ఉన్న అచంచలమైన నమ్మకంతోనే తాము మొక్కుకున్నామని, కోరిక నెరవేరడంతో కృతజ్ఞతగా ఈ కానుకను సమర్పించామని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. అమ్మవారిపై అచంచలమైన విశ్వాసంతో దంపతులు ఈ విరాళాన్ని అందజేయడం అభినందనీయమని కొనియాడారు. పూజా కార్యక్రమాల అనంతరం అబ్దుల్ రజాక్, రజియా దంపతులకు ఆలయ మర్యాదలతో తీర్థప్రసాదాలు అందజేసి, ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# కొత్తమారికుప్పం ఇంద్రపురంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ.

## 18 లక్షల రూపాయల జడ్పీ నిధులతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం.



ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు


తిరుపతి జిల్లా సత్యవేడు మండలం కొత్తమారికుప్పం పంచాయతీ ఇంద్రపురం కాలనీలో నూతన సిమెంటు రోడ్డు నిర్మాణానికి స్థానిక జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి భూమిపూజ జరిపి ప్రారంభించారు. శుక్రవారం ఇంద్రపురం ఎస్సీ కాలనీలో పలువురు టిడిపి నాయకులతో కలిసి జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి శాస్త్రోత్తంగా పూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో చిన్నఈటిపాకంలో మూడు లక్షలు,రాచపాలెంలో ఐదు లక్షలు, ఇంద్రపురంలో ఐదులక్షల రూపాయల వ్యయంతో సిమెంటు రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. అలాగే కాలమనాయుడుపేటలో మరో ఐదు లక్షల రూపాయలతో కల్వర్టు నిర్మిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నట్టు ఆమె గుర్తు చేశారు. దీంతోపాటు సామాజిక భద్రతలో భాగంగా ప్రతి నెల ఒకటో తేదీ అర్హులైన వారందరికీ పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. టిడిపి నియోజకవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి సహకారంతో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో 18 లక్షల రూపాయల జడ్పీ నిధులతో నూతనంగా సిమెంట్ రోడ్లు,కల్వర్టుల నిర్మాణాలను చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ అమాసరెడ్డి,రాజశేఖర్ రెడ్డి,సర్పంచ్లు గోవింద స్వామి,రూబన్,మాజీ సర్పంచ్ గోవిందస్వామి,శ్యామ్ ప్రసాద్ రెడ్డి,దేవేంద్ర రెడ్డి,దీనయ్య,కోటి,తిరుపాల్, తిరుమల,చెంగయ్య,శేఖర్ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రగిరిలో రూ. 5 కోట్లతో అత్యాధునిక 'కైలాస ధామం' ఏర్పాటుకు ఎమ్మెల్యే పులివర్తి నాని శ్రీకారం..!

-దాత రామచంద్రా రెడ్డి సహకారంతో 2.30 ఎకరాల్లో 'కైలాస ధామం' నిర్మాణం..!

-ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రత్యేక చొరవపై సర్వత్రా హర్షం: వీరంగారి రమేష్ రెడ్డి.





ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి:

చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో సుమారు 2 ఎకరాల 30 సెంట్ల విస్తీర్ణంలో అత్యాధునిక 'కైలాస ధామం' (స్మశాన వాటిక) ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ మేరకు టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ వీరంగారి రమేష్ రెడ్డి వివరాలను వెల్లడించారు. ఒక సంఘటనతో మొదలైన ఆలోచన గతంలో టీడీపీ నాయకులు భాస్కర్, బన్నీలు ప్రమాదవశాత్తు మరణించినప్పుడు, వారి అంత్యక్రియలకు హాజరైన పులివర్తి నాని అక్కడి స్మశాన వాటిక దుస్థితిని చూసి చలించిపోయారు. కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్న ప్రజల కోసం ఒక అంతిమ యాత్ర వేదిక (కైలాస ధామం) నిర్మించాలని అప్పుడే నిర్ణయించుకున్నారు. సుమారు రూ. 5 కోట్లకు పైగా వ్యయంతో, ప్రభుత్వ సహకారంతో పాటు పలువురు దాతల భాగస్వామ్యంతో ఈ భారీ ప్రాజెక్టును చేపట్టారు. 2019లో ఓటమి ఎదురైనా అధైర్యపడకుండా ప్రజల్లోనే ఉండి, 2024లో ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కైలాస ధామంలో ఆహ్లాదకరమైన పార్కులు, స్నానపు గదులు, వేచి ఉండే గదులు మరియు అంత్యక్రియలకు అవసరమైన ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. "మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని" అనే వినూత్న కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ, ప్రజల సమస్యలను ఓపికగా విని, నేడు వాటి పరిష్కారం వైపు అడుగులు వేయడం జరిగిందని, నేడు ప్రజలు అడగకముందే వారి సమస్యలను గుర్తించి పరిష్కరించే నాయకుడిగా నాని గుర్తింపు పొందారని రమేష్ రెడ్డి కొనియాడారు. చంద్రగిరి పట్టణ అభివృద్ధి కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఈ పనులు త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి.

## చిత్తూరు డి ఆర్ డి ఏ పి డి శ్రీదేవి.



ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని చిత్తూర్ డి ఆర్ డి ఏ పి డి శ్రీదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా సమాఖ్య కార్యాలయంలో మహిళా దినోత్సవం ముందస్తు వేడుకల్లో భాగంగా జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అముద ఆధ్వర్యంలో సంఘ సభ్యులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందని వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీ శక్తి ముందు ఏ శక్తి పనిచేయదన్న విషయాన్ని ప్రతి ఒక్క మహిళా గుర్తించి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా సామాజికంగా బలోపేతం కావాలన్నారు. నేడు మహిళలు సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తూ అనేకమంది స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. కుటుంబంలో మహిళ సమర్థవంతంగా తన బాధ్యతను నెరవేరిస్తే ఆ కుటుంబ జీవన ప్రమాణం సాఫీగా సాగుతున్న విషయాన్ని ప్రతి ఒక్క మహిళ గుర్తించాలన్నారు. నేడు పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. కుటుంబం బాగుంటే సమాజం బాగుంటుంది అన్న విషయాన్ని ప్రతి మహిళ గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. విద్య సామాజిక రంగాలపై కూడా మహిళలు చురుకైన పాత్ర పోషించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా లోకానికి పిడి ముందస్తు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎం లు రవికుమార్, మంజుల, డిపిఎంలు సుబ్బారెడ్డి మధు, హేమ, పలువురు సంఘ సభ్యులు జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ ఉద్యోగులతో సమీక్ష సమావేశం


## ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి .

తిరుపతి గ్రేడ్ వన్ శాఖ గ్రంథాలయం నందు ఉదయం 10 గంటలకు చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అధ్యక్షతన రెడ్డి వారి గురవారెడ్డి .అధ్యక్షతన ఉమ్మడి జిల్లాలో ఉన్నటువంటి గ్రంథాలయ ఉద్యోగులు బిడిసి నిర్వాహకులతో ను సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి .మాట్లాడుతూ గ్రంథాలయాలను దేవాలయాలుగా చేసే విధంగా కృషి చేస్తూ పుస్తక పఠనం వైపు విద్యార్థులు పాఠకుల కు మానసిక ఉల్లాసంగా ఉండే విధంగా తీర్చిదిద్దే ఆలోచనతో పని చేద్దాం అన్నారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు . నాయకత్వంలో మరియు రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్ .సారధ్యంలో కూటమి ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధి చాలా లక్ష్యముతో పని చేస్తుందన్నారు . దానికి నిదర్శనమే ఇటీవల విద్య మంత్రి నారా లోకేష్ .అసెంబ్లీలో మాట్లాడుతూ గ్రంథాలయాలులో పిల్లల పుస్తక పఠనం వైపు మొగ్గు చూపాలని దానికి ఒక ఉదాహరణగా తన కుమారుడు దేవాన్ష్ .ప్రతిరోజు ఒక పుస్తకం ఒక రోజులో చదువుగలరని చెప్పారు మరి గ్రంథాలయాల పట్ల వారికి ఉన్నటువంటి చిత్తశుద్ధికి అది నిదర్శనం అన్నారు ఆ విధంగా గ్రంథాలయ సిబ్బంది పాఠకులు పెంపునకు కృషి చేయాలని అలాగే జిల్లాలో 71 గ్రంథాలయాల ద్వారా ఒక రోజుకు సుమారు 4000 మంది పాఠకలు వస్తున్నారు. ఈ సంఖ్యను ప్రత్యేక చొరవతో మీరు పెంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సెస్ వసూళ్లు ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరపాలక సంస్థ ద్వారా 22 కోట్ల 35 లక్షలు చిత్తూరు మున్సిపాలిటీ ద్వారా ఐదు కోట్ల 39 లక్షలు కాళహస్తి నగరపాలక సంస్థ ద్వారా ఒక కోటి 77 లక్షలు ఇలా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరపాలక సంస్థలు మరియు మున్సిపాలిటీలు నుండి దాదాపు 33 కోట్ల 87 లక్షల రూపాయలు ఉన్నాయని వీటిని గ్రంథాలయ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అధికారులను కలిసి వసూళ్లకు కృషి చేయాలని అలాగే చైర్మన్ గా ఉన్న మేము కూడా సంబంధ అధికారులను కలిసి చెస్ వసూళ్లకు కృషి చేస్తానని ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. వాటన్నింటిని ప్రభుత్వానికి తెలియపరచి వారిని ప్రోత్సహించే ఆలోచనలో ఉన్నాను అన్నారు ఆ విధంగా మీరంతా కూడా నిరంతరం పనిచేసే చెస్ వసూళ్ల మీద ప్రత్యేక దృష్టి పెట్టి మిగతా అన్ని కార్యక్రమాల్ని ముందుకు తీసుకుపోతూ మన గ్రంథాలయ సంస్థ కు మంచి పేరు తీసుకురావాలని కోరారు నెలవారి కార్యక్రమాలు పట్టిక ను గ్రంథాలయ ఉద్యోగులతో కలిసి చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి సెక్రటరీ ఆవిష్కరించారు అనంతరం గ్రంథాలయ ఉద్యోగులు, బీడీసీ నిర్వాహకులు చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డిని శాలువా పూలమాలతో సత్కరించారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురవా రెడ్డి .మరియు గ్రంథాలయ కార్యదర్శి ఆర్ వి ఆర్ ఎస్ ఎస్ శర్మ . జిల్లాలోని గ్రంథాలయ అధికారులు అలాగే బీడీసీ నిర్వాహకులు మరియు కార్యాలయ సిబ్బంది సుమారు 150 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఏపీ సీఎం కి కృతజ్ఞతలు తెలుపుతున్న 13 ఏళ్ల లోపు పిల్లల తల్లిదండ్రులు......



ప్రజా భూమి ప్రతినిధి అమరావతి.

ఆంధ్రప్రదేశ్‌లో 13 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా వినియోగంపై నిషేధం విధించనున్నట్లు సీఎం నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ప్రకటించారు. 90 రోజుల్లో ఈ నిర్ణయాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం తెలిపింది. అలాగే 16 ఏళ్ల లోపు ఉన్నవారిపై కూడా సోషల్ మీడియా నిషేధం విధించే అంశంపై ప్రభుత్వం ఆలోచన చేస్తోంది అని సీఎం తెలిపారు. పిల్లల మానసిక ఆరోగ్యం, చదువులు మరియు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

# ఎర్ర మట్టిని ఏదేచ్చుగా దోచేస్తున్న మాయగాళ్లు..... పట్టించుకోని అధికారులు

## గ్రావెల్ టిప్పర్లు ఆపి ధర్నాకు దిగిన ఇట్టయ్య పాలెం మహిళలు



ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.

హద్దు అదుపు లేకుండా గ్రావిల్ టిప్పర్లతో తరలిస్తున్న గ్రావిల్ లోడ్లు వల్ల రోడ్లు దెబ్బతిని ప్రజా ప్రయాణానికి ఇబ్బందిగా ఉందంటూ ఎర్ర మట్టి తరలిస్తున్న గ్రావిల్ తప్పర్లు ఆపి ధర్నాకు దిగిన మహిళలు వరదయ్యపాలెం మండలం బత్తుల వల్లం అడవి ప్రాంతంలో నుండి గ్రావెల్ నుతరలిస్తున్న టిప్పర్లను ఆపి ధర్నాకు దిగిన మహిళలు,అధికారుల అండదండలతో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతుందంటున్న మహిళలు వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

# శ్రీనివాస తేజా ఇంగ్లీష్ మీడియం పాఠశాలను తనిఖీ చేసిన ఎం ఈ వోలు

ప్రజాభూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బి. ఎన్ కండ్రిగ మండలంలోని శ్రీనివాస తేజా ఈఎం ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యం, శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహణ, విద్యార్థుల హాజరు నమోదు విధానం, పాఠశాల రికార్డుల నిర్వహణపై సమగ్రంగా పరిశీలించారు. తనిఖీలో భాగంగా పాఠశాలలోని విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, రిజిస్టర్‌లో నమోదైన వివరాలను ప్రత్యక్షంగా విద్యార్థుల హెడ్‌వైస్ కౌంట్‌తో సరిపోల్చి ధృవీకరించారు. విద్యార్థుల హాజరు నమోదు సక్రమంగా ఉండేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే పాఠశాలలో బోధన విధానం, తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు శాతం, రికార్డుల నిర్వహణ వంటి అంశాలపై కూడా ఎంఈవో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులు నిరంతరం పాఠశాలకు హాజరు కావడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా కృషి చేయాలని ఎంఈవోలు ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభూమి

వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య



శనివారం 07 మార్చి 2025

# ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలం

### -రాష్ట్రంలో కూటమిపాలన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా సాగుతోంది

### -నిలిచిపోయిన అభివృద్ధి పనులు ఎక్కడ జరగడం లేదు

### -ప్రజా సమస్యల పరిష్కార ధ్యేయమే వైకాపా లక్ష్యం-ప్రజా దర్బార్ లో ఎంపీ అవినాష్ రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల అంగన్వాడీలను ప్రభుత్వం వేధించడం మంచి పద్ధతి కాదని వారి సమస్యలను వెంటనే పరిష్క రించాలని, రాష్ట్రంలో కూటమిపాలన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా సాగుతోందని, నిలిచిపోయిన అభివృద్ధి పనులు ఇంతవరకు ఎక్కడ జరగలేదని, ఇచ్చిన హామీలు నెరవేర్చ డంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నివాసం ప్రాంగణంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్న రాష్ట్రంలో ఏమీ అభివృద్ధి జరగలేదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఇంతవరకు నెరవేర్చకపోవడం దారుణం అన్నారు . మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడం దారుణం అన్నారు. పేద మధ్యత రగతి విద్యార్థులకు విద్య దూరమవుతుందన్నారు. నిరుద్యోగ భృతి కోసం నిరుద్యోగులు ఎదురుచూ స్తు న్నారన్నారు. అంగన్వాడీ టీచర్లను ఆయాలను ప్రభుత్వం వేదించడం మానుకొని వారి సమస్యల ను పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అంతకు ముందుగా పులివెందులనియోజకవర్గం ప్రజలు ఇతర ప్రాంతాల ప్రజలు ఆయనను కలిసి వినతి పత్రాలను అందజేశారు. మరి కొంతమంది సమస్యలను ఆయనకు నేరుగా వివరించారు. ఆయన వారి సమస్యలను సావాదానంగా విని వారి సమస్యలను పరిష్కరింపజేసేందుకు కృషి చేస్తా అన్నారు. మరి కొంతమంది సమస్యలను అధికారులతో శరవాణిలో మాట్లాడి పరిష్కరింపజేశారు.

## నీటి కొరతతో అల్లాడుతున్న చక్రాయపేట మండల ప్రజలు

### -జడ్పిటిసి తాటిగుట్ల శివప్రసాద్ రెడ్డి



ప్రజాభూమి , చక్రాయపేట

చక్రాయపేట మండలంలోని ప్రజలు, రైతులు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండల జడ్పిటిసి తాటిగుట్ల శివప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని పాయలోపల్లె, వరికుంటపల్లె, సురభి, కుప్పగుట్టపల్లె, మహదేవపల్లె పంచాయతీ, సురభి పంచాయతీ, గంగారపు వాండ్ల పల్లి పంచాయతీ, కుప్పం పంచాయతీ, నర్సపల్లె



పంచాయతీ లలో నీటి సమస్య అధికంగా ఉందని తెలిపారు. ప్రజలు తాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వేసవి కాలం కావడంతో బోర్లలో నీటి మట్టం అడుగంటిం ది. దీంతో మామిడి, చీని చెట్లు నీళ్లు లేక ఎండిపోతున్నాయి . దీంతో రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. మామిడి చెట్లు, చీనీ చెట్లు తదితర పంటలను కాపాడుకోవడానికి రైతులు వేలకు వేలు ఖర్చు పెట్టి ట్యాంకర్ల ద్వారా నీటిని చెట్లకు తోలుకుంటున్నారు. మెగా కంపెనీ వారు మూడు సంవత్సరాలు అవుతున్నా మండలంలో నీటి సమస్యలు తీర్చలేకపోతున్నారని జడ్పిటిసి తెలిపారు. నీటి పైపులైను పనులు మందకొడిగా సాగడమే ఇందుకు కారణం అని అన్నారు. మెగా కంపెనీ వారు వెంటనే పనులు తొందరగా చేపట్టి మండలంలో తాగు నీటి సమస్య లేకుండా చూడాలని జడ్పిటిసి తెలిపారు. మండలంలోని కూటమి నాయకులు, మండల అధికారులు తాగునీటి సమస్య పైన దృష్టి సారించాలని అన్నారు. ఈ విషయం పై కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి దృష్టికి కూడా తీసుకుని వెళ్లానని జడ్పిటిసి తాటిగుట్ల శివప్రసాద్ రెడ్డి తెలిపారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు -ఆర్కే వ్యాలీ సీఐ శంకర్ రెడ్డి



ప్రజాభూమి, వేముల

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ సీఐ శంకర్ రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ శంకర్ రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలు భయభ్రాంతులకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో జీవించేలా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి రాజీ లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మట్కా, గుట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారెవరైనా సరే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, సమాజానికి ఉపయోగపడే విధంగా తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించి తమ ప్రాంతాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం అందిస్తే వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖకు ముఖ్య లక్ష్యమని, ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తామని సీఐ శంకర్ రెడ్డి తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సీఐ ఉలసయ్యను వీఆర్‌కు బదిలీ చేశారు.

## అంధులకు అన్నదానం



ప్రజాభూమి, పులివెందుల

పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలో ఉన్న వీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ వి సతీష్ కుమార్ రెడ్డి 58 వ పుట్టినరోజు సందర్భంగా పట్టణానికి చెందిన వైకాపా నాయకుడు పెనుగొండ (చిన్న) తరుణ్ ఆధ్వర్యంలో మాంసంతో కూడిన బిర్యాని, కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్ వి సతీష్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్యక్షు డు హాల్ గంగాధర్ రెడ్డి లు హాజరై కేకును కట్ చేసి వారికి పంపిణీ వేశారు. అనంతరం మాంసంతో కూడిన ఆహారాన్ని వారికి వడ్డించారు. ఈ సందర్భం గా చైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ సతీష్ రెడ్డి మంచి మనసున్న గొప్ప నాయకుడు అన్నారు. సతీష్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో మరెన్నో జరుపుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ హాఫీజ్ ,పద్మనాభ రెడ్డి, కలందర్, తదితర వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్వీ సతీష్ రెడ్డి జన్మదిన వేడుకలు

### పెద్దసంఖ్యలో పాల్గొన్న అభిమానులు



ప్రజాభూమి,పులివెందుల

మాజీ ఎమ్మెల్సీ,వైఎస్ఆర్సీపి రాష్ట ప్రధాన కార్యద ర్శి ఎస్వీ సతీష్ రెడ్డి 58 జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. శు క్రవారం ఆయన నివాస గృహంలో అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో సతీష్ రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన అభిమాను లు,రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జ్ కొంగనపల్లి విజయ్ కుమార్, వైకాపా జిల్లా యువజన విభాగ సభ్యుడు లక్ష్మిరెడ్డి, వైయస్సార్సీపి క్యాంపెయిన్ సెక్రటరీ దేవర శ్రీనివాసరెడ్డి, వైఎస్ఆర్సిపి యూత్ లీడర్ యాడికి బాబు, పూల మొక్కను సతీష్ కుమార్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సతీష్ కుమార్ రెడ్డి ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు వారు తెలిపారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యా లతో ఉండాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అభిమానులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవ సందర్భంగా అవగాహన సదస్సు

### - జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారిణి పి రమాదేవి

ప్రజా భూమి, కడప సిటీ :

జిల్లా మహిళా మరియు శిశు, సంక్షేమసాధికారిత అధికారిణి పి.రమాదేవి ఆదేశాల మేరకు వై.యస్.ఆర్. కడప జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా ఈ రోజు ఉక్కాయ పల్లెలో నర్సింగ్ కాలేజీ, ఫార్మ సీకాలేజీల్లో అవగాహన కార్య క్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సురక్షితమాతృ త్వం, పి ఓ సి ఎస్ ఓ చట్టం, బాల్య వివాహాల నివారణ,మ హిళల



హెల్ప్‌లైన్,చైల్డ్ హెల్ప్ లైన్,వన్ స్టాప్ సెంటర్ అందిశీ చేసేవలపై విద్యార్థులకు, ఉపా ధ్యాయులకు అవగాహన కల్ చబడింది. ఈ సందర్భంగా వ న్ స్టాప్ సెంటర్, వైయస్సార్ కడప జిల్లాకు చెందిన ఉమా దేవి లీగల్ కౌన్సిలర్, ఎస్ ఐ జ్యోతి మాట్లాడు తూ గర్భధా రణ,ప్రసవం,ప్రసవానంతర కాలంలో మహిళలకు నాణ్య మైన ఆరోగ్య సంరక్షణ కల్పిం చడం, పి ఎం ఎం వి వైకి అ ర్హులు ఎవరికి వర్తిస్తుంది విష యంపై అవగాహన కల్పించా రు. బాల్య వివాహాలు చట్టపర శీగా నేరమని,అలాంటి సంఘ టనలు గమనించిన వెంటనే సంబంధిత అధికారులకు లే దాహెల్ప్‌లైన్ నంబర్లకు సమా చారం ఇవ్వాలని సూచించా రు. మహిళలు,పిల్లలు అత్యవ సర పరిస్థితుల్లో హెల్ప్ లైన్ 1 81,1098 నెంబర్లను ఉపయో గించుకునేందుకు సేవలు అం దుబాటులో ఉన్నాయని తెలి పారు. హింసకు గురైన మహిళ లకు వన్ స్టాప్ సెంటర్ ద్వారా న్యాయ సహాయం,వైద్య సహా యం,కౌన్సెలింగ్, తాత్కాలిక ఆశ్రయం వంటి సేవలు అందిం చబడుతున్నాయని ఆమె వివ రించారు. ఈ కార్యక్రమం ద్వా రా విద్యార్థులకు మహిళల భ ద్రత,బాలలహక్కులుచట్టపరమైన రక్షణలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

## దిలీప్ మృతిపై హ్యూమన్ రైట్స్ ఫైర్... రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా విచారణ చేయాలి

### బాధిత కుటుంబానికి ప్రభుత్వం సహాయం చేయాలని విజ్ఞప్తి




ప్రజాభూమి పోరుమామిళ్ల :

కాశినాయన మండలం గంగన్నపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు కందుల దిలీప్ మృతి ఘటనపై ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ నాయకులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ పోరుమామిళ్ల చీఫ్ గంగన్న, సెక్రటరీ ఫణిరావు, జాయింట్ సెక్రటరీ సాగర్, ప్రెస్ సెక్రటరీ ప్రవీణ్ శుక్రవారం గంగన్నపల్లి గ్రామానికి వెళ్లి దిలీప్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు దిలీప్ తల్లి, అన్న మరియు బంధువులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం ఇది ఆత్మహత్య కాదని, ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు దిలీప్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించారని అనుమానం వ్యక్తం చేశారు. నేర స్థలాన్ని కూడా పరిశీలించిన హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు అక్కడ పరిస్థితులు చూస్తే దిలీప్ తనంతట తానే పెట్రోల్ పోసుకున్నట్లు కనిపించడం లేదని పేర్కొన్నారు. ఎవరో పెట్రోల్ చల్లి అగ్గి ముట్టించినట్లు అనిపిస్తోందని తెలిపారు. అగ్గిపెట్టిన తర్వాత తీవ్ర గాయాలతో దిలీప్ సమీపంలో ఉన్న కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్దకు పరుగెత్తుకుంటూ వెళ్లాడని సమాచారం. అక్కడ ఉన్న స్వామికి నాయనపల్లికి చెందిన వారు పెట్రోల్ పోసి నిప్పంటించారు అని చెప్పినట్లు తెలుస్తోంది. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో దిలీప్‌ను అంబులెన్స్‌లో పోరుమామిళ్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం కడపకు, అక్కడి నుంచి తిరుపతికి తరలిస్తుండగా దిలీప్ మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ నాయకులు, ఇది సాధారణ ఘటన కాదని, పెట్రోల్ పోసి హత్య చేసిన అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. రాజకీయ ఒత్తిడులకు లోనుకాకుండా పోలీసులు సమగ్రంగా విచారణ జరిపి నిజాన్ని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. దిలీప్ కుటుంబం అత్యంత పేదదని, తండ్రి లేకపోవడం, తల్లి పక్షవాతం వల్ల మాట్లాడలేని పరిస్థితిలో ఉండడం వల్ల కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని తెలిపారు. ప్రభుత్వం మరియు ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కూడా వారు కోరారు.

## ఓపెన్ హౌస్ తో విధ్యార్థులకు విజ్ఞానం

### - ఎస్సై.తిరుపాల్ నాయక్



ప్రజాభూమి, వేంపల్లె

ఓపెన్ హౌస్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందని ఎస్సై. తిరుపాల్ నాయక్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ లో విధ్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలిస్ అమరవీరుల త్యాగాలు, పోలిసుల విధులు, ఎదురయ్యే సవాళ్లు, ఆయుధాలు, పనితీరు, షీ టిమ్, సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నియమాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ విధ్యార్థులు చదువుతో పాటు సామాజిక సమస్యలు, శాంతి భద్రతల నిర్వహణలో పోలీసుల పాత్రపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ నందీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

### - శాలువతో ఘనంగా సత్కారం



ప్రజాభూమి, వేంపల్లె

మండలంలోని నందిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ నందీశ్వరుడి ఆలయంలో వైఎస్ఆర్సీపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ. సతీష్ కుమార్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు సతీష్ రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువ కప్పి సత్కరించారు. అలాగే నంది కాంస్య విగ్రహాన్ని బహుకరించారు. ఆ భగవంతున్ని కృప అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ సులోచనమ్మ, పులివెందుల మున్సిపల్ పురపాలక చైర్మన్ వరప్రసాద్, గండి దేవస్థానం మాజీ చైర్మన్ కృష్ణతేజ, నాయకులు గంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీదుర్గమ్మ ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు

### - ఆలయ వ్యవస్థాపకుడు ఎమ్.రవికుమార్ రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక శ్రీసాయి నగర్ కాలనీలో వెలసిన నూతన శ్రీ దుర్గమ్మ ఆలయం విగ్రహా ప్రతిష్ట మహోత్సవాలు భక్తీ శ్రద్ధలతో ప్రారంభమైనట్లు ఆలయ వ్యవస్థాపకుడు, జడ్పీటీసీ సభ్యుడు ఎమ్.రవికుమార్ రెడ్డి వెల్లడించారు. ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు మహోత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం అర్చకుల నైతృత్వంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మొదటి రోజు బంధనం, దీక్షాహోమం తదితర విశేష పూజలు, రెండో రోజు దుర్గమ్మ మూల విరాట్, ఉత్సవ మూర్తి గ్రామోత్సవం, చివరి రోజు శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి, అమ్మవార్ల శాంతి కళ్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు ప్రతిష్ట మహోత్సవాల్లో పాల్గొని దుర్గమ్మ కృపకు పాత్రులు కావాలని ఆలయ వ్యవస్థాపకుడు ఎమ్.రవికుమార్ రెడ్డి కోరారు.

## బంగారుపేట వద్ద అదుపుతప్పిన లారీ

### రామాలయం, స్కూల్ వ్యాన్ క్రాష్! ఒకరికి గాయాలు



ప్రజాభూమి, సిద్ధవటం: కడప-చెన్నై జాతీయ రహదారిపై సిద్ధవటం మండలం మాధవరం-1 పంచాయతీ పరిధిలోని బంగారుపేట వద్ద శుక్రవారం ఘోర ప్రమాదం తప్పింది. కడప నుండి తిరుపతి వైపు అతివేగంగా వెళ్తున్న లారీ నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనే ఉన్న రామాలయాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ సమయంలో ఆలయం వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వెంకటయ్య అనే వ్యక్తిపై రాళ్లు పడటంతో ఆయనకు గాయాలయ్యాయి. అదే వేగంతో లారీ సమీపంలోని ఓ ప్రైవేట్ స్కూల్ వ్యాన్‌ను కూడా ఢీకొట్టింది. ప్రమాద సమయంలో వ్యాన్‌లో ఉన్న విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అగ్నిప్రమాదంలో దగ్ధమైన అరటిపంట

### రైతు ఆవేదన



ప్రజాభూమి,పులివెందుల టౌన్

పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డి పల్లె గ్రామ సమీపాన శివ వైన్ షాప్ సమీపంలో ఉన్న అరటి తోటలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన చోటు చేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు ఎగిశాయి. మంటలను చూసిన స్థానికులు గమనించి వెంటనే మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించగా ఫలితం లేక, వెంటనే ఫైర్ సిబ్బందికి శరవాణి ద్వారా సమాచారాన్ని అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న పై అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకొని మంటలు అదుపు చేశారు. వారు అదుపు చేసే సమయానికి సుమారు నష్టం వాటిలినట్లు తెలిపారు. వివరాలు లోకి వెళితే నల్లపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు రాజారెడ్డి కి చెందిన అరటి తోటలో సుమారు 4 వేల అరటి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయని, ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో తోట మొత్తం దగ్ధమైంది. దీంతో రైతుకు భారీ నష్టం వాటిల్లినట్లు రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తనకు జరిగిన నష్టంపై ప్రభుత్వం, అధికారులు స్పందించి సహాయం అందించాలని కోరారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల టౌన్

పులివెందుల పట్టణంలోని కదిరి రోడ్డు సమీపంలో ఉన్న ఎస్ సి ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో సింహాద్రిపు రం వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వెన్నుపూస రామ్మోహన్ రెడ్డి, సింహాద్రిపురం ఇన్చార్జి సర్పంచ్ పద్మజ ల కుమార్తె రేణుక రెడ్డి, రాహుల్ రెడ్డి ల వివాహ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకలకు శుక్రవారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వైఎస్ఆర్సిపి పంచా యతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డిలు హాజరై నూతన వధూవరులను నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో జీవించాలని ఆశీర్వదించారు.

## ముస్లింలకు టిడిపి ఇఫ్తార్ విందు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ముస్లింల పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ సహకారంతో పట్టణంలోని అల్ హిలాల్ పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉపవాసం విరమించి ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై రంజాన్ మాసం శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తరఫున ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, బాలాజీ మాట్లాడుతూ, రంజాన్ మాసం ఆధ్యాత్మికత, సేవా భావాన్ని పెంపొందించే పవిత్ర కాలమన్నారు. ప్రతి ఒక్కరూ సౌభ్రాతృత్వంతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ముస్లిం మత పెద్దలు, పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అడపా దుర్గా ప్రసాద్‌కు పిహెచ్.డి. అవార్డు



**ప్రజాభూమి ప్రతినిధి – రాజానగరం**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్మెంట్ ఆఫ్ జియో సైన్సెస్ నుండి అడపా దుర్గాప్రసాద్ పిహెచ్.డి. అవార్డును అందుకున్నారు. దుర్గాప్రసాద్ కు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కె.వి. స్వామి అవార్డు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన తెలియజేస్తూ "పశ్చిమ భారతదేశంలోని కచ్‌లోని మిలియోలైట్ నిక్షేపాల నుండి లేట్ క్వాటర్నరీ పాలివో ఎన్విరాన్మెంట్ చిక్కులు అనే తన థీసిస్ పై పరిశోధన పూర్తి చేశారని చెప్పారు. ఎక్స్ట్రా మ్యూరల్ కేటగిరిలో ఫుల్ టైం పిహెచ్.డి. చేశారని, గైడ్స్ గా గుజరాత్ లోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ సీస్మోలాజికల్ రీసెర్చ్ డాక్టర్ ఫల్గుణి భట్టాచార్య, ఆదికవి నన్నయ యూనివర్సిటీ జియో సైన్సెస్ ప్రొఫెసర్ వై శ్రీనివాసరావు మార్గ నిర్దేశం చేశారని చెప్పారు. విభాగ అధ్యాపకులు దుర్గాప్రసాద్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఇంద్రకీలాద్రిపై కుంభాభిషేక మహోత్సవాలు

## భక్తుల సౌకర్యార్థం కట్టుదిట్టమైన ఏర్పాట్లు; దేవస్థానం సేవలకు భక్తుల హర్షం



**ప్రజాభూమి ప్రతినిధి – విజయవాడ**

ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్న కుంభాభిషేక మహోత్సవాల నేపథ్యంలో, రాష్ట్రం నలుమూలల నుండి వస్తున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లు సత్ఫలితాలను ఇస్తున్నాయి. క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు కనీస ఇబ్బంది కలగకుండా తీసుకున్న చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

**తాగునీరు, పారిశుద్ధ్యం:** నగరపాలక సంస్థ సహకారంతో భక్తుల దాహార్తిని తీర్చేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. లో-బ్రిడ్జి నుండి ప్రారంభించి ప్రధాన దేవస్థానం వరకు ప్రతి 100 మీటర్లకు ఒక తాగునీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనివల్ల భక్తులు ఎక్కడా ఇబ్బంది పడకుండా స్వచ్ఛమైన మంచినీటిని పొందుతున్నారు.

**11 ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు:** ఎండ తీవ్రత దృష్ట్యా భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఈ క్రింది 11 కీలక ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలను, వైద్య నిపుణులతో అందుబాటులో ఉంచారు.

**సీతమ్మ వారి పాదాలు, దుర్గా ఘాట్, ఘాట్ రోడ్:** ప్రధాన ఆలయ పరిసరాలు, మహా మండపం, శివాలయం మరియు ఇతర రద్దీ ప్రాంతాలు. వేసవి వేడి నుండి ఉపశమనం – – పంపిణీ కార్యక్రమాలు: ఉదయం 10 గంటల నుండి ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో, క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు నిరంతరాయంగా మజ్జిగ మరియు బిస్కట్ ప్యాకెట్ల పంపిణీ జరుగుతోంది. ప్రత్యేకించి చంటి బిడ్డలకు మరియు వృద్ధులకు పాలు పంపిణీ చేస్తూ సాయంత్రం వరకు కొనసాగించారు. అన్న ప్రసాద విభాగం ద్వారా భక్తులందరికీ రుచికరమైన అన్న ప్రసాదం వితరణ నిరంతరం కొనసాగుతోంది.

**క్యూ లైన్లలో నీడ సౌకర్యం (షామియానాలు):** భక్తులకు ఎండ తగలకుండా ఉండేందుకు కనకదుర్గ నగర్ ఎంట్రన్స్ నుండి మహా మండపం వరకు, అలాగే ఘాట్ రోడ్ ఎంట్రన్స్ నుండి ప్రోటోకాల్ ఆఫీస్ వరకు క్యూ లైన్ల పొడవునా పటిష్టమైన షామియానాలు/టెంట్లు ఏర్పాటు చేశారు. దీనివల్ల భక్తులు ఎండ వేడి నుండి ఉపశమనం పొందుతున్నారు.

**సామాన్య భక్తులకు పెద్దపీట -- ఉచిత దర్శనం:** భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని రకాల దర్శన టిక్కెట్లను రద్దు చేసి, భక్తులందరికీ శ్రీ అమ్మవారి ఉచిత దర్శనాన్ని కల్పిస్తున్నారు. క్యూ లైన్లు త్వరగా కదిలేందుకు వీలుగా అంతరాలయ దర్శనాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేయడం జరిగింది.

**క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ:** ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వాహణాధికారి (జూ) వి.కె. శీనానాయక్ స్వయంగా కనకదుర్గ నగర్ వైపు ఉన్న క్యూ లైన్లలో పర్యటించారు. భక్తులతో నేరుగా మాట్లాడి అందుతున్న సౌకర్యాలపై వారి సంతృప్తిని అడిగి తెలుసుకున్నారు. వాలంటీర్స్‌కు ఈవో శీనా నాయక్ దిశా నిర్దేశం చేశారు. కమాండ్ కంట్రోల్ రూమ్: మోడల్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి, సీసీటీవీల ద్వారా భక్తుల కదలికలను పరిశీలించారు. పోలీస్ శాఖతో సమన్వయం: అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ దుర్గారావు గారితో చర్చించి, భద్రత మరియు క్యూ లైన్ల క్రమబద్ధీకరణపై ఆదేశాలు జారీ చేశారు. అమ్మవారి సన్నిధిలో వివాహాలు చేసుకున్న నూతన దంపతులతో చైర్మన్ మరియు ఈవో మాట్లాడి, వారికి ప్రత్యేకంగా దర్శన ఏర్పాట్లు చేయించి ఆశీస్సులు అందజేశారు.

# కత్తిపూడిలో నూతన ఫంక్షన్ హాల్‌కి ముద్రగడ శంకుస్థాపన



**ప్రజాభూమి ప్రతినిధి – శంఖవరం**

కత్తిపూడిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి అడపా సోమేష్ నూతన ఫంక్షన్ హాల్ శంకుస్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి. శాస్త్రోక్తంగా జరిగిన భూమి పూజలో పాల్గొని గారు, శంకుస్థాపనలో నవధాన్యాలు వేశారు అనంతరం అడపా సోమేష్ ని ఆశీర్వదించి, వారి వ్యాపార రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శంకవరం మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరాల శ్రీనివాస్ యాదవ్ ,స్థానిక నాయకులు, కార్యకర్తలు, వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు సేవలందించడంలో ఎంతో ఆనందం : హసీంబేగ్



**ప్రజాభూమి ప్రతినిధి – మచిలీపట్నం**

దివ్యాంగులకు సేవలందించడంలో ఎంతో ఆనందం ఉంటుందని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ డా. హసీంబేగ్ అన్నారు. ఇంగ్లీషు పాలెంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం దివ్యాంగులకు నిత్యవసర వస్తువులు అందించారు. ఈ సందర్భంగా హసీంబేగ్ మాట్లాడుతూ మచిలీపట్నంలో పేద విద్యార్థులకు సాయం అందిస్తున్నామన్నారు. మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులను ఆదుకునేందుకు రూ 50 లక్షల విద్యానిధిని ఏర్పరిచామన్నారు. ఇందులో భాగంగా విద్యా నిధి జిల్లా కన్వీనర్ శ్రీరామ్ ఆధ్వర్యంలో మచిలీపట్నం శాఖ నుంచి నాలుగు లక్షల అందజేశామన్నారు. సంస్థ అధ్యక్షుడు జి కిషోర్ కుమార్ మాట్లాడుతూ, పదవ తరగతి విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా 140 శాఖల ఆధ్వర్యంలో 60 వేల మందికి విజయీభవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్ ముదిగొండ శాస్త్రి, జకావుల్లా తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మ పరిరక్షణలో బ్రాహ్మణుల పాత్ర కీలకం

### డాక్టర్ బృందావనం ధన్వంతరి ఆచార్య



**ప్రజాభూమి ప్రతినిధి – మచిలీపట్నం**

హిందూ ధర్మ పరిరక్షణలో బ్రాహ్మణులందరూ ఐక్యంగా ఉంటూ, సమాజంలోని ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని ప్రముఖ వైద్యులు, బ్రాహ్మణ సేవా సంఘం సీనియర్ నాయకులు డాక్టర్ బృందావనం ధన్వంతరి ఆచార్య పిలుపునిచ్చారు. శుక్రవారం సంకష్ట హర చతుర్థిని పురస్కరించుకుని బుట్టాయి పేటలోని శ్రీ చిట్టి పిళ్ళారయ్య స్వామి దేవాలయంలో లోక సంక్షేమం కోరుతూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి. ఫణి కుమార్ దంపతులు శాస్త్రోక్తంగా అభిషేకాలు, అర్చనలు మరియు శ్రీ లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు.

ముఖ్య అంశాలు:

సమాజ సేవలో ముందుండాలి: బ్రాహ్మణులు ఆధ్యాత్మిక కార్యకలాపాలతో పాటు సమాజ సేవలోనూ చురుగ్గా పాల్గొనాలని డాక్టర్ ధన్వంతరి ఆచార్య పేర్కొన్నారు.

**సంస్కృతిని కాపాడుకుందాం:** బ్రాహ్మణ పిల్లలకు ఉచితంగా సంధ్యావందనం నేర్పిస్తు న్నామని, భావి తరాలకు మన సంప్రదాయా లను అందించే బాధ్యత తల్లిదండ్రులపై ఉందని విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ తెలిపారు.

**ప్రభుత్వ సహకారం:** కూటమి ప్రభుత్వం దేవాలయ కమిటీలలో బ్రాహ్మణులకు ప్రాధా న్యత కల్పిస్తోందని, బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని పి.వి. ఫణి కుమార్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు మోపర్తి సుబ్రహ్మణ్యం, కానుకొ లను ఫణి కిరణ్ శర్మ, సింగరాజు గోవర్ధన్, వడ్లమన్నాటి మారుతి దివాకర్, జమ్మలమడక సేతురామయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

# గోవాలో గవర్నరును కలిసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

- గవర్నర్ అశోక్ గజపతి రాజుతో ఆత్మీయ కలయిక
- లోక్ భవన్, 500ఏళ్ల క్రితం నాటి పోర్చుగీసు చర్చి సందర్శన



**ప్రజాభూమి ప్రతినిధి – అవనిగడ్డ**

గోవా పర్యటనలో ఉన్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం లోక్ భవన్ సందర్శిం చారు. గోవా రాష్ట్ర గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజును ఎమ్మె ల్యే బుద్ధప్రసాద్- విజయలక్ష్మి దంపతులు, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్- సాయి సుప్రియ దంప తులు కలిశారు. లోక్ భవన్ ప్రాంగణంలోని 500ఏళ్ల క్రితం నాటి పోర్చుగీసు చర్చిని గవర్నర్ అశోక్ గజపతి రాజుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ అశోక్ గజపతి రాజు ఆదర్శ రాజకీయ వేత్త, సౌజన్యమూర్తి అన్నారు. రాజ వంశీకుడైనా ఎంతో నిరాడంబరంగా ఉంటారన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండటం నేర్చుకోవాలన్నారు. కోరుకొండ సైనిక్ స్కూల్ ఏర్పాటుకు తమ సుందరమైన కోటను దానం చేసిన అశోక గజపతిరాజు దాతృత్వం గొప్పది అన్నారు. వారి కుటుంబం చేసిన దానధర్మాలు మరే ఇతర మహారాజులు చేసి ఉండరన్నారు. కానీ వారు ఎప్పుడూ చెప్పుకోరని తెలిపారు. రాజులైన సమ సమాజం రావాలని తాపత్రయపడే వారని, వారు సోషలిస్టు పార్టీకి నాయకత్వం వహించారని తెలిపారు. అశోక్ గజపతి రాజు కూడా అదే దృక్పథం కలిగి ఉంటారని తెలిపారు. అటువంటి గొప్ప నిష్కళంక నాయకుడిని కలిసే అవకాశం సంతోషదాయకం అన్నారు. ప్రస్తుత రాష్ట్ర రాజకీయాలలో అశోక్ గజపతిరాజు అరుదైన వ్యక్తి అని, వారి నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందన్నారు.

# డ్రగ్స్ ఎవేక్ నేస్ లో భాగంగా యుద్ధం మొదలైంది అనే కార్యక్రమానికి తల పెట్టిన విద్యార్థులు




**ప్రజాభూమి ప్రతినిధి – మచిలీపట్నం**

చిలకలపూడి నగరపాలక ఉన్నంత పాఠశాల నందు డ్రగ్స్ ఎవేక్ నాస్‌లో భాగంగా "యుద్ధం మొదలైంది" అనే కార్యక్రమాన్ని నిర్వహించారు సమాజంలో డ్రగ్స్ పట్ల అవగాహనా కల్పించడానికి పాఠశాల విద్యార్థులతో గొప్ప బహిరంగ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. వెంకటేశ్వరావు మరియు ప్రధానోపాధ్యాయులు సోషల్ వర్కర్ ఆకూరి శ్వేతా ఈగల్ టీమ్. సిబ్బంది మరియు శక్తి టీమ్. సిబ్బంది పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి.. సాధికారతకు బలమైన పునాది

## ఆదాయ వనరు మాత్రమే కాదు ఆత్మవిశ్వాసానికి మార్గం కూడా : కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**ప్రజాభూమి ప్రతినిధి – విజయవాడ**

మహిళలు స్వయం ఉపాధి రంగంలో ముందడుగు వేస్తే కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా బలమైన పునాది ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఇబ్రహీం పట్నం మండలం, కిలేశపురంలో పి.ఉమ అనే మహిళ .. పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ స్కీమ్ (పీఎంఎఫ్ఎంఈ) పథకం చేయూతతో ఇప్పటికే ఒక ఎద్దు గాను గ యూనిట్‌ను ప్రారంభించగా మరో యూని ట్‌ను కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మహిళ ఆర్థికంగా స్వావలంబన సాధిస్తే ఒక కుటుంబం బలపడుతుంది; మహిళల సమూహం ముందుకు వస్తే సమాజం బల పడుతుంది.. అని తెలిపారు. స్వయం ఉపాధి మహిళలకు కేవలం ఆదాయ వనరు మాత్రమే కాదు, ఆత్మవిశ్వాసం, గౌరవాన్ని ఇచ్చే మార్గం అని పేర్కొన్నారు. మహిళలను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి ప్రభు త్వం అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా మహిళలకు శిక్షణ, రుణ సదుపాయాలు, మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాలను వినియోగించు కుని మహిళలు చిన్న వ్యాపారాలు, హస్తక ళలు, ఆహార పదార్థాల తయారీ, సేవా రంగా లలో అడుగుపెట్టి తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు.కార్యక్రమం అనంతరం కలెక్టర్ లక్ష్మీశ.. నీతి ఆయోగ్ అధికారి రాధికా ములేతో కలిసి జూపూడిలో పర్యటించారు. స్థానిక కార్యాలయం ద్వారా ప్రజలకు అందు తున్న సేవలను వివరించారు. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో అమలవుతున్న ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం – సంపూర్ణత అభియాన్ 2.0 కార్యక్రమంలో భాగంగా రాధికా ములే జిల్లాలో పర్యటిస్తున్నారు. ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు ఆకాంక్షిత మండలాల్లో వివిధ ప్రగతి సూచికల్లో పురోగతిని పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్ డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో ఇంటి పన్నులు చెల్లించని వారికి పంచాయితీ సేవలు నిలుపుదల చేస్తాం

## కలెక్టర్ కీర్తి చేకూరి హెచ్చరిక




**ప్రజాభూమి ప్రతినిధి – రాజమహేంద్రవరం**

జిల్లాలోని గ్రామాలలో ఇంటి పన్నులు, ఇతర పన్నులు సకాలంలో చెల్లించి గ్రామ పంచాయితీలకు సహకరించాలని కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసారు. జిల్లాలోని 342 గ్రామ పంచాయితీలలో 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు, ఇతర పన్నులు మరియు గత సంవత్సరాల బకాయిలతో కలిపి మొత్తం రూ.126.71 కోట్లు రూపాయలు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.64.07 కోట్లు మాత్రమే వసూలు చేయడం జరిగిందన్నారు. ఇంకా రూ.62.86 కోట్లు వసూలు చేయాల్సి ఉన్నందున ప్రజలు మిగిలిన ఇంటి పన్నులు, ఇతర పన్నుల మొత్తాన్ని వెంటనే చెల్లించాలని సూచించారు. ప్రస్తుతం ప్రజలు తమకు అనుకూలమైన ప్రదేశం నుంచే మొబైల్ ఫోన్ ద్వారా https://swarnapanchayat.apcfss.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి పన్నులు నేరుగా చెల్లించవచ్చున్నారు.నిర్ణీత గడువులోగా పన్నులు చెల్లించని పక్షంలో నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. దీనిలో భాగంగా గ్రామ పంచాయితీ అందించే పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, వీధిదీపాల నిర్వహణ, గ్రామ పంచాయితీ జారీ చేసే ధృవపత్రాలు మరియు ఇతర సేవలను నిలిపివేయడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. అందువల్ల ప్రజలందరూ సకాలంలో అన్ని రకాల పన్నులు, పన్నేతర బకాయిలతో సహా చెల్లించి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కీర్తి చేకూరి పిలుపు నిచ్చారు.

# మానసిక రోగులకు వైద్యులు మేలైన సేవలు అందించాలి

### తూర్పుగోదావరి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్ శ్రీలక్ష్మి



**ప్రజాభూమి ప్రతినిధి – రాజమహేంద్రవరం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్. శ్రీలక్ష్మి రాజమ హేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి లోని మానసిక చికిత్స విభాగంలో చికిత్స పొందుతున్న రోగుల వివరాలు, వారికి అందుతున్న వైద్య సదుపాయాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మానసిక రుగ్మతల నుండి పూర్తిగా కోలుకున్న వారిని తిరిగి వారి కుటుంబ సభ్యులతో కలిపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పూర్తి సహకారం అందిస్తామని శ్రీలక్ష్మి తెలిపారు. అనంతరం మానసిక చికిత్స విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు మరియు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఆసుపత్రి అందిస్తున్న సదుపాయాలు, వైద్యులు అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్న కార్యదర్శి, వైద్యుల సూచనలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే రోగులు త్వరగా కోలుకునే అవకాశముందని పేర్కొన్నారు.

# అవనిగడ్డ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 'ప్రజాదర్బార్'

### ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు



**ప్రజాభూమి ప్రతినిధి – అవనిగడ్డ**

అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'ప్రజాదర్బార్' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి ప్రజల నుంచి దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు స్వయంగా అర్జీలను స్వీకరించారు.ఉదయం నుంచి కార్యాలయానికి వచ్చిన వృద్ధులు, మహిళలు, రైతులు తమ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు.ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొల్లూరి బసవేశ్వరరావు,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మండలి రామమోహనరావు, అవనిగడ్డ క్లస్టర్ ఇంచార్జ్ బండే రాఘవ, అశ్వరావుపాలెం నీటి సంఘాల అధ్యక్షులు దాసినేని శ్రీనివాసరావు పార్టీ నాయకులు నాగిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

జనరల్ 13

శనివారం 7, మార్చి 2026


## బాలికల మనోధైర్యానికి 'స్వచ్ఛ స్వేచ్ఛ - బాలికా జాగృతి' అద్దం





ప్రజాభూమి ప్రతినిధి–విజయవాడ

కస్తూరిబాయిపేట సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ముగింపు క కస్తూరిబాయి పేటలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం నందు 'పాత్ మోటివేషన్ సెంటర్' ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'స్వచ్ఛ స్వేచ్ఛ - బాలికా జాగృతి' అవగాహన కార్యక్రమం శుక్రవారం ఘనంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బాలికల వసతి గృహాల్లో విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాత్ మోటివేషన్ సెంటర్ ఎండి (వీ.ఐ) ఎన్. సామేష్ మాట్లాడుతూ, కౌమార దశలో బాలికలు ఆందోళన చెందకుండా, మనోధైర్యంతో ఉండాలని సూచించారు. ముఖ్యంగా నెలసరి (వీవఅర్తీబ్ఖ్అశీఅ) సమయంలో పాటించవలసిన శాస్త్రీయ విధానాలు, వ్యక్తిగత పరిశుభ్రత మరియు పౌష్టికాహారం ప్రాముఖ్యతను విద్యార్థినులకు వివరించారు. సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. లావణ్య వేణి, మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. విద్యార్థినుల భద్రత మరియు ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఇటువంటి మోటివేషన్ క్లాసులు వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎస్.డబ్ల్యూ.ఓ వి.ఎస్.ఎస్. గణేష్, వసతి గృహ సంక్షేమ అధికారిణి (ఎబొ) కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మోటివేటర్లు, వసతి గృహ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## చెరుకు గడల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన వినాయకుడు

ప్రజాభూమి ప్రతినిధి–జగ్గయ్యపేట



చెరుకు గడలతో విశేష అలంకరణలో గణనాథుడు భక్తులకు దర్శనమిచ్చారు. సంకటహర చతుర్థి సందర్భంగా రేణుకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలోని గణపతి ఉపలయంలో వినా యకునికి పంచామృత అభిషేకాలను అర్చకులు మిస్సుల సతీష్ శంకర శర్మ నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రాలతో తీర్చిదిద్దారు. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన చెరుకు గడలతో విశేషంగా అలంకరణ చేసి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఏలేశ్వరం మండలంలో మొక్కజొన్న పంట పై ఆకు వ్యాధి సోకి ఉంది

### –సస్యరక్షణకై వ్యవసాయ అధికారి సూచనలు

ప్రజా భూమి ప్రతినిధి–ఏలేశ్వరం



ఏలేశ్వరం మండలంలో ఎర్రవరం, పెద్దనపల్లి, సిరిపురం, మర్రివీడు గ్రామాలలో 1307 ఎకరా లలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. మండల వ్యవసాయ అధికారి, ఏ. వి. రాజేష్ మొక్కజొన్న పంటలో టార్సీకం లీఫ్ బ్లైట్ తెగులు ఉందని గుర్తించడం జరిగింది. మొక్కజొన్నలో టర్సికమ్ లీఫ్ బ్లైట్ (టీ ఎల్ బి ), ఎక్సెరోహిలమ్ టర్సికమ్ (గతంలో హెల్మిన్థోస్పోరియం టర్సికమ్) అనే ఫంగస్ వల్ల వస్తుంది , ఇది విస్తృతంగా వ్యాపించే ఒక ప్రధాన ఆకుల వ్యాధి. ఇది కిరణజన్య సంయోగక్రియ సామర్థ్యాన్ని తగ్గించడం ద్వారా గణనీయమైన దిగుబడి నష్టాలను (25–90 శాతం) కలిగిస్తుంది. పొడవైన, దీర్ఘవృత్తాకార, టాన్ లేదా బూడిద రంగు సిగార్–ఆకారపు గాయాల ద్వారా వర్గీకరించబడిన ఈ వ్యాధి చల్లని, తేమ మరియు తడి పరిస్థితులలో వృద్ధి చెందుతుంది. లక్షణాలు ఈ విధంగా ఉంటాయి అని తెలిపారు. దిగువ ఆకులపై చిన్న, నీటిలో నానబెట్టిన మచ్చలుగా ప్రారంభమై, 2.5--15 సెం.మీ. పొడవు, నెక్రోటిక్, దీర్ఘవృత్తాకార, బూడిద–ఆకుపచ్చ లేదా లేత గోధుమ రంగు గాయాలుగా అభివృద్ధి చెందుతుంది. తీవ్రమైన సందర్భాల్లో ఇది ఆకులను కాలిపోయేలా చేస్తుంది. వెచ్చని, తేమతో కూడిన వాతావరణంలో, మంచు లోను ఈ తెగులు సిలింద్రాలు గాలిలో ప్రయాణించి మొక్క జొన్న ఆకులు పై తెగులు లక్షణాలును కలుగచేస్తాయి. రైతులు అప్రమత్తమై ఈ తెగులు నియంత్రణకు అజాక్సి స్ట్రోబిన్‌ండిఫెంకనాజోలు ( అమిస్టేటర్ టాప్) 1మిలిలీటర్ ఒక లీటర్ నీటికి పిచికారీ చేయాలి, అమిస్టర్ టాప్ పిచీకారీ చేసిన 15 రోజులకు టేబుకానాజోలుం ట్రయ్ ఫాలక్సీ స్ట్రోబిన్ ( నెటివో) అనే తెగులు నియంత్రణ మందు ను 0.4 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పేచీకారీ చేయాలని తెలిపారు.

## మైనార్టీ ప్రభుత్వ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు.



ప్రజా భూమి ప్రతినిధి–చింతూరు

ముస్లిం మైనార్టీ ప్రభుత్వ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పడిన పోలవరం జిల్లా చింతూరు మండల కేంద్రంలోని యాసీన్ మసీదులో శుక్రవారం ముస్లిం సహోదరులకు రంజాన్ రోజా ఇస్తారు విందును ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా ఎంతో పవిత్రంగా నెల రోజులపాటు ముస్లిం సహోదరులు రోజా ఉపవాస దినములను పాటిస్తూ కఠోర నియమాలను నిర్వహిస్తూ మానసిక శారీరక రుగ్మతల నుండి విముక్తి కోరుతూ జరుపుకుంటున్న ఉపవాసా దీక్ష పరులకు ప్రభుత్వం ద్వారా ఉపవాస ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం పట్ల చింతూరు యాసిన్ మసీద్ కమిటీ ఎండి జిక్రియ, షేక్ దస్తగీర్, సయ్యద్ కిఫాయత్ తుల్లా, ఇమామ్ సాహెబ్ ఇజాజ్ అహ్మద్, హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కమిటీ వారికి డిస్టిక్ మైనార్టీ వెల్ఫేర్ పోలవరం జిల్లా ఇన్చార్జ్ హెచ్ వి ఎస్ మూర్తి, శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో త్రినాథ్, ప్రభాకర్ రావు సెట్విన్ సీఈవో మరియు గ్రామ పెద్దలు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు మహమ్మద్ జమాల్ ఖాన్, ఎండి జహంగీర్, షహన్నా, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పెన బాధితుల ఆకలి తీర్చిన ఆర్త జన బంధువు కృష్ణారావు

- కృష్ణారావుకు రజక సంఘ ఆధ్వర్యంలో ఘన నివాళి
- ఘనంగా మండలి వెంకట కృష్ణారావు శత జయంతి

ప్రజా భూమి ప్రతినిధి–అవనిగడ్డ

వేలాది మంది ఉప్పెన బాధితుల ఆకలి తీర్చిన ఆర్త జన బంధువు ఎంవీ కృష్ణారావు అని ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, ప్రపంచ తెలుగు మహాసభల నిర్వాహకులు స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం అవనిగడ్డ వంతెన సెంటరులో కృష్ణారావు విగ్రహానికి అవనిగడ్డ రజక సంఘ ప్రతినిధులు పులిగడ్డ బాబూరావు, హనుమంతు కృష్ణ, పరశురామయ్య, గోపికృష్ణ, వెంకటతేజ, శివపార్వతి, సీతారామయ్య, తలగడదీవి రామకృష్ణ, పోతార్లంక రాము, వేకనూరు హరిబాబు, కృష్ణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం కమిటీల ప్రతినిధులు, మండలి అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణు గోపాల్, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, నీటి సంఘాల అధ్యక్షులు రేపల్లె రవీంద్ర, చుండూరు నాగేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది బొప్పన వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్లు యలవర్తి చిన్నా, మాదివాడ రత్నారావు, యర్రంశెట్టి సుబ్బారావు, గాంధీ క్షేత్రం ప్రధాన కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, శివాలయం చైర్మన్ ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య), గాంధేయవాది గరికపాటి సీతారామయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, టీడీపీ టౌన్ అధ్యక్షులు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, కూటమి నాయకులు బండే రాఘవ, కూరాకుల శివప్రసాద్, బచ్చు శ్రీహరి, దేగల రాఘవ, పులిగడ్డ బాలు శ్రీనివాస్, ఆకుల సీతామహాలక్ష్మి, డైరెక్టర్ అన్నపరెడ్డి వెంకటేశ్వరమ్మ, బాలమ్మ, నారేపాలెం శంకరరావు, వార్డ్ సభ్యులు అడపా వెంకటేశ్వరరావు, నాయకులు మండలి రామ్మోహనరావు, లుక్కా వెంకట పిచ్చియ్య, చెన్ను గాంధీ, చెన్ను బాబూరావు, లుక్కా శ్రీనివాసరావు, మెగావత్ గోపీ, భోగాది బాలకృష్ణ, బడే సుబ్బారావు, గుగ్గిలం శ్యాంకుమార్, షేక్ మొగల్ మురాద్ బేగ్, బాబావలీ, బషీర్, సోమిరెడ్డి, సిద్ధాబత్తుని హరినాథబాబు, బడే సుబ్బారావు, యాసం శ్రీరాములు, మైలా హరిబాబు, కొండవీటి పాండురంగారావు, గుడివాక నరహరి, బచ్చు ఆదినారాయణ, గుడివాక రాము, వాహేదుల్లా తదితరులు పాల్గొన్నారు.



## మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా పోలీస్ పెరేడ్ మైదానంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం

### విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన

ప్రజాభూమి ప్రతినిధి–మచిలీపట్నం

మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం కృష్ణా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ పెరేడ్ మైదానంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులతో సరదాగా ముచ్చటించారు. ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమానికి మచిలీపట్నం పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినిలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారికి పోలీస్ శాఖలో వినియోగిస్తున్న ఆయుధాలు, వాటి పనితీరు గురించి అధికారులు వివరంగా అవగాహన కల్పించారు. అలాగే పోలీస్ శాఖలో ఉన్న వివిధ విభాగాలు, వాటి విధులు, చట్టం, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర వంటి అంశాలపై కూడా విద్యార్థులకు తెలియజేశారు. పోలీసులు శాంతిభద్రతలు కాపాడటానికి, సంఘవిద్రోశక్తులను నిరోధించడానికి వినియోగించే అత్యాదునిక ఆయుధాలు,, మెషిన్ గన్లు, రివాల్వర్లు పిస్టల్ లు, గ్రేనేడ్లు, టియర్ గ్యాస్ షెల్, వైర్ లెస్ సెట్, డిహెచ్ఎండి, హెచ్ హెచ్ఎండి, బాంబు డిస్పోజల్ సిబ్బంది వినియోగించే పరికరాలు, డాగ్ స్క్వాడ్ వారు వినియోగించే పరికరాలు, పోలీసు జాగిలాల గురించి వివరించారు. ఎస్పీనే స్వయంగా వివిధ రకాల ఆయుధాల పనితీరు ఏ విధంగా ఉండేది, వాటిని ఎలా హ్యాండిల్ చేయాలి మొదలైన విషయాలను విద్యార్థులకు వివరించారు. కొన్ని



ఆయుధాలను ఎస్పీ స్వయంగా టార్గెట్ పై ఉపయోగించి అవి ఎలా పని చేస్తాయి, వాటితో జనసమూహం అధికంగా గుమిగూడినప్పుడు ఏ విధంగా చెదరగొట్టవచ్చు అనే విషయాలు విద్యార్థులకు తెలిసేలా ప్రదర్శించారు. విద్యార్థులు ఆద్యంతం ఆసక్తితో మరిన్ని ప్రశ్నలు అడిగి వాటి గురించి అదనపు సమాచారం తెలుసుకున్నారు. విద్యార్థినిలు వాటి పని తీరు తెలుసుకొని, ఆనందం వ్యక్తం చేసారు.

పోలీస్ జాగిలాలు యొక్క ప్రదర్శన ఆద్యంతం విద్యార్థులను ఆకట్టుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏ ఆర్ సత్యనారాయణ , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వై సత్య కిషోర్ , ఇన్స్పెక్టర్లు అబ్దుల్ నబీ , వాసా వెంకటేశ్వరరావు , రిజర్వ్ ఇన్స్పెక్టర్ రాఘవయ్య , ఎస్సైలు , ఆర్ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

### టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి–వేంపల్లె

స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) ద్వారా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి తెలిపారు. శుక్రవారం వేంపల్లెలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ పాఠశాల చుట్టూ కంపౌండ్ వాల్ లేకపోవడం, భవనం పైభాగం నుంచి తాగునీటి పైపు లైన్ వెళ్లడం వల్ల లీకేజీ ఏర్పడి తరగతి గదుల్లో తేమ చేరుతున్నట్లు తెలిపారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు జారి పడే ప్రమాదం ఉందన్నారు. అలాగే పాఠశాలలో విద్యుత్ వైరింగ్ సరిగా లేకపోవడంతో ఇటీవల ఓల్టేజ్ సమస్యల కారణంగా వైరింగ్ దెబ్బతిన్నట్లు తెలిపారు. వంటగది, డ్రాయింగ్ గది నిర్మాణం చేపట్టాలని ఉపాధ్యాయులు కోరారు. తాగునీటికి సంబంధించిన ఆర్‌ఓ ప్లాంట్ తరచూ మరమ్మతులకు గురవుతోందని, పాఠశాలలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు చదువుతున్నందున వారికి తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని హెచ్ఎం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రామముని రెడ్డి మాట్లాడుతూ వేసవి కాలం పూర్తయ్యేలోగా విద్యార్థులకు



తాగునీటి సమస్య రాకుండా టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) ద్వారా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల నిర్మాణాన్ని పూర్తి చేయడానికి కూడా కృషి చేస్తామని తెలిపారు. కంపౌండ్ గోడ నిర్మాణానికి ఇప్పటికే నిధులు మంజూరైనట్లు, పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, టౌన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహమ్మద్ ఇనాయతుల్లా, ఫయాజ్, దక్కా రమేష్, పాఠశాల చైర్మన్ బుజ్జి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు రామముని రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

## వీరపాండ్య కట్టబొమ్మన పాత్రలో పరకాయ ప్రవేశం చేసిన మంత్రి కందుల దుర్గేష్

- సాంస్కృతిక కార్యక్రమంలో అదరగొట్టిన పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి దుర్గేష్
- ముఖ్యమంత్రి, సహచర ప్రజాప్రతినిధుల ప్రశంసల జల్లు

ప్రజా భూమి ప్రతినిధి–విజయవాడ

బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ నిరంకుశత్వాన్ని ఎదిరించి, భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో విప్లవ జ్యోతిగా వెలిగిన వీరపాండ్య కట్టబొమ్మన పాత్రలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ అద్భుత నటనతో అలరించారు. అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా పడిన అనంతరం, శుక్రవారం సాయంత్రం



విజయవాడ పట్టణం పటమటలోని ఆంధ్ర లాక్స్ హాల్‌లో ప్రజాప్రతినిధుల కోసం ఆంధ్ర ప్రదేశ్ "శాసన వ్యవస్థ" ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆటవిడుపు"ఎమ్మెల్యే – ఎమ్మెల్సీ క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు – 2026 కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ తనదైన శైలిలో ఈ ప్రదర్శన ఇచ్చారు. కట్టబొమ్మన విశిష్ట ఆహార్యం, గంభీరమైన వాచకం, రాజసంతో మంత్రి దుర్గేష్ ఆ పాత్రలో జీవించేశారు. ఆయన వేదికపైకి రాగానే సభలో చప్పట్ల వర్షం కురిసింది. ఈ ప్రదర్శనను వీక్షించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మరియు సహచర మంత్రులు, ప్రజాప్రతినిధులు మంత్రి దుర్గేష్ నటనను వేనోళ్ల కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "దేశభక్తికి నిలువెత్తు రూపం వీరపాండ్య కట్టబొమ్మన అని, పాంచాలకురిచ్చి యుద్ధంలో ఆయన చూపిన సాహసం చిరస్మరణీయమని" కొనియాడారు. అటువంటి మహనీయుడి పాత్రను పోషించే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంత్రి కందుల దుర్గేష్ నటనా శైలి, సంభాషణల చాతుర్యం, పుణ్యభూమి నాదేశం నమోనమామి పాటలో ప్రభుత్వ చీఫ్ జీవి ఆంజనేయులు, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, సునీల్ కుమార్ తదితర సహచర ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రదర్శించిన తీరు సభికులను మంత్రముగ్ధులను చేసింది.

## ఏలేరు ఎడమ కాలువ లో ఇద్దరు యువకులు గల్లంతు.



ప్రజా భూమి ప్రతినిధి–ఏలేశ్వరం

ఏలేశ్వరం మండలం సి. రాయవరం గ్రామ సమీపంలోని తిమ్మరాజు గట్టు వద్దగల ఏలేరు ఎడమ కాలువలో బైకు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లడంతో బైకు పై ఉన్నా ఇద్దరు యువకులు ఏలేరు ఎడమ కాల్వ లో పడి నీట మునిగిన పోయారు. వీరి విషయం తెలిసిన వెంటనే ఆ నోట ఈ నోట విషయం బయటకు పొక్కడం తో వారిని రక్షించే ప్రయత్నం స్థానికులు చేసారు. ఒకనిని బయటకు తీయగా అతనిపై పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో యువకుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బయటికి తీసిన యువకుడు ఏలేశ్వరం గ్రామానికి చెందిన గిడుగులోవరాజుగా తెలిసింది ఇంకా వివరాలు తెలియ రావాల్సి ఉన్నది.

## సమస్యల పరిష్కారానికి రిలే నిరాహార దీక్షలు

### –పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని కార్మికుల డిమాండ్

ప్రజా భూమి ప్రతినిధి–హిందూపురం టౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం (సిఐటియూ) ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షలకు సిఐటియూ నాయకులు మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మహిళా కార్మికులు పనిచేసే ప్రదేశాల్లో తాగునీటి సదుపాయం కల్పించి, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే మహిళలు ఎదుర్కొనే నెలసరి సమయంలో మూడు రోజులపాటు ప్రత్యేక సెలవులు ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు దాటిన కారణంగా తొలగించిన కార్మికుల కుటుంబాల్లో వారి పిల్లలకు ఉద్యోగం కల్పించాలని కోరారు. అలాగే విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచి పనిభారం తగ్గించాలని, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అదనపు కార్మికులకు పీఎఫ్, ఈఎస్ ఐ వంటి సదుపాయాలు వర్తింపజేసి పని భద్రత కల్పించాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళి, రామాంజి, నరసింహాతో మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు.


Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Mohaneeswar Publications, D.No. 59-2-1,Ashoknagar 1st lane.Mogalrajpuram,Vijayawada-520008,Krishna district, Andhra Pradesh and Published from D.NO. 59-2-1,Ashoknagar1st lane,Mogalrajpuram,Vijayawada-520008,Krishna district, Andhra Pradesh, Editor :A.RAMAMOHANREDDY, RNI NO. APTEL/2011/41440, Phone No. Cell : 9502116677